ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. డబ్బుతో సమాధి—కృష్ణవేణి
15. సముద్రపు హోరు—భమిడిపాటి భాస్కరరామారావు
40. పంజరంలో చేరిన చిలకలు—వాణిశ్రీ
57. రోగిష్టి గ్లాసు—వసుంధర
78. పనిమనిషి కావాలా?—కృష్ణచైతన్య
99. మానభంగం—బొమ్మిడి అచ్చారావు
120. ఫోర్జరీ శవం—ఎం. వి. వి. సత్యనారాయణ
145. శ్రీకృష్ణవిగ్రహం—వాణిశ్రీ
161. సీక్రెట్ గ్యాంగ్ (సీరియల్)—'సికిందర్'

నవలలు (సప్లిమెంట్)

3. క్లూ ఇచ్చిన కాకిపిల్ల—సికిందర్
61. సంసారంలో సరిగమలు—వసుంధర
104. అల్పాయుష్కుడు—వాణిశ్రీ
142. కోటీశ్వరుని హత్య—టెంపోరావు
181. పొగమంచు (సీరియల్)—ముద్దా సురేష్

ఇవిగాక — క్రైములో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, జోక్స్, కార్టూన్లు మరెన్నో ఆకర్షణలు!!

డబ్బుతో సమాధి

కృష్ణవేణి



చాకలి బాన వంటి పెద్ద శరీరం దొర్లుకుంటూ పోలీసు స్టేషనులోకి అడుగుపెట్టింది.

ఆ శాల్తీని చూసి సార్జంటు తంగం యీల వేశాడు.

ఆ మనిషి ఆయాసపడుతూ ఇన్‌స్పెక్టర్ పళనివేలుకు ఎదురుగా వున్న బెంచిమీద కూర్చున్నాడు. కుర్చీ పట్టదు.

"సార్! మీరు తీసుకునే డైటు వివరాలు చెప్తారా!" అతి వినయంగా తంగం అడిగాడు.

"ఎందుకు నాయనా? నీవు అదే డైటు తీసుకుంటావా?" అతను ఆయాసపడుతూ అడిగాడు.

"అమ్మమ్మా! మీరు తీసుకునే ఏ ఐటమూ నేను తిన కుండా వుండాలని" తంగం అన్నాడు.

అతను "ఆహ....హ...." అంటూ నవ్వాడు.

ఆ నవ్వు కూడా కుండలో గులకరాళ్ళుపోసి గులకరించి నట్లు వున్నది.

"నేను రోజూ అన్నిరకాల మిల్ట్రీ పదార్థాలు తింటాను. ముఖ్యంగా రోజుకి నాకు నాలుగు కోళ్ళు కావాలి." అతను అన్నాడు.

తంగం గుడ్లని మిటకరించాడు.

తరువాత ఏదో అడగబోయాడు.

ఆ శాల్తీని చూడగానే తంగంలో బాల్య చాపల్యం రెప రెపలాడింది. అతనికే కాదు, ఎవ్వరికైనా అనిపించడం సహజం. పోతపోసిన స్థంభంలా అన్ని అవయవాలు ఒకే లావులో వున్నాయి మరి.

"సార్! మీ రొచ్చిన...." ఇనస్పెక్టర్ వినయంగా అడిగాడు.

అప్పుడు అతనికి తనొచ్చిన పని జ్ఞాపకం వచ్చి ఏడుపు గొంతుకతో "సా....ర్! మా నాన్నగారు కనిపించడం లేదు" అన్నాడు.

"వివరాలు అన్నీ చెప్పండి."

"మీకు తెలిసే వుంటుంది రామన్‌గారని...."

"ఓహో తెలుసు, పెద్ద బిజినెస్ మాగ్నెట్ రామన్" ఇనస్పెక్టర్ అన్నారు.

"అవును ఆయనే .... నేను ఆయనకి ఒక్కడినే కొడుకుని ...."

"అది తెలుస్తూనే వుంది ...." తంగం అన్నాడు.

"హుష్ ...." ఇనస్పెక్టరు పెన్‌తో టేబుల్ మీద కొట్టారు.

"మా నాన్నగారు కనిపించడం లేదు" మళ్ళీ విచారంగా అన్నాడు.

ఇతని శరీరం పెరిగింది గానీ బుద్ధి పెరగలేదని ఇన స్పెక్టరు గ్రహించి, ఓర్పుగా ప్రతి చిన్న ప్రశ్న వేయాలను కొని, "ఎప్పుడు నుంచి కనిపించడం లేదు" అడిగాడు.

"ఈ రోజు వుదయం నుంచి."

"నిన్నరాత్రి యింటిలోనే వున్నారా?"

"వున్నారు."

"ఏదైనా బిజినెస్ పనులు చూచుకోవడానికే వెళ్ళా రేమో ....?"

"రెండు సంవత్సరాల నుండి ఆయన ఆరోగ్యం బావుం డటం లేదు, డాక్టర్లు పూర్తి విశ్రాంతి కావాలని అన్నారు."

"మరి మీ బిజినెస్‌నంతా ఎవ్వరు చూస్తున్నారు" ఇన స్పెక్టరు ప్రశ్నించాడు.

"సినిమా హాళ్ళు, హోటల్సుని లీజుకి యిచ్చేశారు. నగరంలో వున్న చాలా బిల్డింగ్సుని అమ్మివేశారు ..."

"మరి మీరేం చేస్తారు?" తంగం మధ్యలో ప్రశ్నిం చాడు.

"ఒక మిలట్రీహోటలు మాత్రం నేను చూచుకొంటాను" నోరు చప్పరిస్తూ అన్నాడు.



"చచ్చాం" మనసులోనే అనుకున్నాడు తంగం.

"ఎక్కడికైనా షికారుకి వెళ్ళారేమో?" అనుమానంగా అన్నాడు.

"ఆయన ఒంటరిగా ఎక్కడికి వెళ్ళరు, వెళ్ళలేని మనిషి కూడాను" అతను సమాధానం యిచ్చాడు.

"మరి మీరేం అనుకుంటున్నారు?"

"ఏం అనుకోవాలో తెలియక మీవద్దకి వచ్చాను" అమాయకంగా అన్నాడు.

"మీ పేరేమిటి?"

"నా పేరు .... నా.... పేరు .... శ్రీనివాసు .... కానీ అందరూ నన్ను రోడ్డురోలర్ అని అంటారు."

ఇనస్పెక్టరు కూడా నవ్వకుండా వుండలేకపోయారు. తంగం సరేసరి.

"మీ నాన్నగారి వయస్సు ఎంత?"

"అరవై ఐదు వుండవచ్చు. కానీ కీళ్ళవాతం, షుగరు,

బి.పి. అన్నీ వున్నాయి. ఒకసారి హార్టు ఎటాకు, ఒకసారి లైటుగా పెరాలసిస్ వచ్చింది."

"మీ యింట్లో మెంబర్సు ఎవ్వరెవ్వరు?"

"నేను, మా నాన్నగారు, మా అమ్మ, మా ఆవిడ, యిద్దరి పిల్లలు, ఓ వంటవాడు, ఓ పనివాడు, ఓ తోటమాలి వున్నాం?"

"ఇప్పుడు వీళ్ళంతా వున్నారా?"

"సమ్మర్ హాలీడేస్‌కి మా ఆవిడ పిల్లలు వాళ్ళ అన్న గారి యింటికి బెంగుళూరు వెళ్ళారు. ఈ ఎండలకి తట్టుకో లేక మా అమ్మగారు వూటీ వెళ్ళారు. అక్కడ మా చెల్లెలు భర్తకి పెద్ద హోటలు వుంది" అన్నాడు.

"మీ ఫాదరుకూడా వెళ్ళవచ్చుకదా" తంగం అడిగాడు.

"అంతంత దూర ప్రయాణం చేయకూడదని డాక్టర్ల సలహా మేరకి ఆయన రెండు సంవత్సరాల నుండి ఎక్కడకి కదలడం లేదు."

"సరే! మీరు రిపోర్టు వ్రాసి యివ్వండి మేము మీ ఇంటి కొచ్చి చూస్తాము" ఇనస్పెక్టరు అన్నారు.

శ్రీనివాసు రిపోర్టు వ్రాసి యిచ్చాడు.

2

పెద్దబంగళా! చుట్టూ గార్డెను వున్నది. బంగళాకి ప్లాస్టిక్ వైట్ పెయింటింగ్ కొట్టారు. యెలా లేదన్నా ఓ పాతికవేలు పైన అవుతుంది ఆ పెయింటింగుకి.

అంటే, చెప్పడానికి వీలులేని ధనవంతులన్న మాట.

బయట గేటుకి "బివేర్ ఆఫ్ డాగ్స్" అనే బోర్డు వున్నది.

గేటువద్దకి వెళ్ళగానే పెద్దసైజు ఆల్సేషన్ డాగ్ భోయ్ మన్నది.

"రింగో....రింగో" కార్లోనుంచి శ్రీనివాసు అరిచాడు. కుక్క తోకాడిస్తూ వూరుకొంది.

"కుక్క యింట్లోవుంది కాబట్టి బయటనుండి క్రొత్త వారెవ్వరూ ముసలాయన్ని కిడ్నాప్ చేసే అవకాశంలేదు" తంగం నెమ్మదిగా అన్నాడు.

ఇనస్పెక్టర్ తల పంకించారు.

ముగ్గురూ లోనికి వెళ్ళారు.

"కూర్చోండి" అని బెల్ నొక్కాడు శ్రీనివాసు.

ఒక పనివాడు చేతులు కట్టుకొని వచ్చాడు.

"మూడు బోర్నవిటాలు తీసుకొనిరా!" ఆజ్ఞాపించాడు.

"డ్యూటీ ఫస్టు! ముందు మీ ఫాదర్ గదిలోకి వెళ్దాం రండి" ఇనస్పెక్టర్ లేచాడు.

"మా ఫాదరు మెట్లు ఎక్కలేరు, దిగలేరని హాలుకి ప్రక్కనున్న గదినే వాడుకుంటున్నారు. అయితే ఆయన గదిలోకి ఎవ్వరినీ రానిచ్చేవాడు కాదు, ఆఖరకి మా అమ్మను కూడా" ఆయాసపడుతూ శ్రీనివాసు అన్నాడు.

"ఎందుకని?" తంగం ప్రశ్నించాడు.

"ఏమో తెలియదు?"

"ఇంట్లో క్యాష్ వున్నదా?" ఇనస్పెక్టర్ అడిగాడు.

"అది కూడా నా కంతగా తెలియదు. అయితే వుందని నా అనుమానం, ఎక్కడ వుందో తెలియదు" చాల నిదానంగా చెప్పాడు.

"మరి మీ ఫాదరు మీల్సు, పాలు, మందులు వగైరా" ఇనస్పెక్టర్ అడిగారు.

"ఆయన యెక్కువ కాలం హాలులోనే కాలక్షేపం చేసేవారు. రాత్రి పాలు మందు కూడా హాలులోనే తీసుకొని,

తరువాత తన గదిలోకి వెళ్ళి తలుపేసుకొని పడుకునే వారు."

"ఐసీ" ఇనస్పెక్టరు తల పంకించాడు.

ముగ్గురూ రామన్ గదిలోకి వెళ్ళారు.

ఆ గదిని సగం ఆక్రమించుకొని పెద్ద సన్‌గ్లాసు మంచం వున్నది. దానిమీద ఫోమ్‌బెడ్ పరచివున్నది.

"మంచం సైజు, దానిషేపు చాల విచిత్రంగా వున్నదే" తంగం అన్నాడు.

"పది సంవత్సరాల క్రితం స్వయంగా ఆర్డరు యిచ్చి చేయించాడు. బెడ్డుకూడా" శ్రీనివాసు సమాధానం.

ఆ గదిలో మంచం, ఒక మూవింగ్ చైరు, రామాయణం, భారతం గీతాబోధామృతం పుస్తకాలు, చిన్న మంచినీళ్ళ కూజా మాత్రమే వున్నాయి. అంతకి తప్పించి మరేవీలేదు.

ఆయన వాడే అరు చెప్పులు అక్కడే వున్నాయి.

బాత్‌రూము లేనట్రీని ఈ వుదయం వుపయోగించినట్లు లేదు.

ఆ గదిలో ఏ విధమైన పోరాటపు చిహ్నాలు కనిపించ లేదు.

గదిలో వుండే ముసలాయన గదిలో నుండే యెలా మాయం కాగలడు? చాల విచిత్రంగా వున్నది.

గదిలో నుండి బయటకొచ్చి వంటవాడిని, పనివాడిని, తోటమాలిని తిరగవేసి మరగవేసి ప్రశ్నించారు.

వారివలన యెటువంటి క్లూ దొరకలేదు సరికదా తల నొప్పి మాత్రం వచ్చింది.

"పెద్దబాబుగారు తలుపులు తీసుకొని బయటకొచ్చి



కూర్చుంటేనే మేము వెళ్ళి ఇడ్లీ, హార్లిక్సు యిచ్చేది" అని పనివాడు అన్నాడు.

"మీకు ఫోన్‌కాల్స్ ఏమీ రాలేదా?" ఇనస్పెక్టర్ అడిగాడు.

"రాలేదు సార్!" యేడుపు గొంతుకతో అన్నాడు శ్రీనివాసు.

"చాల విచిత్రంగా వున్నది" సీరియస్‌గా ఆలోచిస్తూ అన్నాడు.

"సార్! నా కెందుకో మంచం చూస్తే అనుమానంగా వున్నది" తంగం అన్నాడు.

మళ్ళీ ముగ్గురు గదిలోకి వెళ్ళారు.

తంగం మంచంమీద వున్న ఫోమ్‌బెడ్డుని యివతలకి లాగి పారేశాడు. పైన దళసరి కార్డుబోర్డు వున్నది.

అది ఎత్తి గోడవార నిలబెట్టాడు. ఆ మంచం రెండు

అరలుగా కనిపించినది.

ఇనస్పెక్టరు మంచం చుట్టూ తడిమిచూశాడు. ఒకచోట ఆధారం దొరికింది. దాన్ని పట్టుకొని లాగి చూశాడు. టేబుల్ మోడల్‌గా ఆ కొటుని చేయించారు.

ఒక అర బరువుగా పిటపిటలాడుతూ బయటికి వచ్చింది. దానినిండా కొన్ని లక్షలు కరెన్సీ నోట్లు పేర్చి వుంది.

అంటే బ్లాక్‌మనీ అన్నమాట.

దానిని చూడగానే శ్రీనివాసు ముఖం వెలవెలా బోయింది. చేతులారా వురితాడు మెడలో వేసుకున్నట్లు అయిందే అన్న ఫీలింగు ఆతని ముఖంలో కదలాడింది.

ఇనస్పెక్టర్ రెండో అరని కూడా లాగాడు.

అది లాగగానే శ్రీనివాసు "కెవ్వు"న కీచుగొంతుకతో అరిచాడు.

దానిలోను నోట్లు వున్నాయి.

కానీ కొన్ని కట్టలని తీసేసి వాటి స్థానంలో రామన్ శవాన్ని నొక్కిపెట్టి వుంచారు.

అతని డబ్బుతోనే అతనిని సమాధి చేశారు ఎవరో తెలివిగా.

3

ఆ బంగళాలో సంచలనం బయలుదేరింది. ఆంబులెన్స్, కెమెరామెన్, డాక్టరు వచ్చారు. ఎలా తెలిసిందో కానీ పత్రికా విలేఖరులు కూడా బిల బిల లాడుతూ కెమెరాలతో వచ్చేశారు

ముగ్గురు పనివాళ్ళను అరెస్టు చేశారు వెంటనే.

నయాన అడిగినా భయాన అడిగినా వాళ్ళు మాకేం తెలియదనే అన్నారు.

పాపం శ్రీనివాసు సర్వం కోల్పోయినవాడిలా మేరు పర్వతంలా సోఫాలో కూలిపోయాడు.

అతని నోటి మాట పోయింది. కంటి చూపు పోయింది.

హై బి. పి.గా వుందని, అతనిని వెంటనే హాస్పటలులో చేర్చడం మంచిదని గవర్నమెంటు డాక్టరు ట్రీట్‌మెంటు ఇస్తూ చెప్పారు.

శ్రీనివాసుని వెంటనే హాస్పటలుకి అంబులెన్సులో తండ్రి శవంతోబాటు పంపించేయడం అయింది.

అతనికి తండ్రి మరణవార్తకన్నా అంతులేని ధన సంపత్తు గవర్నమెంటుపాలవుతుందే అన్న చింతే ఎక్కువై హాస్పటలు పాలు చేసింది. ఆ బంగళా పోలీసు వారితోనూ, ఇన్‌కంటాక్సువారితోనూ, వివిధరకాల పత్రికా విలేఖరులతోనూ, రామన్‌గారి శ్రేయోభిలాషులతోనూ నిండి పోయింది.

ముగ్గురు పనివారిలో ఒకరుగానీ లేదా ముగ్గురు కలిపి కూడబలుకుకొని గానీ యీ మర్డరు చేసివుంటారని ఇన్‌స్పెక్టర్ అనుమానం.

అయితే ఎన్ని విధాల అనుమానించినా ఒక్క మాట కూడా వాళ్ళ నోటినుండి రావడంలేదు.

రామన్‌గారి యింటిలో వున్న నాయరు కేరళావాడు. పాతిక ముప్పై సంవత్సరాలనుండి వారి యింటిలోనే వుంటున్నాడు. అతనికి పెండ్లి అయింది. ఒక కూతురు పుట్టిన తరువాత భార్య చనిపోయింది. ఆ కూతురిని అతని చెల్లెలు పెంచి తన కొడుక్కి పెండ్లి చేసుకొంది. నాయరు కూతురికి పదీ పరకా కేరళకి పంపుతూ వుంటాడు.

ఇన్నాళ్ళు పని చేశాడు కాబట్టి అతని పేరుమీద రామన్ గారు పదివేలు ఫిక్సెడు డిపాజిట్టులో వేశారు.

తోటమాలి పదేళ్ళనుండి ఆ యిల్లుని కనిపెట్టుకొని వుంటున్నాడు. అతనికి ఎవ్వరూ లేరు. ఆ బంగళాలోనే ఓ మూల పడివుంటాడు.

పనివాడు ముప్పైయేళ్ళవాడు. పదేళ్ళ నుండి పనిలో వున్నాడు. రాత్రికి యింటికి వెళ్ళిపోతాడు. పెండ్లి కాలేదు. ఒక ఏడాదినుండి ఒక స్త్రీతో వుంటున్నాడు. దానినే పెండ్లి చేసుకోవాలని అనుకుంటున్నాడు.

ఇన్‌స్పెక్టర్ వెంటనే కొందరు కాన్‌స్టేబుళ్ళను, తంగంను ఆ స్త్రీ యింటికి పంపించాడు.

రెండు లక్షల కరన్సీనోట్లు అతని ముండ యింటిలో ఓ కుండలో దొరికింది. చివరకు పనివాడు నేరం వొప్పు కున్నాడు.

రామన్ గదిలోకి రానీయకపోవడంతో వాడికి అను మానంవేసి, ఓ రోజు రాత్రి కిటికీపక్క వుండి చూశాడట. రాత్రి తలుపులు వేసుకొని ఆ కరన్సీని ఆయన తడిమి తడిమి చూసుకొని కొన్ని నోట్లని వొళ్ళో పెట్టుకొని కూర్చోవడం ముద్దు పెట్టుకోవడం చేశాడట.

ఆ తరువాత చాలాసార్లు గమనించగా ఆయన ప్రతి రోజూ అలానే చేస్తున్నాడట.

ఉంచుకున్న ముండ చీరలుకోసం నగలకోసం అబు గుతూ వుండగా కొంత డబ్బుతో దానితో పరారు అయి హాయిగా బ్రతకవచ్చని యీ పని చేశాడట. అది అతను ఇచ్చిన స్టేటుమెంటు. □

సముద్రపు హోరు

భమిడిపాటి భాస్కర రామారావు

చుట్టూ చూసింది రమ ఒక్క సారి. కనుచూపు మేరలో ఎవరూ లేరు. సముద్రం హోరు తప్ప మరేమీ విని

పించడంలేదు. ఉండీ ఉడిగి ఏదో ఒక కారు తప్ప మరేమీ సంచారం కనిపించలేదు రమకు. చేతివాచీ చూసుకుంది. అప్పటికే ఎనిమిది దాటుతోంది. చలిగా కూడా అనిపించింది రమకు.

"అమ్మో! అప్పుడే ఎనిమిది దాటింది. లేవండి పోదాం! లేవండి పోదాం!" అంది రమ, భర్త రాఘవతో.

పేవ్‌మెంటు బెంచీమీద రమకు దగ్గరగా అనుకుని ఏదో తన్మయంలో మునిగిపోయిన రాఘవ, రమవైపు చూచి, "కొంపేం మునిగిపోలేదు లెద్దూ! వెళదాంలే" అన్నాడు లేచిన రమను జబ్బ పట్టుకుని కూచోపెడుతూ.

"చుట్టుప్రక్కల ఎవరూ లేరండీ! అసలే రోజులు బాగోలేవు." అంది రమ భయంగా.

ఇక తప్పదన్నట్టు లేచాడు రాఘవ. రోడ్డువరకూ వచ్చారు యిద్దరూ కలిసి.

ఇంతలో చర్రున దూసుకుంటూ వచ్చి పేవ్‌మెంట్ వారగా వాళ్ళ దరిముందూ ఆగిందొక కారు.

పేవ్‌మెంట్‌మీద నుండి దిగబోతున్నవారల్లా ఉలిక్కిపడి ఆగిపోయి కారువైపు తేరిపార చూచారు. ఆ చీకటిలో ఆ కారు ఎరుపో నలుపో, నీలమో అర్థంకాలేదు వారిద్దరికి. వాళ్ళు తేరుకొని ఆ ప్రక్కగా రోడ్డుమీదకు దిగబోయారు.

"ఆగండి!" అంటూ కారులోంచి దిగారు యిద్దరు దృఢకాయులు.

"ఎవరు మీరు?" అడిగాడు రాఘవ.

"పోలీసులు!" వాళ్ళు చెప్పిన జవాబు.

"అయితే మాతో యేం పని?" కోపంగా అడిగాడు రాఘవ.

"అల్లాగా! ఏరా నాన్నా! రాత్రిపూట ఈ తిరుగు

దేమిట్రా!" వాళ్ళలో ఒకడి ప్రశ్న.

"అర్థంలేకుండా మాట్లాడకండి! భార్యాభర్తలు బీచీకి రావడం తప్పా?" రాఘవ ప్రశ్న.

"మీరిద్దరూ మొగుడూ పెళ్ళాలా? సరే! రండి స్టేషన్‌కు అక్కడే తేల్చుకోవచ్చు" అంటూ వారిలో ఒకరు రమ చేయి పట్టుకుని లాగసాగాడు.

"ముందామె చెయ్యి విడిచిపెట్టు!" గద్దించాడు రాఘవ.

ఈలోగా మొదటివాడు ఆమెను కారులోకి నెట్టాడు. తనూ లోపలకెక్కి ఆమెనోరు నొక్కి కదలకుండా పట్టుకున్నాడు.

"అయితే నడవండి!" అని తనూ కారువైపు అడుగు వేశాడు రాఘవ.

"నువ్వెందుకురా చిట్టి నాన్నా! అది చాలు!"అని రాఘవ గడ్డం క్రింద బలంగా మోది, అప్పుడే స్టార్ట్ చేసిన కారు ఎక్కాడు రెండవవాడు.

ఊహించని దెబ్బతో క్రిందపడిన రాఘవ నిలదొక్కుకుని పైకి లేచేటప్పటికే కారు కనుచూపుమేర దాటి పోయింది.

2

"....ధన మాన ప్రాణ రక్షకులుగా వుండవలసిన రక్షక భటులే దురాగతాల కొడిగడితే యిక ఈ పోలీసు డిపార్టుమెంట్ యెందుకు? ఒకటా రెండా! ఇప్పటికప్పుడే నాలుగు. ప్రజలు బీచ్‌వైపుకు వెళ్ళడానికే భయపడుతున్నారు. వారి భయం పోగొట్టడానికి యీ పోలీసులేం చేస్తున్నారు?...." అంటూ ఘాటుగా వ్రాసిన స్థానిక దిన పత్రిక చదువుతున్న డిటెక్టివ్ ప్రభాకర్ ఏకాగ్రతను

భంగం చేస్తూ టెలిఫోన్ మ్రోగింది. డిటెక్టివ్ ప్రభాకర్ ఫోనె త్తి,

"హలో! డిటెక్టివ్ ప్రభాకర్ స్పీకింగ్!" అన్నాడు.

"హలో ప్రభాకర్! నేను! కమలాకరరావును మాట్లాడుతున్నాను."

"ఓ! కమిషనర్‌గారా? నమస్తే. ఏమిటి విశేషాలు?" అడిగాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"నమస్తే. విశేషాలకేం? బోలెడు. తెల్లవారగానే పేపర్‌లో చదివే ఉంటారు."

"ఏదీ? ఆ స్త్రీల అపహరణ వృత్తాంతమా?" అడిగాడు ప్రభాకర్.

"అదే మిస్టర్ ప్రభాకర్! అక్కడికీ మావాళ్ళు శాయశక్తులా ప్రయత్నం చేస్తూనే వున్నారు. ఏమీ ప్రయోజనం లేకపోయింది. పైగా పోలీసులే ఈ దురాగతాలకు కారకులన్న పుకారు కూడా వ్యాపించింది.

వచ్చే వారంలోనే అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అవుతాయి. ప్రతిపక్ష సభ్యులు ఈ విషయం ఆధారంగా ప్రభుత్వాన్ని దులిపి పారేస్తారు. ఆలోగా ఈ కేసు తేల్చాలని హోమ్ మినిష్టరు తాఖీదు.

స్త్రీల అపహరణ కేసు ఇనస్పెక్టర్ రామకృష్ణ కప్పగించాం. ఆ కేసు తాలూకు ఫైల్సు తీసుకుని రామకృష్ణ మీ దగ్గరకు వస్తాడు. ప్లీజ్! మీరూ పూనుకుంటేకాని లాభంలేదు" అని ముగించారు కమలాకరరావుగారు.

ఫోన్‌పెట్టి ఆలోచిస్తూ కూచున్నాడు డిటెక్టివ్ ప్రభాకర్. అసిస్టెంట్ హరి ఏదో అనబోతున్నాడు. ఇంతలో కాలింగ్ బజర్ మ్రోగింది. హరివైపు, 'ఎవరో చూడు!' అన్నట్టు చూచాడు డిటెక్టివ్ ప్రభాకర్.

హరి వెనక ఆవేశంగా లోపల కడుగుపెట్టాడొక యువకుడు. ఆవేశం, దాని చాటున విపరీతంగా దుఃఖించిన జాడలు కనిపిస్తున్నాయి అతడి ముఖంలో. అతడికి సుమారు పాతిక సంవత్సరాలుండవచ్చుననుకున్నాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"సార్! నాపేరు మాధవరావు. మీ సహాయంకోరి వచ్చాను" అన్నాడతడు లోపల కడుగుపెడుతూనే.

చెప్పమన్నట్టు చూచాడు డిటెక్టివ్ ప్రభాకర్ మాధవరావు వైపు.

"నా భార్యపేరు లక్ష్మి. మూడు రోజుల క్రితం ఎవరో అపహరించారు నా యెదురుగానే! వెంటనే పోలీసులకు రిపోర్టు చేశాను. కాని ఏం లాభం? ఈ రోజు ఉదయం పోలీసుల ఎదురుగానే ఆమెను హత్యచేశారు ఆ దుండగులు" చెప్పాడు మాధవరావు.

"మీ భార్య నెక్కడ అపహరించారు?"

"జూలాజికల్ పార్కు ప్రాంతాల - బస్సు దొరక్క నడిచి వస్తున్న మాకు లిఫ్టు యిస్తామని కారెక్కించు కున్నారు. కారు కొంత ముందుకు వెళ్ళాక ఒక టర్నింగ్‌లో కారు స్లోచేసి నన్ను బయటకు నెట్టి చరున దూసుకు పోయారు."

"మీ భార్య లక్ష్మి శవం దొరికిందెక్కడ?"

"బీచ్ రోడ్‌లో."

"నేనా పనిమీదే వున్నాను. హంతకులను పట్టుకొని తగిన శిక్షపడేటట్టు చూస్తాను. మీరు వెళ్ళండి" చెప్పాడు డిటెక్టివ్ ప్రభాకర్.

మాధవరావు వెళ్ళడానికి లేచాడు. సరిగ్గా ఆ సమయం లోనే లోపల కడుగుపెట్టాడు ఇనస్పెక్టర్ రామకృష్ణ.

ఇనస్పెక్టర్ రామకృష్ణ, మాధవరావు వైపు చూచి, "ఏమయ్యా! మమ్మల్ని నిలబడనియ్యవేమిటి? ఇక్కడకు కూడా వచ్చావు" అన్నాడు కొంచెం చిరాకుగా.

"మీవల్ల ఏమీ కాదని తేలిపోయాక ఇంకేం చేస్తాను" కొంచెం నిరసనగా అన్నాడు మాధవరావు.

"ఏమిటి? మావల్ల కానిది?" కోపంగా అన్నాడు ఇన్స్పెక్టర్ రామకృష్ణ.

"కోపం ఎందుకు ఇనస్పెక్టర్‌గారూ! 'హెల్ప్! హెల్ప్!' అంటూ బీచ్ రోడ్డున పరుగెడుతున్న నా లక్ష్మికి అక్కడి పోలీసులేం చేయగలిగారు? పోనీ, ఆమెను కాల్చి కారులో పారిపోతున్న హంతకులను పట్టుకోగలిగారా? పట్ట పగలే ఏమీ చేయలేకపోయిన పోలీసులవల్ల ప్రయోజనం వుంటుందని ఆశించడంలో అర్థం వుందా?

ఇంతకూ నా ఖర్మ. మొదటిరోజునే డిటెక్టివ్ ప్రభాకర్ గారి నాశ్రయించి వుంటే నా లక్ష్మి నాకు దక్కి వుండేది" అని నెత్తి కొట్టుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు మాధవరావు.

ఇనస్పెక్టర్ రామకృష్ణవైపు చూచాడు డిటెక్టివ్ ప్రభాకర్. ఇన్స్పెక్టర్ రామకృష్ణ కూచుని హ్యాట్ తీసి టీపాయ్ మీద పెట్టి ముఖంమీద పట్టిన చెమట అద్దుకుని, "మాధవరావు చెప్పినది నిజమే! మా జవాన్ లిద్దరు అప్పుడు బీచ్ రోడ్డునే వున్నారు. కాని ఏమీ చెయ్యలేకపోయారు" అన్నాడు కొంచెం సిగ్గుపడుతూ.

"కనీసం ఆ కారును వెన్నాడలేకపోయారా?" అడిగాడు డిటెక్టివ్.

"అనుకోకుండా ధామ్మని పిస్తోలు పేలడం, ఒక స్త్రీ కెవ్వున అరుస్తూ నేలకూలడంతో దిగ్భ్రమచెంది, ముందా

ఫ్రీని ఆదుకోవడమా లేక కారును వెన్నాడడమా అని ఒక్కక్షణం తటపటాయించారు. చివరకు ఒకడు ఫ్రీని చూడడానికి, మరొకడు కారును వెన్నాడడానికే నిర్ణయించు కున్నారు.

కాని అప్పటికే కారు కనుమరుగయింది. అయితే మా జవాన్‌లతో ఒకడు ఆ కారు హోటల్ మనోరంజన్ ప్రక్క నుండే సందులోకి తిరగడం చూచాడట. దానితో ఆ వైపుగా వెళ్ళాడు మోటార్ బైక్‌మీద" చెప్పాడు ఇన స్పెక్టర్ రామకృష్ణ.

"ఇంతకూ ఆ కారు జాడ ఏమైనా తెలిసిందా? కనీసం కారు నంబరేనా గుర్తించారా మీ వాళ్ళు?" అడిగాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"ఆ కారు ఎటు వెళ్ళినదీ మా వాళ్ళకు అంతుచిక్క లేదు. ఎందుచేతనంటే ఆ రోడ్డు కొంచెం ముందుకు వెళ్ళాక మూడుదార్లుగా చీలిపోతుంది. ఒకటి తిన్నగా ముందుకుపోయేది. ఎడమవైపుకొక రోడ్డు. కుడివైపు హోటల్ మనోరంజన్ వెనుక భాగం. అయితే అది ముదురు నీలంరంగు పాతమోడల్ ఫోర్డుకారు. నంబరు గుర్తించారు. కాని అది దొంగనంబర్" చెప్పాడు ఇనస్పెక్టర్ రామకృష్ణ.

"ఈ కేసు నీ కప్పజెప్పినట్లు కమీషనర్‌గారు చెప్పారు. ఏమైనా ఆచూకీ తీశావా?" అడిగాడు డిటెక్టివ్ ప్రభాకర్ రామకృష్ణ తెచ్చిన ఫైలు తిరగేస్తూ.

"ఏదీ! ఈ నగరంలో ఎక్కడో పెద్ద జూద గృహం నడుస్తోందని. అక్కడ అన్నివిధాలైన అక్రమవ్యాపారాలూ యధేచ్ఛగా సాగుతున్నాయనీ ఎవరో అనామకుడు రిపోర్టు చేశాడట. నన్ను ఆ కేసు పరిశోధించమన్నారు. మధ్యలో

ఈ గొడవ వచ్చిపడింది.

ఈ జరిగిన అపహరణలు కూడా వేర్వేరు ప్రాంతాల్లో జరిగాయి. ఎక్కడని మొదలుపెట్టడం? అన్నిచోట్లా తగిన బందోబస్తు ఏర్పాట్లు చేద్దామన్నా తగినంత స్టాఫ్ లేదు" అన్నాడు రామకృష్ణ.

"రామకృష్ణా! ఈ పైలు నువ్వు జాగ్రత్తగా గమనించావో లేదో, అన్ని అపహరణ వృత్తాంతాల్లోనూ ఒక సమానధర్మం కనిపిస్తోంది" అన్నాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"అవును, దుండగులు వాడే కారు ఒకటి. వాళ్ళు పోలీసులమనిగాని, లిఫ్టు యివ్వడానికి సిద్ధపడ్డవాళ్ళనిగాని తేలుతోంది. అవునా?" అన్నాడు ఇనస్పెక్టర్ రామకృష్ణ.

"కాదు" అన్నాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"అయితే ఏమిటి?" కాస్త ఆశ్చర్యంగా అడిగాడు రామకృష్ణ.

"స్త్రీలను ఏ ప్రదేశం నుండి ఎత్తుకుపోయినా, వాళ్ళను తీసుకవెళ్ళేటప్పుడూ, తిరిగి బయటకు పంపేటపుడూ వాళ్ళకు సముద్రం హోరు వినిపించిందన్నారు. అందరి వాఙ్మూలంలోనూ ఆ మాట వుంది" చెప్పాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"అవును సుమా! నువ్వు ప్రత్యేకం చెప్పేవరకూ నా దృష్టి అటు వెళ్ళలేదు. అయితే ఆ దుండగుల స్థావరం సముద్రతీరాన్నే ఎక్కడో వుందన్న మాట. అయితే ఓ పనిచేస్తాను" అన్నాడు ఇనస్పెక్టర్ రామకృష్ణ.

"ఏం చేస్తావు?" అడిగాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"బీచ్ రోడ్డున మఫ్టీ పోలీసులను కాపలా పెడతాను."

"అంతే కాదు! దుండగులు మరో అపహరణకు పూనుకొనేటట్లు చూడాలి?"



ఈలోగా సార్జెంట్ శంకరం వచ్చాడు, లక్ష్మి పోస్ట్ మార్టమ్ రిపోర్టు పట్టుకుని.

'పోస్టుమార్టం రిపోర్టు ఇలా ఉంది—హతురాలిని కాళ్ళు చేతులూ త్రాళ్ళతో బంధించినట్లు గుర్తులున్నాయి. ఆమెను అమానుషంగా చెరిచారు. వెనుక నుండి పేల్చిన పిస్తోలు గుండు గుండెలగుండా దూసుకుపోవడంతో వెంటనే మరణించింది.'

"గట్టిగా మూసుకుని వున్న ఆవిడ గుప్పెటలో యిది దొరికింది సార్!" అంటూ అర్థరూపాయ సైజులో వుండే ఒక ప్లాస్టిక్ బిళ్ళ అందించాడు సార్జెంట్ శంకరం.

డిటెక్టివ్ ప్రభాకర్ దానినందుకుని పరిశీలించాడు. దాని మీద ఒకవైపున 'యమ్' అనే ఇంగ్లీషు అక్షరం దాని దిగువన '25' అంకె వున్నాయి.

"రామకృష్ణా! ఇది చూడు!" అని ప్లాస్టిక్ బిళ్ళ ఇనస్పెక్టర్ రామకృష్ణ కందించాడు డిటెక్టివ్ ప్రభాకర్.

ఇనస్పెక్టర్ రామకృష్ణ ఆ బిళ్ళను పరిశీలించి, "అవును. ఇది పెద్దపెద్ద క్లబ్బులలో డబ్బుకు బదులుగా వాడేదాని లాగే వుంది. 'యమ్' అంటే మనీ. ఇక ఆ అంకె రూపాయలైనా కావచ్చు. పైసలైనా కావచ్చు. అది ఆ క్లబ్బు స్తోమతనుబట్టి వుంటుంది" అన్నాడు.

"యమ్ అంటే మనీయే ఎందుకు కావాలి. అది ఆ క్లబ్బు తాలూకు పొడి అక్షరం ఎందుకు కాకూడదు?" ప్రశ్నించాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"నువ్వన్నది కావచ్చు. కేవలం ఒక్క పొడి అక్షరంతో పూర్తిపేరు తెలుసుకోవడం ఎలా?" ఎదురు ప్రశ్నవేశాడు రామకృష్ణ.

"కష్టమే! ఊహిద్దాం. యమ్ అంటే మనోరంజన్ ఎందుకు కాకూడదు?"

"మనోరంజన్ మాత్రం కాదు" స్థిరంగా చెప్పాడు రామకృష్ణ.

"ఎందుచేత?"

"ఇంతకు మునుపే అక్కడ జూదమాడుతున్నారన్న అనుమానంతో మారువేషంలో యెన్నోమార్లు వెళ్ళి పరిశోధించాను. అనుమానించడానికి ఏమీ ఆధారాలు కనిపించ లేదు" చెప్పాడు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ.

"అలాగా! సరే! మన ప్రయత్నం మనం చేద్దాం!" అని, "రామకృష్ణా! మరో సంగతి. ప్రస్తుతానికి మనకు తెలిసినదాన్నిబట్టి చూస్తే స్త్రీల అపహరణకు, నువ్వు వెతుకుతున్న జూదగృహానికి సంబంధం ఉందేమో నని పిస్తోంది" అన్నాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"అలా ఎందుకనుకుంటున్నావు?"

"హతురాలైన లక్ష్మి చేతిలో దొరికిన బిళ్ళనుబట్టి అలా అనుకుంటున్నాను. నా ఊహ పొరపాటూ కావచ్చునుకో. కాని ముందుగా నువ్వో పని చేయాలి."

"ఏమిటది?"

"తీరానికి సమీపంలో "యమ్" అనే అక్షరంతో ప్రారంభమయే హోటళ్ళు, క్లబ్బుల లిస్టు వెంటనే నా కందేలా చూడు" చెప్పాడు డిటెక్టివ్ ప్రభాకర్.

ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ సరేనని లేచాడు. రామకృష్ణ వెళ్ళాక హరికి కొన్ని సూచనలిచ్చాడు డిటెక్టివ్ ప్రభాకర్.

3

"బాస్! ఏమైనా ఆచూకీ దొరికిందా?" అడిగాడు హరి.

"రామకృష్ణ పంపిన లిష్టులో "యమ్"తో ప్రారంభమయే క్లబ్బులేమీ లేవు. ముంతాజ్, మాలిని, మాయా మొదలైన తీరానికి చేరువలో ఉండే హోటళ్ళన్నీ చూచాను. వాటిని వేటినీ అనుమానించడానికి లేదు. ఇక మిగిలినదల్లా హోటల్ మనోరంజన్" అని,"నీ ప్రయత్నం ఎంతవరకూ వచ్చింది?" అని అడిగాడు హరిని.

"ఈ మూడురోజులుగా మీరు చెప్పిన ప్రకారమే చేస్తున్నాను. కాని ఇంతవరకూ ఎవరూ ఎదురుపడలేదు. కాని చాటునుండి యిద్దరు కనిపెడుతున్నారు."

"పోలీసుల నిఘా వుంటుందనే ఉద్దేశంతో తాత్కాలికంగా దుండగులు పైకి రాకపోవచ్చు. రామకృష్ణ పోలీసు నిఘా వుపసంహరించాడుకదా! ఏదో ఒకనాడు మళ్ళీ కార్యకలాపాలు మొదలుపెట్టకపోరు. మన ప్రణాళిక మధ్యలో ఆపుచెయ్యకు" చెప్పాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"అలాగే బాస్!"

"చూడు హరీ! నే నీ రోజు హోటల్ మనోరంజన్‌లో ప్రవేశిస్తాను. రామకృష్ణను రమ్మని ఫోన్ చెయ్యి. అతడు చేయవలసినది చెప్పాలి" అని తన రూమ్‌లోకి వెళ్ళాడు డిటెక్టివ్ ప్రభాకర్.

4

హోటల్ మనోరంజన్‌లో అడుగుపెట్టాడు మారు వేషంలో డిటెక్టిన్ ప్రభాకర్.

"రూమ్ కావాలి."

"ఎన్నాళ్ళుంటారు? మీ పేరు?"

"సుమా రొక వారం. నా పేరు మీర్జా."

"రోజుకు అద్దె యాభై రూపాయలు. అడ్వాన్సు కట్టండి."

అయిదు వందనోట్లుతీసి బల్లమీదకు విసిరాడు.

కేష్‌కౌంటర్‌లోని వ్యక్తి అవి లెక్కించి, "ఇంత అక్కరలేదు" అన్నాడు.

"ఫరవాలేదు—ఉంచండి" అని మేడమెట్లవైపు ఒక అడుగువేసి, "ఒక బాటిల్ విస్కీ, సోడాలు పైకి పంపండి. అది కూడా ఫారిన్ సరుకే!" అన్నాడు.

"ఫారిన్ సరుకు యిక్కడ దొరకదు."

"అరె! యిక్కడ అన్నీ దొరుకుతాయని పట్టాభి చెప్పాడే!" అన్నాడు.

అక్కడకు రావడానికి ముందే మనోరంజన్‌తో మంచి సంబంధాలున్నవా రెవరు, వారిలో ప్రస్తుతం ఊళ్ళో లేని వా రెవరు అన్న విషయాలు తెలుసుకునే వచ్చాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"పట్టాభా!" అన్నాడు కేష్‌కౌంటర్‌లోని వ్యక్తి.

డిటెక్టివ్ ప్రభాకర్ తిరిగి కేష్‌కౌంటర్ దగ్గరకు వచ్చి,

"క్షమించండి. పట్టాభి చెబితే యిక్కడ బస చేయడానికి వచ్చాను. మనోరంజన్ పేరు చెప్పగానే స్టేషన్ నుండి జేక్సీవాలా ఇక్కడకే తీసుకువచ్చాడు. మరో మనోరంజన్ హోటల్ ఉందా ఈ నగరంలో?" అన్నాడు.

కేష్‌కౌంటర్‌లోని వ్యక్తి గాభరాపడి, "అబ్బెబ్బె! సారీ! పైకి వెళ్ళండి! పంపిస్తాను" అన్నాడు.

డిటెక్టివ్ ప్రభాకర్ పైకి వెళ్ళిన కొద్దిసేపటికే తలుపు మీద చప్పుడయి, "మే ఐ కమిన్!" అన్నారెవరో.

"యస్! కమిన్!" చెప్పాడు డిటెక్టివ్.

తలుపు తెరుచుకుంది. ఫుల్‌సూట్‌లో ఒక స్ఫురద్రూపి, అతడి వెనుక ట్రే పట్టుకుని వెయిటరు లోపల కడుగు పెట్టారు.

"మీరు పట్టాభి స్నేహితులా? నా పేరు మహేష్! ఈ హోటల్ నడుపుతున్నాను" పరిచయం చేసుకున్నాడు.

మహేష్ అక్కడి బల్లమీది పేక చూచి, "మిష్టర్ మీర్జా! మీరు పేక బాగా ఆడతారా?" అని అడిగాడు.

"ఏం చూస్తారు?" అని పేక బాగా కలిపి మహేష్‌ముందు పెట్టాడు. మహేష్ పేక కోశాడు. మీర్జా తనకూ మహేష్‌కూ మూడేసి ముక్కలు పంచి,

"మిష్టర్ మహేష్! చూసుకోండి మీవి రెండాసులు ఒక రాజు. నావి మూడు రాజులు" అన్నాడు.

మహేష్ తెరిచిచూచి ఆశ్చర్యపోయాడు. మీర్జా తిరిగి మూడు నాలుగుసార్లు రకరకాలుగా ముక్కలు పంచి చూపించాడు.

మహేష్ సంభ్రమంలో మునిగిపోయి, "మిష్టర్ మీర్జా! చిన్న రిక్వెస్టు" అన్నాడు.

ఏమిటన్నట్టు కనుబొమ ఎగరేశాడు మీర్జా.

"ఏమీలేదు. క్లబ్ సెక్షన్‌లో ఈమధ్య చాలా లాస్ వస్తోంది. నువ్వు కొద్దిరోజులు నీ ప్రావీణ్యంతో సొమ్ము సంపాదించాలి. లాభాలు ఫిఫ్టీ ఫిఫ్టీ! నీ ఖర్చులన్నీ హోటల్ భరిస్తుంది. ఇంకా ఏమైనా కావాలంటే...." అన్నాడు భావ గర్భితంగా.

పట్టాభికి తనకు మధ్య ఎంత స్నేహం ఉన్నదీ, పట్టాభి జీవితంలోని రహస్య విషయాలు తను తెలుసుకున్నవి, మాటలమధ్య మహేష్ పలుకులవల్ల ఊహించినవి చక్కగా చెప్పడంతో మహేష్, ప్రభాకర్‌ను ఆ విధంగా అడిగాడు. అంతేకాక పట్టాభి ఆ హోటల్‌లో ఒక వాటాదారుడని కూడా గ్రహించాడు.

డిటెక్టివ్ ప్రభాకర్ నవ్వుతూ మహేష్ ముఖంవైపు చూచాడు.

"మీర్జా! మీరు నా మాట నమ్మడంలేదుకదూ? మందు, మగువ ఏది....ఏది కావాలన్నా సరే! కాని నువ్వు చెయ్యవలసిందల్లా పేకాటలోని నీ సామర్థ్యంతో ఒళ్ళు వాచిన వాళ్ళ డబ్బు దుళ్ళగొట్టడమే" మహేష్.

డిటెక్టివ్ ప్రభాకర్ గల గలా నవ్వాడు. అది హాసమో అపహాసమో అర్థం కాలేదు మహేష్‌కు. అయోమయంగా చూడసాగాడు.

"డోంట్‌వర్రీ మహేష్! నేను వచ్చిందే అందుకు" అన్నాడు ప్రభాకర్ భరోసా యిస్తున్నట్లు.

"మహేష్! ఆట ఎన్నింటికి మొదలవుతుంది?" అని అడిగాడు.

"సరిగ్గా రాత్రి ఎనిమిది గంటలకు" చెప్పాడు మహేష్.

మీర్జా వాచ్‌కేసి చూచి "ఇక పావుగంటే వుంది ఎని



మిదికి. నడు వెడదాం." అని బ్రీఫ్ కేసులోంచి రెండు నోట్ల కట్టలు తీశాడు.

"ఇవి దేనికి? ఇక్కడివి పనికిరావు. కాకపోయినా నీ పెట్టుబడి హోటలే భరిస్తుంది."

"అయితే పందెం కాయడానికేముండాలి? బంగారం కాసులా?" ఆశ్చర్యంగా అడిగాడు మీర్జా.

"వాటికి వేరే టికెట్స్ ఉన్నాయిలే!" అని కొన్ని ప్లాస్టిక్ టోకెన్స్ తెప్పించాడు మహేష్.

డిటెక్టివ్ ప్రభాకర్ వాటిని చూచాడు. హతురాలు లక్ష్మి చేతిలో చూచిన లాంటివే అవి. కాకపోతే ఇవి వివిధ సంఖ్యలతో వున్నాయి.

"వాటిమీది సంఖ్య రూపాయలు. క్లబ్ సెషన్‌లో ప్రతీ వస్తువుకూ ఆ టోకెన్స్ యిస్తే చాలు. ఆ టోకెన్స్‌ను హోటల్ కౌంటర్‌లో రూపాయలుగా మార్చుకోవచ్చు" చెప్పాడు మహేష్.

5

"ఆహా! అద్భుతం! మీర్జా! నీ ప్రజ్ఞతో లక్ష రూపాయిలు లాగించావు రాత్రి. ఇదిగో నీ వాటా యాభై వేలు" అని బల్లమీద పెట్టాడు మహేష్.

"అది సరేగాని మహేష్! క్లబ్బు హాలు వెనుకవైపుకు మరో దారి వుందా?" అడిగాడు మీర్జాగా వ్యవహరింపబడుతున్న డిటెక్టివ్ ప్రభాకర్.

మహేష్ కొద్దిగా కంగారుపడి, "ఆ! అది నీ కెలా తెలిసింది? కొంపతీసి నువ్వు పి. ఐ. డీ. వి కాదుగదా?" అన్నాడు నవ్వుతూ.

డిటెక్టివ్ ప్రభాకర్ కూడా నవ్వి "అనవసరంగా గాభరా పడతావు దేనికి? వెనుక వైపు ద్వారం వుందని తెలుసుకుందుకు పి. ఐ. డీ. యే కావాలా? మనం లోపలకు వెళ్ళిన ద్వారంవైపే ముఖం పెట్టి కూచున్నాను నేను. కొంతసేపుండి నువ్వు బయటకు వెళ్ళావు. మళ్ళీ కొంతసేపయాక లోపలకు వచ్చావు. ఎదుటి ద్వారం నుండి మాత్రం రాలేదు. అంటే ఏమనుకోవాలి?"

"నువ్వు అసాధ్యుడివే!" అన్నాడు మహేష్ వెర్రి నవ్వు నవ్వుతూ.

"మిస్టర్ మీర్జా! నేను చేసే పనులు చేపట్టే కార్యక్రమాలు వింటే నీకు నిజంగా తల తిరుగుతుంది. పోలీసులను, పి. ఐ. డీలను తికమక పెట్టలేకపోతే మన వ్యాపారం జరగదు" అని అంటుండగా,

"మే ఐ కమిన్!" అని ఒక కోయిల స్వరం వినిపించడం, ఆ వెంటనే ఒక సుందరి లోపల కడుగు పెట్టడం జరిగింది.

మీర్జా ఆమె వైపు, మహేష్‌వైపు మార్చి మార్చి

చూచాడు.

మహేష్ నవ్వుతూ, "మీర్జా! ఈ మెసు నీ ఖుషీ కోసం రప్పించాను" అని బయటకు వెళ్లాడు.

కొద్ది క్షణాల్లోనే "మహేష్! మహేష్!" అని కేక వేస్తూ బయటకు వచ్చాడు మీర్జా.

"ఏం మీర్జా! ఏమిటి?" అడిగాడు మహేష్. అతడి వెంట మరో యిద్దరు దృఢకాయు లున్నారు.

"అది నా కక్కర లేదు. పంపించెయ్."

"అదేమిటి? అది ఫ్లవర్ ఫ్రెష్! నీ గురించి ప్రత్యేకం రప్పించాను."

"అవసరం లేదు. నాకు కావలసినది ఫ్యామిలీ సరుకు. అదయితే తన సర్వస్వం పోతోందని ఏడ్చి మొత్తుకుని ఎదుర్కొంటుంది. అప్పుడే వుంటుంది అసలు మజా!"

"అరె! చాలా ఆశ్చర్యంగా వుందే! మీర్జా! నా టేస్టు, నీ టేస్టు సరిగ్గా ఒక్కలాగే వున్నాయి. కాని చాలా చిక్కు వచ్చిపడిందే!" అని తన వెంటవున్న దృఢకాయుల వైపు తిరిగి, "కాళీ! శివా! మీ రిద్దరూ కలసి మన మీర్జాగారి కొరక కొత్తపిట్ట లాక్కురాలేరూ?" అన్నాడు.

"తేవచ్చు కాని ఇంకా పోలీసుల నిఘా ఉంటుందేమో అని భయం బాస్!" అన్నారు.

"వాట్! పోలీసుల నిఘాయా? ఇంత మహానగరంలో ఒక పిట్టనుపట్టుకురాలేరూ? మిష్టర్ మహేష్! ఇలాంటి వాజమ్మలను పెట్టుకునా నువ్వు వ్యాపారం నడిపేది?" నిప్పులు కురిపించాడు మీర్జా.

కాళీ, శివా యిద్దరూ గుర్రుగా చూసారు మీర్జా వైపు.

"కోప్పడకు మీర్జా! వీళ్ళను తక్కువగా అంచనా య్యకు పిట్టలవేటలో వీళ్ళు దిట్టలు. అందులో ఏమీ

సందేహంలేదు. ఈ మధ్య చురుకుపాలు ఎక్కువై కొంచెం ఎక్కువ మొతాదులో ప్రవర్తించారు. తప్పించుకు పారి పోతున్న ఒక పిల్లను కాల్చి చంపవలసి వచ్చింది కూడాను" మీర్జాను అనునయించే ధోరణిలో అన్నాడు.

"దట్సాల్‌రైట్! అయితే ఫోన్‌చేసి నా ఏర్పాటు నే చూచుకుంటాను" చెప్పాడు మీర్జా.

"ఎక్కడికి ఫోన్ చేస్తావు?"

"ఈ నగరంలో నా ఏజంటొకడున్నాడు. అతడికి ఫోన్ చేస్తాను."

మహేష్ ఆందోళన పడ్డాడు. ఏదో సందేహం పొడ సూపింది అతడి హృదయంలో. మీర్జావైపు చూచి,

"తొందరెందుకు మీర్జా! ఈ రాత్రికి నీకు కావలసిన ఏర్పాటు నేను చూస్తాను కదా!" అని అతడిని అను నయించి గదికి పంపించి తిరిగి వచ్చాడు.

6

"జాన్!" పిలిచాడు మహేష్. కాళీ, శివాలవైపు తిరిగి "మీరు కూడా వినండి" అన్నాడు.

ముగ్గురూ అతడు చెప్పేదాని కోసం ఎదురు చూడ సాగారు.

"జాన్! మీర్జాగా మనముందు వున్న వ్యక్తి విషయంలో నాకు కొంచెం సందేహంగా వుంది. అసలు మనం ముందే జాగ్రత్తపడవలసింది" అని

"పట్టాభి తిరిగి వచ్చేదెప్పుడు?" అని అడిగాడు.

"ఈ వారంలో వస్తాడు" చెప్పాడు కౌంటర్‌లో వుండే జాన్.

"పట్టాభి తిరిగి వచ్చేవరకూ మీర్జాను ఓ కంట కనిపెట్టు. బయటకు వెళ్ళకుండా చూడు. బయటకు ఫోన్ చెయ్యకుండా

చూడు" అని జాన్‌తో చెప్పి, కాళీ శివాలవైపు తిరిగి,

"ఏదేనా కొత్త పిట్టకోసం ప్రయత్నించండి. పట్టాభి తిరిగి వచ్చేవరకు మీర్జాను నిలిపి వుంచవచ్చు. ఇతడు నిజంగా పట్టాభి, స్నేహితుడే అయినే మనకు వచ్చిన భయం ఏమీ లేదు. కాకపోతే చల్లగా చంపి సముద్రంలో పారవేయవచ్చు" అన్నాడు మహేష్.

"గత రెండు రోజులుగా ఒక జంట సరుగుడు తోటకు వస్తున్నారు. బాస్! పోలీసుల సంచారం కూడా కానరావటం లేదు" అన్నాడు కాళీ.

"ఆ గుంట జాంపండులా వుంది బాస్! మొన్ననే లాక్కొద్దామనుకున్నాం. కాని మీ ఆజ్ఞ లేదుకదా అని వూరకున్నాం...." అన్నాడు శివా.

"వాళ్ళు సి.ఐ.డీ. లేమో?" సందేహంగా అన్నాడు మహేష్.

"అబ్బే! వాళ్ళు కేవలం కొత్తగా పెళ్ళయిన జంట" అన్నారు కాళీ, శివా ఒక్కమారే.

"అలా ఎలా చెప్పగలరు?"

"ఎంతసేపూ ఇరుకు కొంపల్లో సరసం సాగడంలేదనీ, అత్తా, ఆడబిడ్డల అడ్డువల్ల కులాసాగా మాట్లాడుకుందుకే వుండడం లేదనీ అన్న కబుర్లుతప్ప మరోమాటే మాట్లాడుకోవడంలేదు వాళ్ళు. సమయం వృధా అయిపోతోందన్న తపనే కనిపిస్తోంది వాళ్ళతో."

"వాళ్ళనెవరేనా వెన్నాడుతూంటే వాళ్ళను మోసపుచ్చడానికలా మాట్లాడుతున్నారేమో?"

"మేం వాళ్ళను కనిపెట్టి వుండడం వాళ్ళకు తెలిస్తేకదా? కాకపోయినా అలాటి అనుమానం వున్నవాళ్ళు వెనకా

ముందూ చూచుకుంటూ వుంటారు వాళ్ళదగ్గర ఆ ధోరణి కనిపించలేదు."

"సరే! జాగ్రత్తగా పని ముగించుకుని రండి."

7

"అమ్మో! అప్పుడే తొమ్మిదయింది. లేవండి పోదాం" అంది సరుగుడు తోటలో తన సహచరుడితో వున్న స్త్రీ.

"సుజాతా! తొమ్మిదేకద అవుత. వెడదాంలే!" అన్నా డతడు.

"రోజులు బాగాలేవు. లేవండి పోదాం."

"వారం నుండి వస్తున్నాం. ఏమీ జరగలేదు. ఇవాళ కొంప మునుగుతుందా?"

"అప్పుడు పోలీసులు తిరుగుతుండేవారు బీచ్ రోడ్డున. రెండు రోజులుగా వాళ్ళు కనబడటంలేదు. ఎందుకేనా మంచిది, లేవండి పోదాం."

"సరే! నీకు భయంగా ఉన్నట్టుంది. లే పోదాం" అంటూ "నీ భయం కాని, ఎవళ్ళెదురుపడినా తుక్కు రేగ గొట్టనూ!" అన్నాడు.

"శత్రువు ఎదురుపడితే మీరు త్రివిక్రమావతారమే ఎత్తగలరని నాకు తెలుసు హరి మహాశయా! కాని దొంగ దెబ్బతీస్తే!" అంది నవ్వుతూ, తమ ముందు వెడుతున్న ఆకారాలను చూడమన్నట్లు సౌజ్ఞ చేస్తూ.

తనూ ఆ విషయం గుర్తించానన్నట్టు సుజాతకు సౌజ్ఞ చేసి ఆమెను వెంట పెట్టుకుని రోడ్డెక్కాడు హరి.

"ఆగండి!" ఒక్క గర్జనతో నిలిచిపోయా రిద్దరూ.

"ఎవరు మీరు?" ప్రశ్నించాడు హరి.

"పోలీస్!" ఇద్దరు దృఢకాయులు ఒక్కమారే జవా బిచ్చారు.

"కాదు కాదు! మీరు దొంగలు!" పిచ్చిగా అరిచి సుజాత చెయ్యి పట్టుకుని పరుగు దియ్యబోయాడు.

ఆ యిద్దరిలో ఒకడు సుజాత చెయ్యి పట్టుకుని, నోరు నొక్కి రోడ్డుకు ఆ వైపున ఉన్న కారు దగ్గరకు లాగ సాగాడు.

తిరగబడపోతున్న హరివైపు బలంగా చెయ్యి విసిరాడు రెండవవాడు. హరి ఆ దెబ్బ తప్పించుకొని "హెల్ప్! హెల్ప్!" అని అరుస్తూ ఆ వైపుగా పరుగెత్తాడు.

అక్కడికి దగ్గరగా వున్న ఒక చెట్టు నీడలో ఆపిన తన స్కూటర్ వైపు పరుగెత్తాడు హరి.

అప్పటికే దుండగుల కారు బయలుదేరింది. ఒక్క వుదుటున స్కూటర్ స్టార్టుచేసి హెడ్‌లైట్ వెలిగించకుండానే కారును వెన్నాడసాగాడు.

ముందు పోతున్న కారు హోటల్ మనోరంజన్ వెనుక సందులోకి తిరగడం చూచాడు. రోడ్డు మొగలోనే స్కూటరాపి కారు మనోరంజన్ వెనుక ఆవరణలోకి తిరగడం

చూచి తనూ మెల్లగా వెళ్ళి ఆవరణలో ప్రవేశించాడు హరి.

8

"సార్! మీరప్పుడే తిరిగి వచ్చారేమిటి? మీ మిత్రుడు మీర్జా క్రింద క్లబ్‌లో వున్నాడు" అప్పుడే లోపలకు వచ్చిన పట్టాభితో అన్నాడు జాన్.

"నా మిత్రుడేమిటి? వాడెవడో సి. ఐ. డీ. అయి వుంటాడు. నడు, వాడి సంగతి తేల్చేద్దాం!" అన్నాడు పట్టాభి గాభరాగా.

ఇద్దరూ అండర్‌గ్రౌండుకు చేరుకున్నారు.

"ఏడీ! వాడెక్కడ?" అడిగాడు పట్టాభి.

మూలనున్న ఒక బల్లవైపు చూపించి, "అదుగో ఆ ఎడమవైపు కుర్చీలో వున్నవాడు" చెప్పాడు జాన్.

పట్టాభి గబ గబా ఆ బల్ల దగ్గరకు వెళ్ళి, "అరేయ్! ఎవర్రా నువ్వు?" అని మీర్జా గడ్డం పట్టుకుని గుంజాడు. గడ్డం వూడివచ్చింది.

"ఆ! నువ్వా?" అని జాన్ వైపు తిరిగి, "జాన్! వీడు డిటెక్టివ్ ప్రభాకర్! వీడు యిక్కడెలా ప్రవేశించాడు?" అన్నాడు పట్టాభి.

"మీ స్నేహితుడిగా చెప్పుకుంటే మహేష్‌గారే యిక్కడ ప్రవేశపెట్టారు" అని జేబులోంచి రివాల్వర్ తీసి "సార్? డిటెక్టివ్‌ను పైలోకానికి పంపించేదా?" అన్నాడు జాన్.

"ఇక్కడ కాదు. మహేష్ గదికి తీసుకు వెడదాం! క్లబ్బులో అనవసర రక్తపాత మెందుకు?" అన్నాడు పట్టాభి.

డిటెక్టివ్ ప్రభాకర్ చుట్టూ చూశాడు. ఎందరో రేసు కుక్కలవంటి వ్యక్తులు తన వైపే చూస్తున్నారు. తిరగబడడానికి అది అదను కాదనుకున్నాడు. వారి వెంట వెళ్ళడమే ప్రస్తుత కర్తవ్యం అనుకున్నాడు. మౌనంగా లేచాడు.

9

"వెరీగుడ్! సాధించుకొచ్చారన్నమాట!" అన్నాడు అప్పుడే సుజాతతోబాటు లోపల కడుగు పెట్టిన కాళీ, శివాలతో మహేష్.

కాళీ, శివా గర్వంగా చూచారు.

"దాని చేతికట్లు ఊడదీసి ఉంచండి. నేను పోయి మీర్జాను తీసుకుని వస్తాను" అని వెనుక గదివైపు బయలుదేరాడు మహేష్.

సుజాత వెనుక నిలబడ్డ శివా సుజాత చేతికట్లు విడదీశాడు. అతడు కట్లు విడదీసి తియ్యగానే సుజాత ఒక్క సింహనాదంచేసి, ముందున్న కాళీ మెడమీద ఎగిరి ఒక్కటి కొట్టింది చేతిని కత్తిలా చేసి. విరుచుకు పడిపోయాడు కాళీ.

అదే సమయంలో గదిలో అడుగుపెట్టిన హరి శివా మెడమీద అదే విధంగా కొట్టాడు. శివా కూడా నిలువునా నేల కూలాడు.

జరిగిన హఠాత్సంఘటనకు ఒక్క క్షణం నివ్వెరపోయాడు మహేష్. హరి చటుక్కున జేబునుండి రివాల్వర్ తీసి మహేష్ వైపు గురిపెట్టాడు.

"నీ చేతిలోని రివాల్వర్ క్రింద పారెయ్! లేకపోతే నీ బాస్ అన్యాయంగా చస్తాడు" గర్జించాడు జాన్.

హరి నివ్వెరపోయి ముందుకు చూచాడు. ఎదురుగా

తన బాస్ తలకు రివాల్వర్ ఆన్చి నిలబడి వున్నాడు జాన్. అతడి వెనుక పట్టాభి.

హరి, సుజాతవైపు చూచాడు. ఒక్క లిప్తలో రెండు జతల కళ్ళూ ఏదో మాట్లాడుకున్నాయి.

డిటెక్టివ్ ప్రభాకర్ అదనుకోసం చూస్తున్నాడు. హరి పిస్తోలు క్రిందకు జారవిడిచాడు. సుజాత ఒకడుగు ముందు కేయబోయింది.

"అక్కడే ఆగు! ఆడదానివని జాలి దలచను" జాన్ గర్జన.

ఒక్క క్షణం అవకాశం చాలు డిటెక్టివ్ ప్రభాకర్‌కు. పాములా చర్రున జారి మెరుపు వేగంతో జాన్ మెడమీద కొట్టాడు. ఆ దెబ్బకు జాన్ చాప చుట్టలా ప్రక్కన వున్న పట్టాభిమీద పడ్డాడు. జాన్ చేతిలోంచి జారిపడిన రివాల్వర్ డిటెక్టివ్ ప్రభాకర్ స్వాధీనం చేసుకున్నాడు.

హరి జారవిడిచిన రివాల్వరందుకోబోతున్న మహేష్ నెత్తిమీద ఒక పిడి గుద్దు వేశాడు హరి. తన రివాల్వర్ తను తీసుకున్నాడు.

డిటెక్టివ్ ప్రభాకర్ సూచన మేరకు డోర్ కర్టెన్స్ చింపి అక్కడ పడి ఉన్న అయిదుగురినీ బంధించారు హరి సుజాతా కలసి.

"సుజాతా! హరీ! మీ రిద్దరూ ఇటునుండి చుట్టు తిరిగి హోటల్ ముందుభాగానికి వెళ్ళండి. సుజాతా! నువ్వు వెళ్ళ గానే ఇన్‌స్పెక్టర్ రామకృష్ణను తన మందీమార్బలంతో రమ్మని ఫోన్ చెయ్యి.

హరీ! ఇటువైపునుండి క్లబ్బులోనివారెవరూ బయటకు పోకుండా నేను చూస్తాను. ముందువైపునుండి ఎవరూ బయటకు పోకుండా నువ్వు చూడు. అవసరమనుకుంటే

కాల్చడానికి జంకకు" అని చెప్పాడు డిటెక్టివ్ ప్రభాకర్.

హరి, సుజాత తల ఊపి బయటకు వెళ్ళారు.

10

"హుం! ఎవరు పెద్దమనుషులో ఎవరు సంఘ విద్రోహులో తెలుసుకోవడం దుర్లభమై పోతోంది ఈ రోజుల్లో! కలికాలం!" అన్నాడు రామకృష్ణ, డిటెక్టివ్ ప్రభాకర్‌తో.

"రామకృష్ణా! నా కేసుతోబాటు నీ సమస్య కూడా తీరింది. అసెంబ్లీ సమావేశాలలోగా దురాగతాల నరికట్టావు గనుక హోమ్ మినిస్టరుగారు హాయిగా వూపిరి పీల్చుకుంటారు. నీకు ప్రమోషన్ కూడా వస్తుందేమో" అన్నాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"ఏదో నీ దయవల్ల ఈ గండం గడిచింది. ప్రమోషన్ మాట దేము డెరుగు! రివర్షన్ వచ్చేది ఈ కేసు తేలక పోతే. నీ ఋణం తీర్చుకోలేననుకో!" అన్నాడు రామకృష్ణ అభినందనపూర్వకంగా.

"నాదేం లేదు. నువ్వేమయినా రుణపడి ఉంటే తన ప్రేయసిని పులిబోనులోకి తోపిన మా హరికీ, చలాకీగా అందుకు సిద్ధపడ్డ మా సుజాతకు మాత్రమే!" అన్నాడు డిటెక్టివ్ ప్రభాకర్. □

పొలం చివరకు-?

ఒక ఆసామి తన పొలం ఎంత పెద్దదో వివరిస్తున్నాడు: "ఉదయం కారులో బయలుదేరితే మధ్యాహ్నం అయ్యేసరికి మా పొలం ఆ చివరకు చేరుకుంటాము."

వెంటనే ప్రక్కనున్నతను అన్నాడు: "ఒకప్పుడు నాకూ్కడా అటువంటి కారుండేది లెండి!"

—డి. వి. ప్రసాద్, హైద్రాబాదు

పంజరంలో చేరిన చిలిపి లేడి!

వాణిశ్రీ



మోడరన్ ఎంటర్‌ప్రైజెస్ ఆఫీస్ నగరం మధ్యలో విశాలమైన ఆవరణలో డీసెంట్ బిల్డింగ్‌లో వుంది.

శ్రీధర్ సిటీబస్ దిగి ఆఫీసు మెయిన్‌గేటు దగ్గరికి

వచ్చి నిల్చున్నాడు. గేటు మూసివుంది.

అతన్ని చూసి ఘూర్ఖావాచ్‌మెన్ గోడ ప్రక్కనుంచి వచ్చాడు బీడీ చివరి దమ్ములాగి అవతల పడేస్తూ.

"క్యా హోనా సాబ్?" ప్రశ్నార్ధకంగా చూశాడు.

తనకు హిందీ రాదన్నట్లు తల అడ్డంగా వూపి తన అడ్రస్ రాసిన స్లిప్ అతని చేతికిచ్చాడు.

అదిచూసి అటూ ఇటూ త్రిప్పి తిరిగి ఇచ్చేశాడు వాచ్‌మెన్.

గేటుతీసి చెయ్యి చూపించాడు ఆఫీసువైపు.

శ్రీధర్ ఫైల్ చేత్తో పట్టుకుని నడిచాడు.

ఎంక్వయిరీ బోర్డు ముందు పెట్టుకుని కూర్చున్న యువతి అతన్ని చిరునవ్వుతో పలకరించింది.

"వాట్ కెన్ ఐడూ ఫర్ యూ?"

శ్రీధర్ ఆమెతో తను వచ్చిన పని చెప్పాడు.

ఆమె పెదవి విరిచి "నో వేకెన్సీ ప్లీజ్." అంది.

అతని ముఖంలో విషాదచ్ఛాయలు ఆవరించాయి. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా నిల్చుండిపోయాడు. ఆమె సీరియస్‌గా తన పని చూసుకుంటోంది.

తెల్లటి దుస్తుల్లో టక్ చేసుకుని టిప్‌టాపుగా వున్న అతన్ని ఎవరో కస్టమర్ అనుకుని రిసీవ్ చేసుకుంది. తీరా చూస్తే అతనొక నిరుద్యోగి. ఏదైనా వుద్యోగం కావాలట.

"మేడమ్!"

ఆ యువతి తలెత్తి చూసింది.

"మే ఐ మీట్ యువర్ ప్రొప్రయిటర్?"

"యూ కెన్ సెండ్ యువర్ విజిటింగ్ కార్డు టూ హిమ్!" అంది.

ఏ.పి.రూమ్ డోర్‌పైన ఐ. వి. గోపాలరావు, ప్రొప్రయిటర్ అనే నేమ్ ప్లేట్ వుంది.

యూనిఫారంలో వున్న జవాన్ స్టూలుమీద కూర్చుని వున్నాడు.

శ్రీధర్ స్లిప్ అతని చేతికి ఇచ్చాడు.

అరగంట తర్వాత పిలుపు వచ్చింది.

జవాన్ డోర్ తెరచి వెళ్ళమన్నట్లు సంజ్ఞ చేశాడు.

"గుడ్‌మార్నింగ్ సర్!" విష్ చేశాడు శ్రీధర్.

"వెరీ గుడ్‌మార్నింగ్. ప్లీజ్ టేక్ యువర్‌సీట్." అన్నాడు గోపాలరావు.

ఇబ్బందిగా చూశాడు శ్రీధర్.

"ఫరవాలేదు కూర్చో." అన్నాడు.

శ్రీధర్ కూర్చుని "త్రివిక్రమరావుగారు మిమ్మల్ని కలుసుకోమని చెప్పారు," అన్నాడు.

"అవును. నీ గురించి ఫోన్ చేసి చెప్పాడు."

"నా పొజిషన్ ఏమీ బాగా లేదు సార్! మీరు ఏదైనా జాబ్ ఇస్తే తప్ప గత్యంతరంలేదు." వినయంగా అన్నాడు శ్రీధర్.

"అవన్నీ త్రివిక్రమరావు చెప్పాడు. పాపం ఎమ్.ఏ. ప్యాసయ్యావటగా?"

"అవునుసార్!"

"కాని ప్రస్తుతం నా దగ్గర ఏమీ వేకెన్సీలు లేవు. ఏదైనా వస్తే చూస్తాను." అన్నాడు గోపాలరావు.

"మీరలా అంటే ఎలా సార్! ఎంతచిన్న పోస్టయినా సరే చెయ్యడానికి సిద్ధంగా వున్నాను. ఆఖరికి జవాన్‌గా అయినా సరే."

గోపాలరావు నవ్వాడు.

"ఎమ్. ఏ. చదివి జవాన్ వుద్యోగం చేస్తావా?"

"నా పరిస్థితులు అంత ఘోరంగా వున్నాయి సార్!" అన్నాడు శ్రీధర్ దీనంగా.

"త్రివిక్రమరావు నీకెలా తెలుసు?"

"బ్యాంక్ స్ట్రీట్‌లో అయన క్యాష్‌బ్యాగ్ ఎవరో కొట్టేశారు. నేను అది కనిపెట్టి దొంగను పట్టుకున్నాను. అదే మా పరిచయం సార్!"

"ఓ.... ఐ.సీ...."

"మీరు ఆయన బెస్ట్‌ఫ్రెండ్ అని చెప్పారు. తప్పకుండా ఏదోక జాబ్ ఇస్తారని అన్నారు. ఎంతో ఆశతో వచ్చానుసార్! నన్ను నిరాశ పరచరని నమ్ముతున్నాను."

తర్వాత గోపాలరావు అతన్ని గురించి వివరాలు అడిగాడు. అడ్రస్ నోట్ చేసుకున్నాడు.

"వారం తర్వాత కన్పించు." అన్నాడు.

శ్రీధర్ నమస్కారం చేసి సంతృప్తిగా బైటకు నడిచాడు.

2

"నెల రోజుల్నుంచి రోజూ ఎదురు చూస్తున్నానుసార్! కాని మీనుంచి ఏమీ ఆర్డర్స్ రాలేదు." అన్నాడు శ్రీధర్.

"నిజమే. కాని ప్రస్తుతం నా దగ్గర ఏమీ ఖాళీలులేవు. జవాన్ వుద్యోగం గూడా లేదు. అయినా నీకు అటువంటి జాబ్ ఇవ్వడానికి నా మనసొప్పడంలేదు." అన్నాడు గోపాలరావు.

"చాలా ఇబ్బందిగా వుందిసార్!"

"కాని నిన్నుచూస్తే అలా అన్పించడం లేదోయ్! ఇబ్బందిగావుంది అంటున్నావేగాని చూడ్డానికి కాస్ట్లీ మనిషిగా కనిపిస్తున్నావ్. నీట్‌గా టక్‌చేసుకుని పూల

రంగడిలా తిరుగుతున్నావ్." అన్నాడు గోపాలరావు నవ్వుతూ.

శ్రీధర్ పేలవంగా నవ్వాడు.

"అది మా మిడిల్ క్లాస్ వాళ్ళ దౌర్భాగ్యం సార్! తినడానికి తిండి లేకపోయినా పైకి దర్జాగా జీవిస్తున్నట్లు అంతా అనుకోవాలని ప్రవర్తిస్తాం."

"ఒక పనిచెయ్యి!"

శ్రీధర్ ఆశగా చూశాడు.

"జగన్ అని నాకు తెలిసినతను వున్నాడు. అతన్ని కలుసుకో. ఏదోక పని చూపిస్తాడు."

"అలాగే సార్!" సంతోషంగా అన్నాడు శ్రీధర్.

"ఇక వెళ్ళు." అన్నాడు జగన్ అడ్రస్ వున్న స్లిప్ ఇచ్చి.

"లెటర్ ఏదైనా ఇస్తారా సార్?"

"అవసరంలేదు. ఇదిచూపిస్తే చాలు." అన్నాడు. గోపాలరావు.

"థాంక్స్ సార్!" అని బైట పడ్డాడు శ్రీధర్.

అడ్రస్ వున్న స్లిప్‌వైపు చూశాడు.

'డి.కె. జగన్, 4-4-44, న్యూకాలనీ' అని వుంది.

శ్రీధర్ సిటీ బస్టాప్ వైపు నడిచాడు.

డి.కె. జగన్ అడ్రస్ వెతుక్కుంటూ న్యూకాలనీలో తిరగసాగాడు శ్రీధర్.

అది అధునాతనంగా కట్టబడిన కాలనీ. ఎక్కువగా అన్నీ రెండంతస్థుల బిల్డింగ్సు వున్నాయి. ప్రతి బిల్డింగ్‌చుట్టూ ముళ్ళతీగలతో ఫెన్సింగ్, విశాలమైన ఆవరణలో పూల మొక్కలు ముచ్చట గొల్పుతున్నాయి.



అది నగరం చివర సముద్రానికి దగ్గరగా వుంది. సముద్రుడి హోరు చిన్నగా వినిపిస్తూ వుంది.

నాలుగో లైనులో, నాలుగో అడ్డరోడ్డులో నలభై నాలుగో ఇంటిముందు ఆగిపోయాడు శ్రీధర్. ఐరన్ గేటుకి డి.కె. జగన్ అనే బ్రాస్ నేమ్ ప్లేట్ వుంది. ఇన్ అని వుంది కాబట్టి ఇంట్లోనే వున్నాడన్న మాట అనుకున్నాడు శ్రీధర్.

గేటు తెరవబోయాడు.

శ్రీధర్‌ని చూపి గొలుసుతో కట్టేసిన అల్సేషియన్ కుక్క మొరిగింది.

కుక్క అరుపు విని నౌకరు వచ్చి గేటువంక చూశాడు.

శ్రీధర్ దగ్గరికి వచ్చి "ఎవరు కావాలి?" అని ప్రశ్నించాడు.

గోపాలరావు ఇచ్చిన స్లిప్ అతని చేతికిచ్చి "మీ అయ్యగారి కివ్వు" అన్నాడు.

అతను లోపలికెళ్ళి పది నిముషాల తర్వాత తిరిగి

వచ్చాడు. గేటు తెరిచి పట్టుకుని "రండి" అన్నాడు.

అంత ఖరీదైన బిల్డింగ్‌లో ఖరీదైన జీవితం గడుపుతున్న జగన్ మాత్రం ఖరీదైన మనిషిలా కన్పించలేదు శ్రీధర్‌కి. అతన్ని చూడగానే ఒక గూండా గుర్తొచ్చాడు. పెద్ద పెద్ద గుబురు మీసాలతో, పహిల్వాన్‌లా లావుగా, నల్లగా తుమ్మమొద్దులా వున్నాడు. పిల్లలు అకస్మాత్తుగా చూస్తే దడుచుకునేట్లు వున్నాడు.

"నువ్వేనా శ్రీధర్" అన్నాడు జగన్.

తల వూపాడు శ్రీధర్.

"కూర్చో" సోఫా చూపించాడు.

కూర్చున్నాక ఖాళీ గ్లాసులో విస్కీ పోశాడు. నౌకరు సోడా కొట్టిపోసి ఐస్ క్యూబ్స్ వేశాడు.

"తీసుకో...."

"నాకు అలవాటు లేదండీ."

పక పక నవ్వాడు.

"పుట్టగానే ఎవడికీ ఏ అలవాటూ వుండదు. కాని మనం చేసుకోవాలి" అన్నాడు.

"అబ్బే! నాకు వద్దండీ."

"వూఁ .... నీ గురించి గోపాలరావుగారు ఫోన్‌చేసి చెప్పారు కాబట్టి ఏదోక పని ఇద్దామనుకుంటున్నాను" అన్నాడు జగన్.

శ్రీధర్ ముఖం వికసించింది.

"థాంక్స్....థాంక్స్ సార్!" అన్నాడు సంతోషం వ్యక్తపరుస్తూ.

"నీకు కారు నడపడం వచ్చా!"

"వచ్చు సార్! లైసెన్స్‌గూడా వుంది. డ్రైవర్ పని ఇచ్చినా చేస్తాను" అన్నాడు శ్రీధర్.

"కారు నడపడం వస్తే చాలు. లైసెన్సులు అక్కర్లేదు" అన్నాడు.

శ్రీధర్ తలెత్తి గదిని పరిశీలనగా చూస్తున్నాడు.

జగన్ ఐరన్ బీరువా తీసి తెల్లకాగితాలు తెచ్చి అతని ముందు వుంచి "సంతకాలు పెట్టు" అన్నాడు.

శ్రీధర్ తెల్లబోయి జగన్ ముఖంలోకి చూశాడు.

"తెల్ల కాగితాల మీదనా?" ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

"అవును."

"ఎందుకు?"

"నీ కిచ్చే వుద్యోగం అటువంటిది" అన్నాడు జగన్.

"ఏం వుద్యోగం?"

"నామీద నమ్మకంవుంటే తెల్లకాగితాల మీద సంతకాలు పెట్టు. లేదా తిరిగి చూడకుండా పో...." చిరాగ్గా అన్నాడు జగన్.

శ్రీధర్ మారుమాట్లాడక నాలుగు తెల్లకాగితాల మీద సంతకాలు చేశాడు.

"సరిగ్గా చేశావా?"

తల వూపాడు శ్రీధర్.

"నువ్వు వుద్యోగం కావాలని గోపాలరావుగారి కంపెనీలో పెట్టిన కాగితం వుంది. దానిమీద ఇదే సంతకం వుండాలి."

"అదే సంతకం. కావాలంటే చూసుకోండి" అన్నాడు శ్రీధర్.

"రేపు రా నీకు వుద్యోగం ఇస్తాను" అన్నాడు జగన్.

4

మర్నాడు వుదయమే జగన్ ఇంటికి వెళ్ళాడు శ్రీధర్.

"రా. కూర్చో" అన్నాడు జగన్ అతన్ని చూడగానే.

"అరేయ్! జంగయ్యా! రెండు టీ తీసుకురా" అని కేకపెట్టాడు.

శ్రీధర్ చెవులు రిక్కించి కూర్చున్నాడు, జగన్ తనకు ఎటువంటి వుద్యోగం ఇస్తాడా అని కుతూహలపడుతూ.

"టవర్ స్ట్రీట్‌లో భారత్ సర్వీస్ స్టేషన్ అని ఒక పెట్రోల్‌బంక్ వుంది. ఈ తాళాలు తీసుకో" అంటూ కీ వున్న చైన్ అందించాడు జగన్.

శ్రీధర్ అందుకుని విచిత్రంగా చూశాడు అతనివంక.

"అక్కడొక నీలంరంగు అంబాసిడర్ కారుంది. దాని తాళాలు ఇవి. ఈ రోజునుంచి అది నీది. కావలసినంత పెట్రోలు పోయించుకో అక్కడ. ఆ పెట్రోల్‌బంక్ మనదే."

"వూఁ....." అన్నాడు శ్రీధర్.

"అంతే నీ వుద్యోగం. ఆ కారులో షికారుగా తిరగడమే" అన్నాడు జగన్ నవ్వుతూ.

ఏమీ అర్థం కానట్లు అయోమయంగా చూశాడు శ్రీధర్.

"జీతం నెలకు వెయ్యి. ఖర్చులన్నీ మావే. ఇదుగో ఈ వంద నీ దగ్గరుంచు" అని వంద కాగితం అందించాడు జగన్.

"కారులో తిరుగుతూ ఏం చేయాలి నేను?" ప్రశ్నించాడు శ్రీధర్.

"అదే చెప్తున్నాను. కనీసం వారానికొక కేసు పట్టుకు రావాలి. వారం కాకపోయినా పదిరోజులకొకటి. నెలకు మూడు కేసులు తగ్గకూడదు" అన్నాడు జగన్.

"కేసులా? ఏం కేసులు?" మరింత ఆశ్చర్యపోయాడు శ్రీధర్.

"తొందరపడతావెందుకు చెప్తున్నా!" అంటూ సిగిరెట్ ముట్టించి గుప్పుగుప్పున పొగనదిలాడు జగన్.

"ఇదుగో చూడు శ్రీధర్. నువ్వొక లక్షాధికారి కొడుకువి."

"కా దు....కాదు...." కంగారుగా అన్నాడు.

"నిజంగా కాదులే. నువ్వు కంగారుపడకు. అలా నటించాలి అంతే. నువ్వొక లక్షాధికారి కొడుకువి. కారులో తిరుగుతూ జల్సాగా ఖర్చుపెడుతుంటావు. చూసే వాళ్ళకి అలా అనిపించాలి తెల్సిందా?"

తలవూపాడు శ్రీధర్.

"కొందరు అమ్మాయిలు, ముఖ్యంగా కాలేజీల్లో చదువుకుంటూ నీలాంటి హీరో కోసం ఎదురుచూస్తూ వుంటారు. హాస్టల్స్‌లో వుంటూ తెగువగా తిరుగుతూ వుంటారు. నీ పర్సనాల్టి చూసి వాళ్ళే నిన్ను వలలో వేసుకోవాలని చూస్తూ వుంటారు. నువ్వు వాళ్ళని వలలో వేయడానికి పెద్దగా కష్టపడ నక్కర్లేదు. ఇప్పుడు అర్ధమైందా కేసు అంటే."

కాలేదన్నట్లు తల ఆడించాడు శ్రీధర్.

"కాస్త బాగున్న అమ్మాయిల్ని చూసి వల విసురు. స్నేహం చెయ్యి రెండురోజులు. తర్వాత మంచిరోజు చూసి ఇంటికి తీసుకురా. చాలు" అన్నాడు.

"తర్వాత."

"అదంతా నీ వుద్యోగం కాదు" కరుకుగా వుంది జగన్ గొంతు.

"రెండు రోజుల స్నేహానికే నా వెంట వచ్చేసే ఆడపిల్లలు వుంటారా?"

"వుంటారు కొందరు. కొందరు పెళ్ళి చేసుకో మంటారు. అన్నింటికీ నువ్వు రెడీగా వున్నట్లు చెప్పాలి. ఇదుగో ఈ బాటిల్ ఎప్పుడూ జేబులో వుంచుకో."

"ఎందుకు?"

"కార్లో కూర్చున్న అమ్మాయి ముఖంమీద స్ప్రే చెయ్యి. ఏదో సెంట్ అనుకుంటుంది. అంతే. కళ్ళు తిరిగి పడిపోతుంది. గంటవరకూ వచ్చినదానిలా పడివుంటుంది" అన్నాడు జగన్.

"సరే?" అన్నాడు శ్రీధర్ గంభీరంగా.

"ఒక్కమాట. ఏ ఆడపిల్లయినా సరే! ఈ వూరి అమ్మాయి కాకుండా వుంటే మంచిది. తర్వాత బాగా డబ్బున్న వాళ్ళ అమ్మాయి గూడా కాకూడదు. లేకపోతే మన బిజినెస్ బయటపడుతుంది" అన్నాడు జగన్.

"ఈ బిజినెస్ మీ ఒక్కడిదేనా? ఇంకా పార్టనర్స్ వున్నారా?"

"అదంతా నీకు తర్వాత తెలుస్తుంది. ప్రస్తుతం మన ఇద్దరమే పార్టనర్స్" అన్నాడు జగన్.

"నాకు జీతమేగా ఇచ్చేది."

"నమ్మకంగా వుంటే సరే! లేకపోతే నువ్వు సంతకాలు పెట్టిచ్చిన తల్లి కాగితాలు పార్టనర్‌షిప్ కాగితాలు అవుతాయి" నవ్వాడు జగన్.

5

కాంచనకు తెలివి వచ్చింది.

కంగారుగా లేచింది.

గది చల్లగావుంది. ఎయిర్‌కండిషనర్ సన్నగా చప్పుడు చేస్తూ వుంది. బెడ్‌లైట్ వెలుగులో గదిని చుట్టూ పరికించి చూసింది. గది మోడరేట్‌గా డెకరేటు చేసి వుంది. తనొక



ఫోం బెడ్ మీద పడుకుని వుంటున్నమాట. తనని యిక్కడికి ఎవరు తీసుకొచ్చారు?

ఆమెకు జరిగిందంతా గుర్తొచ్చింది.

శ్రీధర్, తను కాఫీ తాగొచ్చి కార్లో కూర్చున్నారు. అతను ఏదయినా పిక్చరుకి వెళదామని ప్రపోజ్ చేశాడు. కాని తను ఇంట్లో చెప్పిరాలేదనీ, కంగారు పడతారనీ చెప్పింది. పోనీ బీచ్ కి వెళదామన్నాడు. తను సరే అంది. ఆ తర్వాత అతను యేదో ఫారిన్ సెంటు కొన్నానని బాటిల్ తీసి తన ముఖంమీద స్ప్రే చేశాడు. తనకు తలతిరిగి పడిపోయింది. ఇప్పటివరకూ తను మత్తులో పడివుంటున్నమాట. శ్రీధర్ తనను అలా ఎందుకు చేశాడు? ఆమెకు అంతరంగంలో ఆందోళన చెలరేగింది.

కాంచన బెడ్ మీదనుంచి లేచి తలుపులు తెరవడానికి ప్రయత్నించింది. కాని అవి రాలేదు. దబదబా బాదింది. ఎవరూ తియ్యలేదు.

ఆమెకు శ్రీధర్ మీద అనుమానం మొలకెత్తింది. అతను మోసగాడు కాదుగదా?

కాంచనకు దుఃఖం ముంచుకొచ్చింది.

గది బయట హాల్లో తాపీగా సిగరెట్ తాగుతూ కూర్చున్నాడు శ్రీధర్.

"పంజరంలో చిలుక కొట్టుకొంటూ వుంది" అన్నాడు జగన్ నవ్వుతూ.

శ్రీధర్ నవ్వలేదు.

అతను ఎందుకో సీరియస్‌గా ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"ఇప్పుడేం చేస్తారు ఆ అమ్మాయిని?" ప్రశ్నించాడు శ్రీధర్.

జగన్ నవ్వాడు.

"బాస్ ఓపెనింగ్ చేస్తారు. ఆ తర్వాత బిజినెస్ చేస్తారు."

"అంటే అమ్మేస్తారా?"

"ఆఁ...."

"ఎవరికి?"

"ఎవరికో! వాళ్ళు బిజినెస్ చేసేవాళ్ళే."

"వాళ్ళు ఎక్కడ్నుంచి వస్తారు?"

"బొంబాయి, ఢిల్లీ... పెద్ద సిటీస్‌నుంచి వస్తారు. బాస్‌కి పెద్దలెవల్లో బిజినెస్ వుంది అక్కడ."

"ఇంతకీ ఎవరు మన బాస్."

జగన్ నవ్వాడు. సమాధానం చెప్పలేదు.

"వస్తారు. నువ్వు చూస్తావు. తొందరెందుకు?" జగన్ అన్నాడు.

"ఆమెకు మెలకువ వచ్చింది. ఆలస్యమైతే గొడవ

జరుగుతుందేమో?"

"నువ్వు భయపడకు. మన పంజరంలోకి వచ్చిన చిలుకలు ఏవీ బయట పడలేవు. అదంతా బాస్ చూసుకుంటాడు. మనకెందుకు? ఇంతకీ ఆ పిల్లని ఎక్కడ పట్టావ్? ఎవరట?" అన్నాడు జగన్.

"ఈ వూరేనట. మీరెప్పుడూ చూశ్ళేదా?"

"వూహూఁ...." అన్నాడు జగన్.

"బాస్‌కి ఫోన్‌చేసి చూడగూడదా?"

"మంచి ఆలోచనే. ఆలస్యం వుంటే తెలుస్తుంది" అని రిసీవర్ ఎత్తి రింగ్ చేశాడు. ఎవరితోనో మాట్లాడి రిసీవర్ పెట్టేశాడు.

"బాస్ బయల్దేరాడట."

అయితే దార్లో వుండొచ్చు."

"అవును. దారిలో మందుకొట్టి బయల్దేరతాడు" జగన్ అన్నాడు.

ఇంతలో కారు హారన్ మ్రోగింది. బాస్ స్వయంగా డ్రయివ్ చేసుకుంటూ వచ్చాడు.

ఆయన్నిచూసి శిలలా నిల్చుండి పోయాడు శ్రీధర్.

ఆయన మోడరన్ ఎంటర్‌ప్రెయిజస్ ప్రొప్రయిటర్ గోపాలరావు.

శ్రీధర్ భుజంతట్టి "వెరీగుడ్ మిస్టర్ శ్రీధర్. వచ్చిన వారంలోనే సక్సెస్ అయ్యావు" అన్నాడు.

శ్రీధర్ చిరునవ్వు నవ్వాడు.

"ఇదుగో ఈ వెయ్యి తీసుకో. నీ టాలెంట్‌కి నా బహుమతి. మంచి డ్రెస్ కుట్టించుకో. అమ్మాయిలు నిన్ను చూసి ఈగల్లా ముసురుకోవాలి. మన బిజినెస్ ఇంప్రూ అయిపోవాలి. నిన్ను ఫారిన్ పంపిస్తాను ఏజంటుగా."

అన్నాడు కొత్త నోట్లకట్ట శ్రీధర్‌కి అందిస్తూ.

శ్రీధర్ అందుకొని జేబులో పెట్టుకొని "థాంక్స్ సార్" అన్నాడు వినయంగా.

"ఇంతకీ ఎక్కడ పట్టుకొచ్చావ్ ఆ పిల్లని?"

"కె. వి. ఆర్. కాలేజీలో బి. యస్సీ. చదువుతోంది సార్."

"బాగుందా?"

"బంగారు బొమ్మ సార్! మీరే చూస్తారుగా! అసలా అమ్మాయిని చూస్తే మీరే పర్మినెంటుగా ఫిక్సుచేసుకుంటారు" అన్నాడు జగన్.

"ఓ.... వెరిగుడ్. అయామ్ వెరీ హేపీ...." అన్నాడు గోపాలరావు.

జగన్ కొంచెం వున్న గది తలుపులు తీశాడు. గోపాల రావు లోపలకు వెళ్ళగానే మూసి లాక్ చేసాడు.

తర్వాత లోపల కేకలు వినిపించాయి. ఆమె గట్టిగా ఏడుస్తోంది.

ఇద్దరూ బయట బొమ్మల్లా నిల్చున్నారు.

కాసేపటికి విసురుగా కిటికీ తలుపు తెరుచుకుంది.

"తలుపు తియ్యండిరా రాస్కెల్స్!" గోపాలరావు సింహంలా గర్జించాడు.

జగన్ వణుకుతూ లాక్ తీశాడు.

గోపాలరావు మండిపడుతూ బయటపడ్డాడు. ఆయన కళ్ళు ఎర్రగా నిప్పులు చెలరేగుతున్నాయి.

"ఏరా! రాస్కెల్ నీకు బుద్ధుందా లేదా?" అన్నాడు శ్రీధర్ చొక్కా కాలర్ పట్టుకుని.

"ఏం జరిగింది సార్!" అన్నాడు శ్రీధర్ అమాయకంగా ముఖం పెట్టి.

జగన్‌కి ముచ్చెమటలు పోశాయి. అంతలావు మనిషీ భయంతో వణికి పోయాడు.

కాంచన ఏడుస్తూ బయటకు వచ్చింది.

"కాంచన ఎవరనుకున్నావ్?" ఆగ్రహంతో అన్నాడు.

"ఎవరు సార్!"

"నా కూతుర్రా వెధవా! డర్టీ రోగ్."

"నాకు తెలియదు సార్!" అన్నాడు శ్రీధర్.

"తెలుసుకోకుండా ఎందుకు తెచ్చావ్! నా కూతుర్ని మోసం చేస్తావురా! నిన్నేం చేస్తానో చూడు. కాల్చి పారే స్తాను" కోపంతో వూగిపోతున్నాడు గోపాలరావు.

"మీరు నాకు అటువంటి వుద్యోగం ఇచ్చారు. ఇందులో నా తప్పు ఏముంది?"

"తప్పు లేదంటావా? నిన్ను పాతి పెడతాను."

"నిజంగా నా తప్పు ఏమీ లేదు సార్! మీరు అమ్మా యిల్ని అమ్ముకునే వ్యాపారం చేస్తున్నారు. ఎందరి జీవితా లనో నాశనం చేస్తున్నారు. కన్న తల్లిదండ్రుల్ని క్షోభ పెడుతున్నారు. సంఘంలో ఘరానా పెద్దమనిషిగా చెలామణీ అవుతున్నారు. కాని ఆ సంఘంలోనే మీ కూతుర్లు గూడా వున్నారని మర్చిపోయారు. ఇప్పటికైనా తెలుసుకోండి తమ పిల్లల్ని పోగొట్టుకున్న తల్లిదండ్రులు ఎంత క్షోభ పడతారో?"

"నాకే నీతులు చెప్తావా? నిన్నేం చేస్తానో చూడు" చెయ్యెత్తాడు గోపాలరావు.

జగన్ శిలా ప్రతిమలా నిలబడిపోయాడు.

"మిస్టర్ గోపాలరావ్! నువ్వు నన్నేం చెయ్యలేవు. రోజులన్నీ నీవి కావని గుర్తుంచుకో" అని జేబులోని విజిల్ తీసి వూదాడు.

మరుక్షణంలో పోలీసులు వాళ్ళని చుట్టుముట్టారు.

గోపాలరావు, జగన్ భయంతో నివ్వెరపోయి నిలబడి పోయారు.

గోపాలరావుకి, జగన్‌కి బేడీలు వేసి వ్యాన్‌లో ఎక్కించారు.

పోలీస్ కమీషనర్‌కి తను టేప్ చేసిన సంభాషణలను టేప్ రికార్డుతోసహా అందించాడు శ్రీధర్.

కాంచన ఏడుస్తూ నిలబడి వుంది.

శ్రీధర్ ఆమె దగ్గరగా వెళ్ళి "సారీ! కాంచనా. మీ ఫాదర్ దుర్మార్గాన్ని బైటపెట్టడానికి నిన్ను హర్ట్ చేశాను. సారీ!.... వెరీ.... వెరీ సారీ!" అన్నాడు.

"వెల్‌డన్ ఇనస్పెక్టర్ శ్రీధర్. ఇన్నాల్టికి ఆడపిల్లల్ని ట్రాప్ చేస్తున్న ముఠాని కనిపెట్టావ్! కంగ్రాట్స్!" అన్నాడు పోలీస్ కమీషనర్ అభినందిస్తూ.

"థాంక్యూ! వెరీమచ్ సార్!" అన్నాడు శ్రీధర్. □

కోతరాయుళ్ళు

ఇద్దరు తాగుబోతు వెధవలు ఒక పేద్ద కొయ్యదుంగను కొయ్యసాగారు.

అరగంట గడచిన తర్వాత ఇద్దరూ ఏకకంఠంతో గగ్గోలుగా ఏడవసాగారు.

వాళ్ళ ఏడ్పువిని పరుగెత్తుకు వచ్చిన జనానికి, దుంగకు బదులుతెగ్గోయబడిన వాళ్ళకాళ్ళుకనిపించాయి.

—ఎం. కె. నారాయణ, హైద్రాబాదు.

సూర్యారావు నిరుద్యోగి. ఒక్క చెల్లెలు తప్ప అతడికి నా అన్నవాళ్ళెవ్వరూ లేరు. అతడి చెల్లెలు జానకి సూర్యారావుకంటె తక్కువే చదువుకుంది. కానీ ఆమెకు

ఉద్యోగముంది.

జానకికి ఒకసారి జ్వరంవచ్చింది. సూర్యారావు డాక్టర్ని పిలిచాడు. డాక్టరు వెంకట్రావు అతడికి తెలిసినవాడే. ఆయన ఆ వీధిలోనే వుంటున్నాడు. వెంకట్రావు వచ్చి చూసి జానకి రోగం తనకు అంతుపట్టడం లేదనీ కొన్నాళ్ళు తన నర్సింగ్ హోంలో వుండటం మంచిదనీ సలహా ఇచ్చాడు. ఆయన నర్సింగ్ హోం ఆ వీధిలోనే వుంది. మందుల గురించి తప్ప మరి దేనిగురించీ ఛార్జి చేయనని వెంకట్రావు సూర్యారావుకు హామీ ఇచ్చాడు.

జానకి నర్సింగ్ హోంలో వారం రోజులుండి వచ్చింది. ఆ తర్వాత రెండు నెలలకు ఆమెలో గర్భవతుల లక్షణాలు కనబడసాగాయి. సూర్యారావు నిలదీస్తే జానకి ఏడుస్తూ కూర్చుంది. అతనింకా నిలదీస్తే డాక్టరు పేరు చెప్పింది.

సూర్యారావుకు పాతికేళ్ళు. జానకికి ఇరవై ఏళ్ళు. వాళ్ళకు పదివేలు చేసే స్వంతిల్లూ, తండ్రి వదిలిపోయిన రెండెకరాల భూమీ వుంది. తనకుద్యోగం వస్తే ఇల్లూ, భూమి అయినా అమ్మేసి చెల్లెలి పెళ్ళి చేయాలని అతడి తాపత్రయం. కానీ చెల్లెలి వయసు ఆగేలా లేదు.

సూర్యారావు దూకుడుగా డాక్టరు దగ్గరకు వెళ్ళాడు. అతడు రౌడీ కాదు. కానీ ఇప్పుడు చెల్లెలికి జరిగిన అన్యాయం రప్పించిన ఆవేశంలో వున్నాడతను.

"ఆవేశపడకుండా అలా కూర్చో!" అన్నాడు డాక్టరు. ఆయనకు భార్య వుంది పిల్లలున్నారు. పిల్లల్లో ఓ పదేళ్ళ కూతురు కూడా వుంది.

సూర్యారావు ఆవేశాన్ని నిగ్రహించుకుని కూర్చున్నాడు.

"మీ జానకిది మెత్తటి మనసు. ఆమెను అనవసరంగా నువ్వు నొప్పించకు...." అన్నాడు వెంకట్రావు.

"నేను నా చెల్లెలి తప్పుగురించి రాలేదు. నీ తప్పు గురించి పంజాయిషీ అడగడానికి వచ్చాను" అన్నాడు.

"అదే నేనూ చెబుతూంట. ఇందులో నా తప్పేమీ లేదు" అన్నాడు డాక్టరు — "డాక్టరుకి మగా ఆడాతో నిమిత్తం లేదు. కొన్ని పరీక్షల నిమిత్తం ఆడవాళ్ళదగ్గర మేమెంతో చనువుగా ప్రవర్తించవలసి వస్తుంది. వాళ్ళూ సిగ్గుపడి లాభం వుండదు. అలాంటప్పుడు ఉప్పుకారం తినే మనుషులుగా మేమూ ఒకోసారి ఆవేశపడ్డం కద్దు. ఆవేశపడినప్పటికీ పేషెంటు సహకారం లేనిదే ముందడుగు వేయలేం."

"అంటే ఏమిటి నువ్వనేది?"

"చెప్పానుగా—నీ చెల్లెలి మెత్తటి మనసు. ఊరికే వైద్యం చేయించుకోవడానికి మనసొప్పక తనివ్వగలిగిందిచ్చింది. అంతే" అన్నాడు డాక్టరు.

సూర్యారావు ఆవేశంగా లేచి డాక్టరు కాలరు పట్టుకున్నాడు—"అయితే — ఇందుకన్న మాట—నువ్వు మామూలు జ్వరాన్ని కొండంత చేసి నా చెల్లిని నర్సింగ్ హోంకు రప్పించింది...."

"ముందు కాలరు వదులు. నాతో గొడవ పెట్టుకుంటే నీకే నష్టం. జరిగిందేదో గుట్టుచప్పుడు కాకుండా మాఫ్ చేసేయమంటే ఉచితంగా సాయపడతాను. ఇప్పుడు గొడవపడితే నువ్వూ, నీ చెల్లీ వీధిలో పడతారు. అంతే!" అన్నాడు డాక్టరు.

సూర్యారావు ఆవేశం అణగిపోయింది. అతను డాక్టర్ని వదిలిపెట్టి—"నా చెల్లెల్ని మళ్ళీ నీ దగ్గరకు పంపుతానా? కానీ....నిన్ను మాత్రం వదిలిపెడతా ననుకోకు...." అన్నాడు.

సూర్యారావు రౌడీ కాదని డాక్టరుకు తెలుసు. అందుకే ఆయన ఏమీ భయపడకుండా నవ్వి ఊరుకున్నాడు.

తర్వాత సూర్యారావు జానకిని ఓ లేడీ డాక్టరు వద్దకు తీసుకెళ్ళి రహస్యంగా అబార్షన్ చేయించాడు. అందుకు అయిదువందలు ఖర్చయింది. ఆ డబ్బు అతను డాక్టరు వెంకట్రావుని అడిగి తీసుకున్నాడు. వెంకట్రావు కూడా మాట్లాడకుండా డబ్బు ఇచ్చాడు. డబ్బు ఇచ్చి మాట్లాడాడు—"నీ చెల్లెది మెత్తటి మనసు. కాస్త జాగ్రత్తగా ఉండు...."

ఆయనలా అనడంలోని అంతరార్థం సూర్యారావుకు బోధపడలేదు. మెత్తటి మనసు అనే పదం వేళాకోళంగా అంటున్నదా? మగవాళ్ళకు సులభంగా లోబడిపోయే ఆవేశం జానకి కున్నదా!

సూర్యారావు సిగ్గు విడిచి జానకితో ఈ విషయాలు చర్చించాడు. అతను సిగ్గుపడినంతగా జానకి సిగ్గుపడలేదు. చాలా మామూలుగా ఆమె విషయం చెప్పింది.

"ఆడదానికి ఈ సమాజం ఎన్నో ఇబ్బందులు కల్పించింది. డాక్టరు నా గురించి నీతో ఏమైనా చెప్పి ఉండొచ్చు కానీ ఆయన నర్సింగ్‌హోంలోని గదిలో మరెవ్వరూ లేని సమయంలో వచ్చి పరీక్షల పేరుతో నన్నావేశపరిచి, తను వేసే ముందడుక్కి నేను ప్రతిఘటించబోతూంటే—'జరుగనున్న దెలాగూ జరక్క మానదు నలుగురికీ తెలీకుండా జరగాలనుకుంటే నోరు మూసుకుని భరించు. నలుగురికీ తెలియాలనుకుంటే నోరు పెట్టుకుని అరు. ఈ గదిలో ఇంతవరకూ నన్నెవ్వరూ ఆపలేకపోయారు—" అని బెదిరించిన ఆ డాక్టర్ని ఏ ఆడది మాత్రం ఏం చేయగల్గుతుంది? వాడి గురించి ఎలా చెప్పుకోగల్గుతుంది? ఇదీ

నా కధ.

ఇంతే కాదు. ఈ డాక్టర్ని తప్పుపట్టి ప్రయోజనంలేదు. నేను ఉద్యోగానికి వెడుతూ వస్తూ ఉన్నాను. మా ఆఫీసు లోనే ఎందరో మగవాళ్ళ కళ్లు నాపైన వున్నాయి. వాళ్లు మాట్లాడే అసభ్యపు మాటలు, చూసే వెకిలి చూపులు అన్నీ భరిస్తూనే ఉన్నాను. ఒంటరిగా అవకాశం లభిస్తే ఏ ఒక్కరూ నన్ను వదిలిపెట్టరని నాకు తెలుసు. వాళ్ళకు అవ కాశం రాలేదు. డాక్టరుకు అవకాశం వచ్చింది. అంతే తేడా! ఇది మగవాడు తనకోసం సృష్టించుకున్న ప్రపంచం అన్నయ్యా—ఇందులో ఆడది కేవలం ఆటబొమ్మ మాత్రమే!" అంది జానకి.

సూర్యారావు మళ్ళీ ఆవేశపడ్డాడు. కానీ తన ఆవేశం ఎవరిమీద ప్రదర్శించాలి? డాక్టరులాంటి మగవాళ్లు చాలా మందున్నారని జానకి అంటోంది. అవకాశం రాక ఊరు కున్నా అవకాశం వస్తే ఎవ్వరూ వదలరు. అసలు తన చెల్లిని చాలామంది ఆ దృష్టితో చూస్తున్నారన్న ఆలోచనే సూర్యారావుకి వడలు కంపరం తెప్పించింది.

"నువ్వుద్యోగం మానేయ్—" అన్నాడు సూర్యా రావు.

"అడ్డమైన వెధవలకీ భయపడి నే నుద్యోగం ఎందుకు మానేయాలి? ఎలాంటి విషయాన్నైనా ధైర్యంగా ఎదు ర్కొంటాను—" అంది జానకి.

సూర్యారావామెను నొక్కించలేదు. డాక్టరు జానకిని లోబర్చుకున్నాడంటే అందు క్కారణం ఆమె ఉద్యోగిని అవడంకాదు. ఆడదాని అసహాయత.

తను అర్జంటుగా జానకికి పెళ్ళి సంబంధాలు చూడాలి!

2

సూర్యారావు ఓ రోజు వీధిలో పోతూండగా పిలిచి—
"నీ చెల్లెలి విషయంలో జాగ్రత్తగా ఉండమని చెప్పానా? ఆమెది చాలా మెత్తటి మనసు. అందుకే ప్రస్తుతం రోజూ ఆఫీసులో తన ఆఫీసరుతో గడుపుతోంది—" అన్నాడు డాక్టరు వెంకట్రావు.

సూర్యారావు ఆవేశం ఎంతోసేపు నిలబడలేదు. ఈ మధ్య జానకి ఆఫీసునుంచి రోజూ ఆలశ్యంగా ఇంటికి వస్తోంది. కారణమడిగితే ఓవర్‌టైం అంటోంది. నిజమే ననుకుని నమ్మాడతను. ఆమె ఆఫీసులో వుండడం లేదనీ ఆఫీసరు ఇంటికి వెడుతోందనీ డాక్టరు అంటున్నాడు.

"నువ్వు చెప్పింది అబద్ధమైతే—నీ రక్తం కళ్ళజూస్తాను—" అన్నాడు సూర్యారావు.

"అబద్ధమైతే ఏం చేయాలని కాక—నిజమైతే ఏం చేయాలో ఆలోచించు..." అన్నాడు డాక్టరు వెకిలిగా నవ్వుతూ.

ఆ రోజు సూర్యారావు ఆఫీసు మూసేవేళకి రహస్యంగా వెళ్ళాడు. అందరు ఉద్యోగస్థులతోపాటూ తన చెల్లెలు జానకి కూడా బైటకు వచ్చింది. అతడామెను అనుసరించాడు. ఆమె ఓ పార్కుకి వెళ్ళింది. ఓ బెంచీమీద కూర్చుంది. కాసేపటికి అక్కడకు ఆమె ఆఫీసరు వచ్చాడు. ఇద్దరూ కలిసి ఆఫీసరు కార్లో వెళ్ళిపోయారు. సూర్యారావుకు ఆ ఆఫీసరు యిల్లు తెలుసును. అతడు నెమ్మదిగా ఆ యింటికి వెళ్ళాడు. కాలింగ్‌బెల్ మ్రోగించాడు.

ఆఫీసరే స్వయంగా వచ్చి తలుపు తీశాడు. సూర్యారావుని చూసి తొట్రుపడ్డాడు. సూర్యారావు కాస్త దూకుడు



గానే ఆఫీసర్ని తోసుకుని లోపలకు వెళ్ళాడు. లోపల ఒక గదిలో తన చెల్లెలు జానకి అర్ధనగ్నంగా ఉండడం చూశాడు.

సూర్యారావుని చూసి జానకి—"నువ్వా!" అంది. అతడేమీ జవాబివ్వలేదు. మ్రాన్పడిపోయి ఆమె వంకనే చూస్తూ ఉండిపోయాడు.

జానకి త్వరగా బట్టలు సర్దుకుని—"పద—ఇంటికి వెళ్ళిపోదాం!" అంది.

ఇద్దరూ ఇంటికి వెళ్ళిపోయారు.

"నువ్విలాంటిదానివని నేననుకోలేదు. నీకు అన్నని అని చెప్పుకోడానికి సిగ్గుపడుతున్నాను—" అన్నాడు సూర్యారావు ఏడుపు కంఠంతో.

"నేనేం తప్పుచేశాను?" అంది జానకి నిబ్బరంగా.

"సిగ్గులేదూ ఆ ప్రశ్న అడగడానికి?" అన్నాడు సూర్యారావు.

జానకినవ్వి—"సమాజంలో పెద్ద హోదా ఉన్న వ్యక్తి నన్ను తన ఇంటికి రమ్మనమని పిలిచాడు. ఆయన పెద్ద మనిషిగా, మర్యాదస్థుడిగా పేరు పొందాడు. ఆయనింటికి నేను వెళ్ళడంలోనూ, ఆయన చెప్పినట్లు వినడంలోనూ తప్పేముంది?" అంది.

"అసలు నువ్వు వాడింటికి వెళ్ళడం ఎందుకు?"

"చెప్పనా?" అంది జానకి.

ఆమె ఆఫీసులో లంచ్ అవర్లో ఒక సహోద్యోగి ఆమె పట్ల అసభ్యంగా, అమర్యాదగా ప్రవర్తించాడు. అది ఒక రిద్దరు ఇతర సహోద్యోగులు చూశారు. జానకి ఆఫీసరుకు ఫిర్యాదుచేసింది. ఆఫీసరు ఆమె ఫిర్యాదును పట్టించుకోని పక్షంలో ఆఫీసులో పనిచేసే మిగతావాళ్ళు కూడా ఆమె లోకువై పోతుంది. సహోద్యోగి దుష్ప్రవర్తనను చూసిన ఇతరులు సాక్ష్యంగా ఉండడానికి నిరాకరించారు. ఆఫీసరు జానకి మాటలు నమ్మి ఆ ఉద్యోగిమీద చర్య తీసుకోవాలి. అక్కడ జానకి ఉద్యోగం కొనసాగాలంటే ఆ చర్య చాలా ముఖ్యం.

జానకి మాటలు ఆఫీసరు నమ్మాలంటే జానకి ఆఫీసర్ని నమ్మాలి. ఆఫీసరు భార్య ప్రస్తుతం ఊళ్ళోలేదు. ఆఫీసరు జానకిని ఇంటికి రమ్మన్నాడు. కేవలం మాట్లాడడానికే అన్నాడు. జానకి అతన్ని నమ్మి ఇంటికి వెళ్ళింది. తర్వాత ఆఫీసరు ఆమె వంటిమీద చేయివేశాడు. అది తప్పు కాదన్నాడు. అదీ నమ్మింది జానకి!

"చాటుగా చేసే తప్పు తప్పుకాదు. బహిరంగంగా చేసే తప్పే గుర్తించబడుతుంది. నన్ను బహిరంగంగా అవమానించినవాణ్ణి శిక్షించడం కోసం చాటుగా అంతకంటే

పెద్ద తప్పు చేస్తున్నాను. ఇదీ ఈ దేశంలోని ఆడదాని బ్రతుకు అన్నయ్యా!" అంది జానకి విషాదంగా.

సుబ్బారావుకి జానకి మాటలు ఏ మాత్రమూ నచ్చలేదు. ఆమె దారి తప్పిందనీ, ప్రస్తుతం తన మాటలు వినే స్థితిలో లేదనీ అతడు గ్రహించాడు. ఈ పరిస్థితిల్లో తనామెను అసహ్యించుకున్నప్పటికీ వదిలి పెట్టడానికి లేదు. అందరూ తననే అంటారు—చెల్లెల్ని అనాథగా వదిలేసి పోయాడని!

అయితే అతని బెంగ ఒక్కటే—చెల్లెలి పతనం ఇలా ఎంత దూరం కొనసాగుతుంది? తనకు తెలిసినంత వరకూ అప్పుడే ఆమెకు ఇద్దరు పురుషులతో పరిచయ మయింది.

"నువ్వు చాటుగా అనుకుంటున్నావు.... కానీ ఈ విషయం చాలామందికి తెలుసు!"

జానకి కంగారుగా అన్నయ్యవంక చూసి—"అన్నట్లు నేను మా ఆఫీసరు ఇంట్లో ఉన్నట్లు నీకెవరు చెప్పారు?" అంది.

"డాక్టరు వెంకట్రూవ్!" అన్నాడు సుబ్బారావు.

హఠాత్తుగా జానకి కళ్ళు ఎర్రబడ్డాయి. "అలాగా!" అంది. ఆ క్షణంలో ఆమె కళ్ళు చూసి సూర్యారావు భయ బడ్డాడు.

3

తర్వాత పదిరోజులు గడిచాయి.

సూర్యారావు ఉద్యోగం కోసం తీవ్రప్రయత్నాలు చేయ సాగాడు.

సూర్యారావు అదృష్టం బాగుంది. ఆ ఊళ్ళోనే ఓ కంపెనీలో అతడికి ఇంటర్వ్యూ వచ్చింది. అతను ఇంటర్వ్యూ చాలా బాగా చేశాడు. అతన్ని అప్పటికప్పుడు నెలకు ఎనిమిదివందలరూపాయల జీతం మీద ఉద్యోగంలో అపాయింట్ చేయడం జరిగింది.

ఈ శుభవార్తను అతనితో పంచుకునేందుకు ఎవ్వరున్నారు—ఒక్క చెల్లెలు తప్ప!

ఎంత అసహ్యించుకున్నప్పటికీ సూర్యారావు ఈ వార్తను చెల్లెలికి చెప్పకుండా ఉండలేకపోయాడు.

"చాలా సంతోషం అన్నయ్యా—" అంది జానకి ఉత్సాహంగా.

"మరి - నువ్వింక ఉద్యోగం మానెయ్యాలి!" అన్నాడు సుబ్బారావు.

"ఎందుకూ?" అని అడగలేదు జానకి. చాలా నెమ్మదిగా—"నేను మానను!" అంది.

"ఎందుకని?"

"ఇంట్లో నాకు తోచదు. మూడేళ్ళనుంచి ఉద్యోగానికి అలవాటుపడ్డాను. అదీకాక నా పెళ్ళి గురించి నువ్వు తెగ ప్రయత్నిస్తున్నావు. నాకుద్యోగముంటే నీ పని సులభమవుతుంది...." అంది జానకి.

"ఉద్యోగం చేసే ఆడవాళ్ళమీద చాలామంది మగవాళ్ళకి సదభిప్రాయముండదు. అలాటివాళ్ళలో నేనూ ఒకణ్ని! నా దురభిప్రాయానికి కారణం కూడా నువ్వే!" అన్నాడు సూర్యారావు.

జానకి నవ్వి—"రెండు చేతులూ కలిపినప్పుడేగదా చప్పట్లు. ఉద్యోగంచేసే మగాడిమీద నాకూ అదే అభిప్రాయముంది. అంతమాత్రాన మగాళ్ళుద్యోగాలు మానేస్తారా?"

అంది.

జానకి చాలా తెలివయినదని సూర్యారావు గ్రహించాడు. అంత తెలివయిన ఆడది మగవాళ్ళ వల్లో ఎలా పడుతోంది. కండకావరం తప్ప మరో కారణం ఉండివుండదు— అనుకున్నాడతను.

తన ఉద్యోగంలో సూర్యారావుకో మంచి మిత్రుడు దొరికాడు. అతని పేరు రామం.

రామం తల్లిదండ్రులకొక్కడే కొడుకు. వారి చాటున అల్లారుముద్దుగా పెరిగినా అతడిలో చెడ్డగుణం వొక్కటీ చోటుచేసుకోలేదు. అతడు కాక్ టెయిల్ పార్టీలకు రాడు. సిగరెట్లు తాగడు. ఆడవాళ్ళవైపు కన్నెత్తి చూడడు. తల్లిదండ్రులకు చెప్పకుండా ఏ పనీ చేయడు.

సూర్యారావు కంపెనీలో రామం అతనికంటె వొక సంవత్సరం ముందు చేరాడు. కానీ వారం రోజుల్లోనే ఇద్దరూ కొన్నేళ్ళ అనుబంధం ఉన్నవాళ్ళలా అయిపోయారు. ఆడవాళ్లు బరితెగించి తిరుగుతున్న ఈ రోజులలో రామం లాంటి వాళ్లుండడం సూర్యారావుకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. అతని సాన్నిధ్యంలో సూర్యారావు రిలీఫ్ పొందుతుండేవాడు.

రామం ఎన్నోసార్లు సూర్యారావుని తమ ఇంటికి తీసుకు వెళ్ళాడు. ఆ ఇంట్లోని పవిత్ర వాతావరణం సూర్యారావుని కదిలించింది. సూర్యారావుని కూడా రామం తల్లిదండ్రులు మెచ్చుకుంటూండేవారు. అతణ్ని అతడి చెల్లెల్ని కలిపి రమ్మనమని వాళ్ళు చాలాసార్లు ఆహ్వానించారు. అయితే తన చెల్లెలికి ఆ పవిత్ర వాతావరణంలో అడుగు పెట్టే అర్హతలేదని దృఢంగా నమ్మిన సూర్యారావు ఆ

విషయం వాయిదా వేస్తూ వచ్చాడు.

రామానికెప్పుడూ సూర్యారావు ఇంటికి వెళ్ళాలని వుండేది.

"నా చెల్లెలు కూడా ఉద్యోగం చేస్తోంది. అందువల్ల మా ఇంట్లో అతిధుల్ని ఆదరించడం కుదరదు. అందుకే తీసుకు వెళ్ళడం లేదు" అని సూర్యారావు చెప్పేవాడు. అతను అప్పుడప్పుడు రామానికి హోటల్లో పార్టీ ఇస్తూండేవాడు. వాళ్ళ అతిథ్యానికి తానివ్వగలిగిన బదులు అదేనని అతడి ఉద్దేశ్యం.

ఒకరోజు సూర్యారావు జ్వరపడి ఆఫీసుకు వెళ్ళలేక పోయాడు. సెలవు చీటీ రాసి చెల్లెలికిచ్చాడు. జానకి ఆ ఉత్తరం తీసుకుని కంపెనీకి వెళ్ళింది.

ఆ విధంగా రామం, జానకి మొదటిసారిగా ఒకరినొకరు చూసుకున్నారు.

సాధారణంగా ఆడవాళ్ళని పరీక్షగా చూడని రామం జానకిని చూసి అదిరిపడ్డాడు. ఆమె అందం అతడి హృదయంలో చెరగని ముద్ర వేసింది.

లీవ్ లెటర్ యిచ్చి జానకి వెళ్ళిపోయాక రామం ఆలోచనలు పరిపరి విధాల పోయాయి. అప్పుడే అతడికి సూర్యారావు ప్రవర్తనలో అనుమానించ దగ్గ అంశాలు కనిపించాయి.

ఇంత అందమైన చెల్లెలున్న కారణంగానే సూర్యారావు తనను వాళ్ళింటికి తీసుకు వెళ్ళడంగానీ—ఆమెను తమ యింటికి తీసుకురావడంగానీ చేయడంలేదు. ఏడాదిగా అరమరికలు లేకుండా ఉంటున్నప్పటికీ — సూర్యారావు తనను పూర్తిగా నమ్మలేదు.



రామం మనసు గాయపడింది. మిత్రుడి ఆరోగ్యం ఎలా వుందో తెలుసుకోవాలని అతడికి ఎంతో ఆత్రంగా వున్నప్పటికీ అతను సూర్యారావు ఇంటికి వెళ్ళలేదు.

4

మూడురోజుల అనంతరం సూర్యారావు ఆఫీసుకు వచ్చాడు.

"కులాసాయేనా?" అన్నాడు రామం.

"అది తెలుసుకోవాలని నీకంత ఆతృతగా వుంటే మా ఇంటికి రావొచ్చుగా?" అన్నాడు సూర్యారావు.

మిత్రులిద్దరూ ఎవరి భావాలు వారు బయట పెట్టారు.

సూర్యారావు ఆశ్చర్యంగా — "నువ్వు చెప్పేవరకూ నా చెల్లెలు ఇంత అందమైనదని గుర్తించనే లేదు. నీకు ఆడవాళ్ళ అందాన్ని గుర్తించే దృష్టి వుందని స్ఫురించనే లేదు" అన్నాడు.

"మరి నువ్వు మీ ఇంటికి నన్నెందుకు తీసుకెళ్ళలేదు?" అన్నాడు రామం.

సూర్యారావు టాపిక్ మార్చడానికి ప్రయత్నించాడు కానీ రామం వదలలేదు. ఆఖరికి సూర్యారావు రామం అంటే తనకెంత గౌరవాభిప్రాయాలున్నాయో వివరించి చెప్పాడు.

"అయితే నేను నీ చెల్లెల్ని వివాహం చేసుకుంటాను. ఒప్పుకుంటావా?" అన్నాడు రామం.

సూర్యారావు ప్రాణం పోయినట్లయింది.

"నేనెలాంటి వాణ్ననుకున్నావు? ఆడపిల్లల్ని చూసి ప్రేమించే టైపు కాదు. ఇష్టపడితే నేనాలోచించేది ప్రేమ గురించికాదు. పెళ్ళిగురించి" అన్నాడు రామం.

సూర్యారావు తల తిరిగినట్లయింది.

ఎక్కడి రామం? ఎక్కడి జానకి?

అతడి కళ్ళముందు అబార్షన్‌కు సిద్ధపడ్డ జానకీ, ఆఫీసర్ ఇంట్లో అర్ధనగ్నంగా వున్న జానకీ మెదులుతున్నారు? ఎంత చెల్లెలైనప్పటికీకూడా—పవిత్రుడైన ఈ రామానికి అటువంటి పతితను కట్టబెట్టడానికి ఆలోచించకూడదు? బంధుత్వం కంటే కూడా స్నేహం ముఖ్యమైనది.

"రామం—అన్యధా భావించకు. ఈ వివాహానికి నేను ఒప్పుకోలేను. కావాలంటే నువ్వే నా చెల్లెలి పెళ్ళి బాధ్యత స్వీకరించు. నువ్వే వరుణ్ని యెన్నికచేసినా నేను బాధ పడను. కానీ మీ ఇద్దరికీ వివాహం మాత్రం నేనొప్పుకోను. ఒప్పుకోలేను" అన్నాడు సూర్యారావు.

"అప్పన్నే—నేనొట్టి దద్దమ్మనుకదా? నీ చెల్లెలు ఎంతో చలాకీది. నామీద మీ ఇద్దరూ కలిపి ఇంట్లో ఎన్నో జోకు లేసుకుని వుంటారు. నాలాంటివాడు నీ చెల్లికి తగడు. నేను ఎంత చవటనంటే—నేను కాక ఇంకెవడైనా సరే నీ చెల్లికి వరుడిగా పనికొస్తాడు — అంతేకదూ—నువ్వు చెప్పేది?" అన్నాడు రామం బాధగా.

మిత్రుడి మనసు గాయపడినట్లు గ్రహించిన సూర్యా రావు—అన్ని వివరాలూ ఆ సాయంత్రం చెబుతానన్నాడు. సాయంత్రం అయ్యేవరకూ సూర్యారావు ఆలోచిస్తూనే వున్నాడు. తన చెల్లెలి ప్రవర్తన మంచిది కాదన్న విషయం రామానికి చెప్పాలా, చెప్పకూడదా అన్నదే అతడి వ్యథ।

సాయంత్రానికి సూర్యారావు ఓ నిర్ణయానికి వచ్చేశాడు. రామం తనకు బాగా కావలసినవాడు. అతడికి అన్యాయం జరక్కూడదు. తన చెల్లెలి సంగతి చెబితే అతడు సాను భూతితో అర్థం చేసుకుని విషయాన్ని రహస్యంగా వుంచ డానికి యత్నిస్తాడు.

మిత్రులిద్దరూ ఓ పార్కుకి వెళ్ళేక సూర్యారావు తెగించి "మూడేళ్ళుగా నా చెల్లెలు ఉద్యోగంలో వుంది. ఉద్యోగం చేసే ఆడవాళ్ళ ప్రవర్తనపై నాకు సదభిప్రాయం లేదు. నీకు నా సలహా ఏమిటంటే సంప్రదాయమైన కుటుంబం నుంచి పిల్లను ఏరి తెచ్చుకో. ఉద్యోగినుల జోలికి మాత్రం వెళ్ళకు" అన్నాడు.

రామం కోపంగా చూశాడు మిత్రుడివంక "మనుషుల పవిత్రతను ఒక్క చూపుతో అంచనా వేయగలను. నీ చెల్లెలు పవిత్రురాలని నా అంతరాత్మ చెబుతోంది. నేనంటే ఇష్టం లేకపోతే డైరెక్టుగా చెప్పు. తోడబుట్టిన దానిపై అభాండాలు వేయకు" అన్నాడతను తీవ్రంగా.

తను చూసిన నిజాలు యథాతథంగా సూర్యారావు మిత్రుడికి చెప్పలేకపోయాడు.

"బాధాకరమైన విషయమే అయినా ఒక విషయం చెప్పక తప్పదు. ఏకాంతం సంపాదించి డబ్బు ఎరచూపితే చాలామంది ఆడవాళ్ళు లొంగిపోతారనీ—నా చెల్లెలు అటు వంటిదేననీ కొందరు అనుకోగా విన్నాను...."

సూర్యారావు ఇంకా ఏదో చెప్పబోతూండగా రామం— "మిస్టర్ సూర్యారావ్! దిసీజ్ టూ మచ్!" అన్నాడు కోపంగా.

అక్కడ్నించి వెళ్ళిపోవాలని అతను చివాలున లేచాడు కూడా.

సూర్యారావు అతణ్ని చేయిపట్టి లాగాడు—"నువ్వంటే నా కెంత గౌరవమో — ఋజువు చేసుకునేందుకు ఒక ఏర్పాటు చేస్తున్నాను. ఈ రోజు నువ్వు నా ఇంటికి వెళ్ళు. నేను రాత్రి పది దాటేవరకూ ఇంటికి రాను. నా చెల్లెలి ప్రవర్తన నీకు నచ్చితే మీ వివాహానికి నేను అభ్యంతరం చెప్పను. నచ్చకపోతే ....నువ్వే ఏదైనా మ్యాచి దానికి చూసి పెడుదువుగాని!"

రామం ఆశ్చర్యంగా మిత్రుడివంక చూశాడు. సూర్యరావు తనకూ, అతడి చెల్లెలికీ ఏకాంతం కల్పిస్తున్నాడు. అతడు తన నెంతగా గౌరవిస్తున్నాడో చెప్పడానికింతకంటె సాక్ష్యమేం కావాలి? అయితే ఇదే సూర్యారావు చెల్లెలిగురించి చెడ్డగా చెబుతున్నాడు. ఏమిటో విచిత్రం!

"ఎస్—మిస్టర్ రామం! నేను స్నేహం ముందు బంధుత్వానికి విలువనివ్వను...." అన్నాడు సూర్యారావు.

"ఆల్ రైట్! నువ్విక్కడే వుండు. నీకు నేను వచ్చి కబురు చెబుతాను" అన్నాడు రామం.

సూర్యారావు బుర్ర వేడెక్కింది. రామం అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

తను చేసిన పనిలోని మంచిచెడ్డల గురించి ఆలోచిస్తున్నాడు సూర్యారావు. ప్రపంచంలో ఏ అన్న అయినా ఇలా చేస్తాడా? ఒక యువకుణ్ని ప్రోత్సహించి చెల్లెలి దగ్గరకు పంపాడతను.

7



అయితే అందువల్ల ఆమెకు కష్టమేముంది? పోగొట్టుకో వలసింది యెప్పుడో పోగొట్టుకుంది తను.

5

సరిగ్గా ఒక గంటలో రామం అక్కడికి వచ్చాడు. అతను తల వేలాడేసుకుని వచ్చాడు.

ఏం జరిగి వుంటుందో సూర్యారావూహించుకోగలిగాడు. కొవ్వెక్కి వున్న తన చెల్లెలు ఈ రామం ఏదో అనేలోగా తనే ఆహ్వానించి వుంటుంది. ఈ ఊహే ఎంతో జుగుప్సా కరంగా అనిపించిందతనికి.

"ఏం—అలా వున్నావ్?" అన్నాడు సూర్యారావు.

"జీవితంలో మొట్టమొదటిసారిగా అసభ్యంగానూ, అసహ్యంగానూ ప్రవర్తించాను. అదీ నీ ప్రోత్సాహం మీద. నువ్వు ప్రోత్సహిస్తే మాత్రం—నా వివేక మేమయింది? ఛా....ఛా ఇన్నేళ్ళ నా సచ్ఛీలత ఒక్కరోజులో...." అంటూ తల గట్టిగా పట్టుకున్నాడు రామం.

చతికిలబడిపోయిన రామానికి దగ్గరగా జరిగి—"నువ్వు మగాడివి. శీలంగురించి అంతగా ఆలోచింపకూడదు. ఆ విషయం పట్టించుకోవలసిన ఆడవాళ్ళు బరితెగించే తిరుగుతున్నారు" అన్నాడు ఓదార్పుగా. కానీ అతడికీ మనసులో బాధగా వుంది - తన చెల్లెలి దుశ్శీలత రామం ముందుకూడా బుజువై నందుకు.

"శీలానికి ఆడా, మగా తేడా వుందనుకోను. ఇప్పుడామె నన్నుగురించి ఏమనుకుంటుంది? మళ్ళీ ఆమెకు మొహం ఏమని చూపించగలను?" అన్నాడు రామం.

"అసలేం జరిగింది?" అన్నాడు సూర్యారావు. రామం మాటలు అతడికి అనుమానాన్ని కలిగించాయి.

"ఇంటికి వెళ్ళాను. నువ్వు పదింటిదాకా రావన్న విషయం చెప్పడానికి వచ్చానన్నాను. ఆమె కూర్చోమంది-సరదాగా మాట్లాడింది. కాఫీ కలిపి ఇచ్చింది. ఓ ఇరవై నిముషాల తర్వాత నేను తెగించాను. ముందు కాస్త నర్మగర్భంగా మాట్లాడి తర్వాత ధైర్యంగానే—ఆమె అందాన్ని మెచ్చుకుని చేయి పట్టుకున్నాను

నేనామె చేయి పట్టుకోగానే నా చెంప చెళ్ళుమంది. ఆమె కళ్ళు అగ్నిజ్వాలల్లా మండాయి. నోట్లోంచి ఉరుముల్లా వచ్చాయి—"గెటౌట్!" అన్న మాటలు. ఒక్క క్షణం కూడా అక్కడ వుండలేకపోయాను. వీధిలోకి పారిపోయాను. నా వెనకనే వీధి తలుపులు ప్రచండ ప్రళయ శబ్దంలో మూసుకున్నాయి. తర్వాత కాసేపు నాకు లోకం తెలియలేదు. నెమ్మదిమీద ఇక్కడకు వచ్చిపడ్డాను. నీ చెల్లెలు నిప్పు. నువ్వు వెధవ ఆరోపణలెలా చేయగలిగావో నాకు అర్థం కావడంలేదు" అన్నాడు రామం.

సూర్యారావు తెల్లబోయాడు. తర్వాత స్నేహితులిద్దరూ ఆట్టే మాట్లాడుకోలేదు. కాసేపుండి ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు.

ఇల్లు చేరగానే సూర్యారావు జానకి తనకు జరిగిన విషయం చెబుతుందనుకున్నాడు. కానీ ఆమె ఏమీ జరుగనట్టే నిమ్మకు నీరెత్తినట్లుంది. ఉండబట్టలేక ఆఖరికి అతనే అడిగేశాడు—"నా స్నేహితుడొచ్చి నీ చేయి పట్టుకున్నాడటగా."

"అవును. మగాళ్ళకుండే తెగులే అది. ఆడది ఒంటరిగా వుందని తెలియగానే" అని ఆమె ఏదో అనబోతూండగా "అతను అందరిలాంటి వాడూకాదు. నా ప్రోత్సాహంమీద మన ఇంటికి వచ్చాడు" అంటూ సూర్యారావు జరిగింది చెప్పి "హఠాత్తుగా నీకింత మంచిబుద్ధి ఎక్కడిది? ఓ పవిత్రుడి జీవితం బుగ్గిచేయడానికా?" అన్నాడు తీవ్రంగా.

జానకి తెల్లబోయింది — "ఒక అన్నగా నువ్వు నన్నర్థం చేసుకున్నదిదా?" అందామె. ఒక్కక్షణం ఆగి - "అయితే నన్నొక కండకావరంగల ఆడదానిలా ఊహించుకోవడం నువ్వింకా మానలేదన్న మాట! నేనప్పట్లో డాక్టరు కెందుకు లొంగానో తెలుసా? నీ ఉద్యోగంకోసం. తనకు లొంగితే నీకుద్యోగం ఇప్పిస్తానన్నాడు. నిజమేనని నమ్మి మోసపోయాను. ఆ తర్వాత ఆ డాక్టరే నాగురించి మా ఆఫీసరుకు చెప్పాడు. ఆయనకూడా నీకుద్యోగం ఇప్పిస్తానని నన్ను నమ్మించాడు. అసలు విషయం నీకు చెప్పడం ఇష్టంలేక అబద్ధాలు చెప్పాను.

నేను ఆఫీసరును కలుసుకోవడం అత్యంత రహస్యంగా జరుగుతోంది. అది నీకు డాక్టరుద్వారా తెలిసిందనగానే

డాక్టరుకూ, ఆఫీసరుకూ సంబంధముందని తెలిపింది. నేనేమైపోయినా వాళ్ళ బ్రతుకులు బజారుపాలు చేస్తానని బెదిరించేసరికి—వాళ్ళు భయపడ్డారు. ఫలితంగా నీకుద్యోగం వచ్చింది. శీలంగురించి నీ అభిప్రాయం వేరు, నా అభిప్రాయం వేరు. నిన్ను జీవితంలో నీ కాళ్ళమీద నిలబెట్టే అవకాశం నావల్ల కలుగుతుంటే — అందుకు నీ పురుష ప్రపంచం నా శీలాన్ని కోరుతుంటే ఆనందంగా సమర్పించుకున్నాను. నీకుద్యోగం దొరికాక నేనింక దారి తప్పవలసిన అవసరం లేదు. ఆడదాని శీలానికి పవిత్రత నాపాదిస్తూ— చాటుగా దాన్నే కోరే పురుషులు జీవితానికిచ్చిన నిర్వచనాన్ని నేనెందుకు ఆమోదించాలి! నాకు నా శరీరంపై అదుపు వుంది. మనసుపై అదుపు వుంది. కానీ నా అన్న నాపై దుష్ప్రచారంచేస్తూ నామీదు పరాయి మగాళ్ళని ప్రోత్సహిస్తాడని తెలిసుంటే ఎప్పుడో ఆత్మహత్య చేసుకుని వుండేదాన్ని!" అంది.

సూర్యారావుకి కాళ్ళకింది భూమి కదిలినట్లయింది. తనకు ఉద్యోగం దొరికింది. ఉద్యోగం కారణంగా రామం స్నేహం దొరికింది. ఆ స్నేహానికి తనెంతో విలువ ఇచ్చాడు. కానీ దాని ఆధారం యెక్కడుంది? తన చెల్లెలి శీలం పోగొట్టుకోవడంలో.

"అన్నయ్యా! ఈ గ్లాసు చూడు. ఎప్పుడో మనింటికొచ్చిన ఓ రోగిష్టి బంధువు దీంతో మంచినీళ్ళు తాగాడు. అందుకని ఇదంటే మనకసహ్యం. దీంతో మంచినీళ్ళు తాగాలంటే ఏదోలా వుంటుంది. అయితే ఇంటికి వచ్చిన అతిధులకోసం దీన్ని అప్పుడప్పుడు వాడుతూనే వున్నాం. వాళ్ళే భావాలూ లేకుండా హాయిగా మంచినీళ్ళు తాగేవారు

దీంతో. వాళ్ళకేమీ కాలేదుకూడా. అంటే ఈ గ్లాసు చెడ్డ తనం, ఈ గ్లాసులోని అసహ్యాత — గ్లాసులోకాక మన బుర్రలో వున్నాయి. ఆడదాని శీలంకూడా మన స్తత్వానికి సంబంధించినదే! లేకపోతే నీ మిత్రుడికి నేనెలా పవిత్రురాలిగా కన్పించగలిగాను?" అంది జానకి.

తనకోసం శీలాన్ని త్యాగం చేసిన జానకి మెత్తటి మనసును సూర్యారావు ఆమోదించలేడు. కానీ ఒకటి రెండు సంఘటనల అనంతరం ఆమెనుగూర్చి ఒక అన్నగా తను ఏం ఆలోచించాడు? ఆమె ప్రవర్తననెలా అర్థం చేసుకున్నాడు! దీనికి మాత్రం అతడు తనను తను క్షమించుకోలేకుండా వున్నాడు. □

పారిపోయిన ఖైదీ!!

సెంట్రీ :- సార్....సార్.... ఇంతక్రితమే ఒకఖైదీగోడ దూకి పారిపోయాడు.

జైలు వార్డర్ :- వ్హాట్? నిజమా?

సెంట్రీ :- అవునుసార్! నేను అప్పుడు గోడచాటున నిలబడి చూశాను.

జైలు వార్డర్ :- ఏవిటీ! నువ్వు గోడచాటున ఉన్నావా.... ఎందుకని?

సెంట్రీ :- అప్పుడు నా చేతిలో తుపాకీలేదుసార్ మరి.

—యం. వీరాస్వామి, మల్కా-జిగిరి.

పనిమనిషి కావాలా?

—కృష్ణచైతన్య

శశాంక సిగరెట్ వెల్గించి ఆమెవైపు పరీక్షగా చూచాడు. ముప్ఫై ఏళ్ళుంటాయి. ఎర్రగా అందంగా, ఆకర్షణీయంగా వుంది.

"నీ పేరు?" అడిగాడు.

"లక్ష్మి!" అంది వినయంగా.

"ఈ ఊరేనా?"

తల వూపింది అవునన్నట్లు.

"పెళ్ళయిందా?"

ఆమె తల ఊపి, భుజంచుట్టూ వున్న పైట క్రిందకు విడచింది. మెడలో పసుపు తాడు కన్పిస్తుంది.

"మీ ఆయన ఏం చేస్తుంటాడు?"

"నన్ను తింటుంటాడు!"

"అంటే?...."

"ఏమీ చెయ్యడు. నేనిచ్చే డబ్బుల్తో తాగి తందనాలాడుతూ వుంటాడు. డబ్బులు ఇవ్వని రోజు చావ బాదుతుంటాడు."

శశాంక తల ఊపి, "నువ్వు చెయ్యవలసిన పనులన్నీ చెబుతాను. జాగ్రత్తగా చేసుకుపోవాలి. అవకతవకలు నేను సహించను" అన్నాడు.

లక్ష్మి తల ఊపి, "ఇంతకు ముందు చాల ఇళ్ళల్లో చేసాను. ఎవ్వరిచేత మాటపడలేదు!" అంది.

"గుడ్! ఉదయాన్నే వాకిలి చిమ్మి ముగ్గువెయ్యాలి. ఆరు గంటలకల్లా నాకు బెడ్ కాఫీ కావాలి. ఏడుగంటలకల్లా టిఫిన్ రెడీ కావాలి. ఎనిమిది గంటలకు నేను ఆఫీసుకు వెళ్ళిపోతాను. భోజనం నువ్వు వండక్కర్లేదు. హోటల్ నుంచి కారియర్ వస్తుంది.

సాయంత్రం మళ్ళీ ఆరుగంటలకొచ్చి ఇల్లు ఊడ్చి, స్నానానికి నీళ్ళుపెట్టి, చపాతీలు చేసి వెళ్ళాలి. ఇవీ నువ్వు ప్రతిరోజు చెయ్యవలసిన పనులు. నీకు జీతం యెంత కావాలో అడుగు!" అన్నాడు శశాంక.

లక్ష్మి తల ఊపి, ఒక్క నిముషం ఆలోచించి, "యాభై రూపాయలు ఇప్పించండి!" అంది నెమ్మదిగా.

శశాంక లేచి నిలబడి "ఉదయాన్నే పనిలోకి వచ్చెయ్!" అన్నాడు లోపలికి నడుస్తూ.

లక్ష్మి ఆనందపడిపోయింది. యాభై రూపాయలకు వొప్పుకుంటాడనుకోలేదు. నిజానికి తనడిగింది చాల యెక్కువే. కనీసం ముప్పై రూపాయలు ఇవ్వకపోతాడా అనుకుంది. అలాంటిది యాభై రూపాయలకు తల ఊపే సరికి ఆనందం వేసింది.

ఇంట్లోకి ఒకసారి తొంగిచూచి "వస్తానండి!" అని అనేసి చకచక బయటకు నడిచింది. వీధి మలుపులో వీరయ్య యెదురయ్యాడు. లక్ష్మి నవ్వుతూ చూచింది భర్త వైపు.

"కాయా? పండా?" అడిగాడు ఆతృతగా.

"పండే! జీతం యాభై రూపాయలు అడిగాను. తల ఊపి, రేపట్నించి పనిలోకి రమ్మన్నాడు!" అంది ఆనందంగా.

"అయితే మనకు పండగన్న మాట. ఆ బొడ్లో రూపాయి నోటుంటే ఇవ్వు. ఆనందం పట్టలేక పోతున్నాను. సారాయితో కట్టెయ్యాలి."

"ఛీ! నీ జిమ్మడ. పెళ్లాం కన్పిస్తే బొడ్డువైపే కాని వంటివైపు చూపే వుండదుగదా!" విసుక్కుంటూనే రూపాయి నోటు తీసి విసిరేసింది.

వీరయ్య దాన్ని కళ్ళకద్దుకొని, "త్వరగా వెళ్ళి చాపల కూర చేసిపెట్టు!" అన్నాడు సారా కొట్టువైపు నడుస్తూ.

2

"శశాంక చిట్ ఫండ్స్" ప్రొప్రైటర్ శశాంకకు ముప్పై ఏళ్ళుంటాయి. ఇంకా పెళ్ళికాలేదు.

చిట్ ఫండ్స్ కంపెనీ కొత్తగా ప్రారంభించడంవల్ల, శశాంకతోపాటు ఆఫీసులో పనిచేసేవాళ్ళు ముగ్గురుకాక, మరో ఆరుగురు ఏజెంట్లు వున్నారు. వ్యాపారం కొత్తగా ప్రారంభించినా, ఆ ప్రాంతాల్లో అలాంటి కంపెనీ లేక పోవడంవల్ల వ్యాపారం చురుగ్గానే సాగుతోంది.

ఉదయాన్నే ఎనిమిదిగంటలకల్లా ఆఫీసుకు బయలు దేరాడు శశాంక. పనిమనిషి లక్ష్మి వంటగదిలో ఏదో సర్దు తోంది.

శశాంక పాకెట్‌లోంచి పర్సు తీసి, డబ్బు లెక్క పెట్టాడు. పదకొండు వందలుంది. పర్సును అలాగే టేబిలు మీద వుంచి, లక్ష్మిని కేకేసాడు.

లక్ష్మి వచ్చింది.

"నీ పనయిపోగానే తలుపులు తాళం వేసుకు వెళ్ళు. నా దగ్గర వొక తాళంచెవి వుంది. ఒక్కోసారి నేను ఇంటికి రావడం ఆలస్యం కావచ్చు...." అన్నాడు బయటకు నడుస్తూ.

శశాంక వెళ్ళాక పనంతా పూర్తి చేసుకొని హాల్లోకి వచ్చేసరికి, టేబిలుమీద పర్సు కనిపించింది. ఆత్రుతగా అందుకొని చూచింది.

చాలా నోట్లు ఉన్నాయి. లెక్కపెట్టలేదు. రెండు వందరూపాయల నోట్లు తీసి మడతపెట్టి జాకెట్లో పెట్టు కొని, మిగతాది పర్సులో ఉంచి, దాన్ని టేబుల్ మీద పడేసి తాళంవేసి ఇంటికి వెళ్ళిపోయింది.

సాయంత్రం శశాంక వచ్చేసరికి లక్ష్మి చపాతీలు చేస్తోంది. బట్టలు మార్చుకొని స్నానం చేసివచ్చి పర్సు అందుకొని గదిలోకి వెళ్ళి డబ్బు చూచుకున్నాడు. రెండు వందలు తగ్గాయి. చిన్నగా నవ్వుకొని పర్సు దిండు క్రింద పెట్టుకున్నాడు.

లక్ష్మి ఏడు గంటలకల్లా పని ముగించుకొని వచ్చి "బాబుగారూ! మీరు టిఫిన్ చేస్తే గిన్నెలు కడిగి వెళ్ళిపోతాను!" అంది ద్వారం దగ్గర నిలబడి

"అప్పుడేనా! నీకేదైనా పని వుంటే వెళ్లు. ఆ తర్వాత తింటాలే!!" అన్నాడు పుస్తకంలోంచి తల యెత్తకుండానే.

"నాకేం పనిలేదు లెండి! మీరు తిన్నాక కడిగి వెళ్ళిపోతాను!"

"నేను తినేసరికి లేటవుతుంది. మీ ఆయనా, పిల్లలు ఎదురుచూస్తుంటారేమో నీ కోసం!"

"నా కింకా పిల్లలు లేరండీ!" అంటూ సుతారంగా సిగ్గుపడి, "మా ఆయన ఊరెళ్ళాడు. కాస్త ఆలస్యం అయినా ఫర్వాలేదు!" అంది నెమ్మదిగా.

"సరే! అన్నీ సర్దిపెట్టు! పది నిముషాల్లో వస్తాను!" అన్నాడు పుస్తకం మూస్తూ.

శశాంక వంటగదిలోకి వెళ్ళేసరికి, అన్నీ టేబిలుమీద సర్దిపెట్టి, ఒక మూలగా నిలబడి ఉంది లక్ష్మి. కుర్చీలో కూర్చొని ప్లేటు ముందుకు లాక్కున్నాడు.

"నేను వడ్డించనా!" అంది చొరవగా ముందుకు వచ్చి గిన్నె అందుకుంటూ.

తలెత్తి ఆమెవైపొకసారి చూచి "ఊ! సరే కానీ!" అన్నాడు చిన్నగా నవ్వుతూ.



శశాంక చపాతీ కొద్దిగా తిన్నాక "ఎలా వున్నాయ్!" అడిగింది.

శశాంక తలెత్తి చూచాడు. టేబిలుమీద ముందుకు వంగి వుండడంవల్ల జారిపోయిందో, లేక కావాలనే జార్చుకుందోగాని పైట మోచేతులమీద వుంది. "చాలా బాగున్నాయ్!" అన్నాడు ఆమె గుండెలవైపు చూస్తూ.

లక్ష్మి చిన్నగా నవ్వి పైట సర్దుకుంది.

"మీ ఆయన బాగా తాగుతాడు కదా! నీకు ఖర్చు ఎక్కువ అనుకుంటాను!"

లక్ష్మి తల ఊపి, "ఏం చెయ్యనండీ! రెక్కలు ముక్కలు చేసుకొని తెస్తున్నా ఆది తాగుడుకు చాలడం లేదు. అప్పటికీ పిల్లలు లేకపోబట్టి సరిపోయింది. లేకపోతేనా, నేను బజారున పడాల్సి వచ్చేది!" అంది నెమ్మదిగా.

లక్ష్మివైపు సానుభూతిగా చూచి, "పాపం! ఎప్పుడైనా

డబ్బులు అవసరం అయితే నన్నడుగు. ఇస్తాను!”
అన్నాడు ఓరగా చూస్తూ.

“అలాగే బాబూ!” అంది లక్ష్మి చిన్నగా నవ్వు
కుంటూ.

శశాంక భోజనం చేసివచ్చాక, మిగిలిన చపాతీలు తిని,
గిన్నెలు కడిగేసి వచ్చింది.

“మీ ఆయన ఊళ్లో లేడు కదా! నీ కొక్కదానికే భయం
వేయదూ!” అడిగాడు శశాంక.

“తప్పుతుందా! రాత్రిపూట యెవరు మాత్రం నన్ను
వాళ్ళ యింట్లో పడుకోనిస్తారు?” అంది నెమ్మదిగా.

శశాంక నెమ్మదిగా ముందుకు వచ్చి, ఆమె చెయ్యి
పట్టుకొని, “ఇక్కడే పడుకోకూడదూ! నీకు భయం
వుండదు!” అన్నాడు.

లక్ష్మి అతని చేతివైపొకసారి చూచి, “ఎందుకు?ఇందు
కేనా?” అంది నవ్వుతూ.

శశాంక కూడా నవ్వి “ఎవ్వరికీ తెలియనివ్వను!”
అన్నాడు చేతులు భుజాలమీదకు పోనిస్తూ.

“ఎవ్వరికీ తెలియకపోతే ఫర్వాలేదు. మా ఆయనకు
తెలిస్తే మిమ్మల్ని, నన్ను నరికి కాకులకు వేస్తాడు!” అంది
దగ్గరగా జరుగుతూ.

“తెలియనివ్వనుగా!” రెండు చేతుల్తో పొదివిపట్టుకొని
గదిలోకి తీసుకెళ్ళాడు.

3

మరునటి రోజు ఉదయం వందరూపాయలు లక్ష్మి
చేతిలో పెట్టాడు శశాంక.

“ఇదేమిటి?” ఆశ్చర్యపడింది లక్ష్మి.

“రాత్రి నువ్విచ్చిన సుఖానికి కాదు. ప్రేమగా యిస్తు

న్నాను."

లక్ష్మి చిన్నగా నవ్వి, "మీరు యేదేదో మాట్లాడేస్తున్నారు! మళ్ళీ సాయంత్రం వస్తా!" అంటూ నోటు బొడ్లో పెట్టుకొని వెళ్ళిపోయింది.

నెల రోజులు గడిచిపోయాయి. ఈ నెలరోజుల్లో వాళ్ళిద్దరి సాన్నిహిత్యం బాగా పెరిగిపోయింది.

ఇప్పుడు లక్ష్మి, ఇంటికి రోజూ వెళ్ళడంలేదు. ఎప్పుడో బుద్ధి పుట్టినపుడు వెళ్ళి వెంటనే వచ్చేస్తుంది. ఈ నెల రోజుల్లో షుమారు వెయ్యి రూపాయల దాకా ముట్టచెప్పాడు లక్ష్మికి. లక్ష్మి జీవితం హాయిగా గడిచిపోతోంది.

"ఇంటికి వెళ్ళకపోతే మీ ఆయన ఏమీ అనడా?" అని శశాంక అడిగాడు.

లక్ష్మి ఆ ఊసెత్తదు. ఆమెకు తెలుసు. భర్త వీరయ్యకు కావలసింది తను కాదు తన డబ్బు అని. ఇప్పటికి భర్త ప్రోద్బలంమీద కొన్ని యిళ్ళల్లో యిలాగే చేసింది. కాని ఏ యింట్లోను యింత గిట్టుబాటు కాలేదు.

వారానికోసారి వంద రూప్తాయలు కళ్ళబడుతుంటే, వీరయ్యకు భార్య గుర్తుకురావడంలేదు. సారాయికొట్టు కదుల్తుంది కళ్ళల్లో.

ఒకరోజు శశాంక హఠాత్తుగా అన్నాడు. "లక్ష్మీ! నేను రేపు ఊరికి వెళుతున్నాను. బహుశా రెండు మూడు నెలలు రాకపోవచ్చు. అప్పటివరకు ఈ డబ్బు నీ దగ్గర వుంచు" అంటూ మూడు వందలు చేతిలో పెట్టాడు.

లక్ష్మికి పిచ్చెక్కినట్లయింది. హాయిగా సాగిపోయే జీవితం వొక్కసారిగా పాతాళంలోకి క్రుంగినట్లని పించింది.

"మరి నా గతి?" నీరసంగా అడిగింది.

"నేను ఊరినుంచి వచ్చాక మళ్లీ వద్దువుగానిలే! ఈ లోపల నీ భుక్తికి పని కావాలంటే, యీ అడ్రస్సుకు వెళ్లు. కాని అక్కడ నా గురించి యేమీ చెప్పకు" హెచ్చరించాడు.

లక్ష్మి నీరసంగా తలవూపి, అడ్రసు కాగితం, డబ్బులు తీసుకొని వెళ్ళిపోయింది. శశాంక ఈలవేసి చకచక బట్టలు సర్దుకోసాగాడు.

4

రెండ్రోజులు గడిచాక, లక్ష్మి, శశాంక యిచ్చిన అడ్రసుకు వెళ్లింది. చిన్న పెంకుటిల్లు. వరండాలో కుర్చీలో కూర్చొని యెవరో వ్యక్తి పేపరు చదువుకొంటున్నాడు.

"బాబుగారూ!" పిలిచింది.

అతను తలెత్తి చూచి "ఏం కావాలి?" అడిగాడు.

"మీకేమైనా పనిమనిషి కావాలా?" అడిగింది.

"నువ్వు పనిమనిషివా," అంటూ ఆమె వైపొకసారి పరీక్షగా చూచి, "సత్యా!" పిలిచాడు బిగ్గరగా.

"ఎందుకు పిలిచారు?" అంటూ ఆమె లోపలినుంచి వచ్చి, లక్ష్మిని చూచి "ఈమె యెవరు?" భర్తను అడిగింది.

"ఎవరో నాకూ తెలియదు. పనిమనిషి కావాలా? అని అడిగింది. మన పనిమనిషి వెళ్ళిపోయిందిగా. నువ్వు మాట్లాడుకుంటావేమోనని పిలిచాను" అన్నాడతను మళ్ళీ పేపరు చదవడంలో మునిగిపోతూ.

సత్యవతి ఆమెవైపు పరీక్షగా చూచింది. సన్నగా ఎర్రగా వుంది. సినిమా యాక్టరులా వుంది అనుకుంది.

"నీ పేరేమిటి?" ఆమె అడిగింది.

"లక్ష్మి!"

"నీళ్లు తోడడం, గుడ్డ ఉతకడం.... అన్ని పనులు చేస్తావా?"

"చేస్తాను!!"

"ఊ! జీతం ఒక అయిదు యెక్కువైనా ఫర్వాలేదు. నమ్మకంగా పని చెయ్యాలి. ఇంతకు ముందో మనిషిని నమ్మి పనిలో పెట్టుకుంటే, వారం రోజుల క్రిందటే, నా ఉంగరం దొంగిలించింది. 'అదేమని' అడిగితే పని మానుకుంది. అర్ధమౌతుందా! అలాంటి అలవాట్లు వుంటే చెప్పు" అంది ఆమె.

"అమ్మతోడు! అలాంటి బుద్ధులు మా ఇంటా వంటా లేదమ్మగారు! ఇంతకు ముందు చాలా ఇళ్లల్లో పనిచేశాను. ఎవ్వరిచేత మాట పడలేదు."

"మరయితే అంతమందిని వొదిలి యిక్కడి కెందుకొచ్చావ్?" అనుమానంగా అడిగిందావిడ.

"నేను పని చేసిన వాళ్ళంతా వుద్యోగస్తులండీ! వాళ్ళంతా వేరే ఊర్లకు మారిపోయారు" అంది సంజాషిగా.

"ఊ! జీతం ఎంత కావాలి?"

"ఇంతకు ముందున్నామెకు ఎంత యిచ్చేవారో అంతే యివ్వండి!" అంది నమ్రతగా.

ఆమె తల వూపి, "ఇంతకు ముందామెకు ముప్పై ఇచ్చే వాళ్లం. ఇప్పుడు నీకూ అలాగే ఇస్తాను. నువ్వు నమ్మకస్తురాలవని నమ్మకం కుదిరితే మరి కాస్త పెంచుతాను. సరేనా?" అంది.

లక్ష్మి తల ఊపింది.

"సరే! రేపటినుంచి పనిలోకి వచ్చెయ్యి." అందామె వెనక్కి తిరుగుతూ.

లక్ష్మి కూడ వెనక్కు తిరిగింది.

అప్పటివరకు పేపరు చదువుతున్న పాండురంగం హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. అతనికి భార్య అంటే భయం. గయ్యాళి అని కాదు. పాండురంగం అసలే నెమ్మదస్తుడు. స్వతహాగా పిరికివాడు. పైగా భార్య తనకంటె ఎక్కువ చదువుకున్నది. అతనిలో ఒక రకమైన ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ ప్రబలింది.

అందుకనే భార్యతో గట్టిగా మాట్లాడాలన్నా, ఎదురుగా ముఖాముఖీ మాట్లాడాలన్నా జంకుతాడు. ఈ లక్షణంవల్ల వొక రకంగా సంసార జీవితం కూడ సుఖంగా అనుభవించలేకపోతున్నాడు.

కాని పాండురంగం భయపడేంత ఇదిగా ప్రవర్తించదు సత్యవతి. భర్తపట్ల, వినయంగానూ, నెమ్మదిగానూ వుంటుంది. కాని భర్త పిరికితనం ఆమె అదోరకం తత్వంగా అర్థం చేసుకొని సరిపెట్టుకుంది.

ఆ యింట్లో భార్యాభర్తల ప్రవర్తన లక్ష్మికి కొద్ది రోజుల్లోనే అర్థమయిపోయింది. అందుకే సాధ్యమయినంత వరకూ పాండురంగానికి దగ్గరవ్వాలని ప్రయత్నం చెయ్యసాగింది.

సత్యవతికి యివేవీ తెలియవు. అసలు లక్ష్మిమీద అనుమానం ఉన్నట్లే అన్పించదు. ఎప్పుడూ యింట్లో వంటపని తప్పితే, పక్కింటి వాళ్ళతో కబుర్లు, ఇవే ఆమె దిన్యచర్య.

లక్ష్మి రోజూ గమనిస్తుంది. ఇంట్లో వంట పదిగంటల కల్లా ఆయిపోతోంది. పది గంటలకు భోంచేసి, పాండురంగం ఆఫీసుకు వెళ్ళిపోతాడు. పన్నెండు గంటలకు సత్యవతి భోంచేసి, కాస్సేపు పడుకొని, రెండు గంటలకు

లేచి టిఫిన్ చేస్తుంది. రెండున్నరకల్లా పాండురంగం యింటికి వచ్చేస్తాడు.

పాండురంగం టిఫిన్ తినేసి తన గదిలోకి వెళ్ళాక, సత్యవతి పక్కింటికి వెళ్లి కబుర్లలో పడుతుంది. నాల్గు గంటలకు లక్ష్మి వచ్చి అంట్లు తోమి, నీళ్లు తోడాక, అప్పుడు వచ్చి మళ్ళీ వంట కార్యక్రమం మొదలుపెడుతుంది.

సత్యవతి దినచర్య లక్ష్మికి బాగా అనుకూలంగా ఉంది. వొక్కో రోజు కావాలని ముందుగా వచ్చి, మొదటగా పాండురంగం గది ఊడవడానికి వెళ్ళేది.

అప్పుడప్పుడు పాండురంగం బెరుగ్గా ఓరకంట తనని చూడడం లక్ష్మి గమనించింది. అలాంటి వ్యక్తిని వలలో వేసుకోవడానికి యెక్కువ కాలం పట్టదు అనుకుంది.

ఆమె అనుకున్నట్లుగానే, వొకరోజు గది ఊడుస్తుంటే పాండురంగం చెయ్యి పట్టుకున్నాడు. లక్ష్మి భయం నటించింది.

"భయపడకు! ఎవ్వరికీ చెప్పను!" అభయమిస్తూ మరింత దగ్గరగా లాక్కున్నాడు పాండురంగం.

భార్యముందు పిల్లిలా వుండే పాండురంగం చొరవకు నవ్వు వచ్చింది లక్ష్మికి.

"ఎందుకు నవ్వుతున్నావ్?" అడిగాడు.

"మీ చొరవకే! ఎంత ధైర్యం మీకు? ఈ విషయం మీ ఆవిడకు తెలిస్తే?"

"తెలియదు? జాగ్రత్తగా వుందాం" అంటూనే మంచం మీదకు లాగాడు. లక్ష్మి మరి పెనుగులాడలేదు. ఆమెకు కావలసిందదే!

పాండురంగంతో లక్ష్మి రాసక్రీడలు ఇంట్లోనే జరిగి

పోతున్నాయి. అయినా, ఏనాడూ సత్యవతికి అనుమానం కలిగినట్లు లేదు.

5

లక్ష్మి రోజూలాగే ఆ రోజు మూడు గంటలకల్లా వచ్చేసి, పాండురంగం గదిలోకి వెళ్ళబోతూ, గదిలో మాటలు విన్పించి బయట ఆగిపోయింది.

గదిలోంచి సత్యవతి గొంతు తారస్థాయిలో విన్పిస్తుంది. లక్ష్మి వాకిలి దగ్గరే నిలబడి మాటలు వినసాగింది.

"మీ కసలు బుద్ధిలేదు. ఇంత బ్రతుకు బ్రతికి పని మనిషితో సంబంధం పెట్టుకుంటారా? అవ్వ! రేపు యీ విషయం నలుగురికీ తెలిస్తే తలెత్తుకొని తిరగ్గలమా? ఈ రోజు కాకపోయినా రేపయినా యీ విషయం బయటకు పొక్కకుండా ఉంటుందా? ఇంట్లో పనిమనిషి అంటే రేడియో స్టేషన్‌లాంటిది. ఇళ్ళల్లో వ్యవహారాలన్నీ పదిమందికి వీళ్ళవల్లే తెలుస్తాయి.

అదీగాక, దీని వాలకం చూస్తుంటే అసలే కక్కుర్తి ముండలా ఉంది. డబ్బుకు ఆశించి, రేపు యీ విషయం పదిమందికి చెబుతానని బెదిరిస్తే?....యీ రహస్యం కప్పిపుచ్చుకోడానికి ఎంత డబ్బయినా ధారబొయ్యాక తప్పదుగా. ఏదో నెపంపట్టి పని మాన్పిస్తే వెంటనే ఊరంతా టాం-టాం చెయ్యదూ?....

చెప్పండి మాట్లాడరేం? తప్పుడు పనులన్నీ చేసేసి మూగ మొద్దులా కూర్చుంటే యీ సంసారం పరువేంగాను? సరే! అయిపోయిందేదో అయిపోయింది. ఇకముందు నుంచి జాగ్రత్తగా ఉండండి ...దాన్ని దగ్గరకు రానివ్వకండి.

మీ ఇద్దరి విషయం నాకు తెలుసని దానికి తెలియనివ్వ



వద్దు. అది రెండు విధాల నష్టం. మొదటిది దానిముందు నేను చులకనై పోతాను. రెండోది, నాకు యీ విషయం తెల్సిందని దానికి తెలిస్తే భయపడి పని మానేస్తుంది. ఆ తర్వాత ఊరంతా మీ గురించి చెబుతుంది మీరు కూడా ఏమీ తెలియనట్లు ఉండండి. కొద్దిరోజులు పోయాక ఏదో విధంగా దానికి ఉద్వాసన చెబుదాం! సరేనా!...."

కొద్దిసేపటికి సత్యవతి వొస్తున్న చప్పుడయి, చటుక్కున వెనక్కు తిరిగి వీధిలోకి నడిచింది లక్ష్మి. సత్యవతి మాటలు విన్నాక మళ్ళీ అక్కడకు వెళ్ళాలంటే భయం వేసింది. నేరుగా ఇంటికి వెళ్ళి పడుకుంది.

పడుకున్నదేగాని మనసంతా ఆలోచనలతో నిండి పోయింది. సత్యవతి మాటలు తను విన్నట్లు ఆమెకు తెలియదు. కాబట్టి రేపు పనిలోకి మామూలుగా ఏమీ తెలియనట్లే వెళ్ళాలి.

పోతే, సత్యవతి మాటలవల్ల ఇంకో ఆలోచన వచ్చింది. తమ సంబంధం గురించి బయటపెడతానని పాండురంగాన్ని బెదిరిస్తే బాగా డబ్బులు రాలుతాయి. శశాంక

ఉన్నంత కాలం హాయిగా గడిచింది. ఇన్నాళ్ళకు మళ్ళీ మంచి రోజులొచ్చాయనిపించింది.

ఆయినా ఎందుకో అనుమానం వేపింది. ఒకవేళ పాండురంగం ఎదురు తిరిగి డబ్బులు ఇవ్వనంటే.... తను చెయ్యగల్గిందేమీలేదు. తను కేవలం బెదిరించగలదు గాని, నిజానికి ఆ విషయం బయటపెడితే చుట్టుపక్కల వాళ్ళు తననే తిడతారు.

పదిమందికి యీ విషయం తెలిస్తే, తన గత చరిత్ర కూడ బయటకు వస్తుంది. తనకు పని ఎవ్వరూ ఇవ్వరు. కాబట్టి తను ఆ విషయం ఎవ్వరికి చెప్పలేదు. కేవలం బెదిరించి డబ్బు గుంజుకోవడమే తను చెయ్యగలిగిన పని.

మరుసటి రోజు ఉదయం మామూలుగానే పనిలోకి వెళ్ళింది.

సత్యవతి ఏమీ అనలేదు. పాండురంగం తప్పించుకు తిరుగసాగాడు.

అలా మూడు రోజులు గడిచాయి.

ఆ రోజు సాయంత్రం పాండురంగాన్ని అడిగింది. "మా ఆయనకు ఆరోగ్యం బాగలేదు. డాక్టరుకు చూపించాలి. ఓ యాభయిరూపాయలుంటే ఇవ్వండి!" అని.

పాండురంగం మొదట ఆశ్చర్యపోయినా, తర్వాత లేచి వెళ్ళి డబ్బు తెచ్చిచ్చాడు. ఆ తర్వాత రెండ్రోజులు ఆగి మళ్ళీ అడిగింది. ఇచ్చాడు.

రెండ్రోజులు ఆగాక మళ్ళీ అంది. "మా ఆయనకెందుకో నామీద అనుమానం కల్గింది. రాత్రి పెద్ద గొడవ చేశాడు."

"అలాగా? ఎలా మరి?"

"ఏముంది! వాడి మొహానో వంద రూపాయలు కొడితే

తాగి పడుంటాడు."

"వందరూపాయలే!" అదిరిపడ్డాడు పాండురంగం.

"మరెట్లా! వందరూపాయలకు మీరు పాలుమాలితే, రేపు మీ ఇంటికొచ్చి, ఆ తర్వాత మీ గురించి ఊరంతా చెబుతాడు. ఎంతకైనా తెగించిన చచ్చినోడు," అంది.

పాండురంగానికి డబ్బు ఇవ్వక తప్పలేదు. ఆ నెలలో అరువందలదాకా గుంజుకుంది పాండురంగం దగ్గర.

ఒకరోజు పాండురంగం తెగించి అనేసాడు. "నువ్వు రోజు ఇలా అడుగుతుంటే ఎక్కడ తెచ్చేది? నీ జీతం అరువందలు. ఈ నెల్లోనే నీకు అరువందలు ఇచ్చాను. అప్పటికీ అందినచోటల్లా అప్పులుచేసాను. ఇంకెక్కడ దొరికే మార్గం కూడ లేదు. నన్నిక అడక్కు."

లక్ష్మి ఏమీ అనలేదు. చిన్నగా నవ్వి వెళ్ళిపోయింది. మరుసటి రోజు ఉదయం కావాలనే బాగా చిరిగిపోయిన చీరకట్టుకొని పనిలోకి వెళ్ళింది.

అసహ్యంగా కన్పిస్తున్న ఆ చిరుగుల చీరను, వాటి ల్లోంచి కన్పిస్తున్న వంపుసొంపులు చూచి, సత్యవతి అననే అనింది.

"ఏమే! నీకంతకంటె మంచి చీరలేం లేవా? ఇలా వొళ్లంతా కన్పించే చీరలు కట్టుకొని మగవాళ్ళముందు తిరుగుతుంటే మర్యాదగా ఉంటుందా? రేపట్నుంచి మంచి చీర కట్టుకొని రా!" హెచ్చరించింది.

సత్యవతి అటు బయటకు వెళ్ళాక పాండురంగం గదిలో దూరి "విన్నారుగా! మీ భార్య మాటలు. ఇలాంటి చీరలు కట్టుకొని మీ ముందు తిరగకూడదట. నాకింతకంటె మంచి చీరలు లేవని చెప్పనా? లేక మీకు నన్నిలా చూడ్డం

అంటే ఇష్టం అని చెప్పనా?" అడిగింది.

"ఏమిటి నువ్వనేది?" కోపంగా అన్నాడు పాండు రంగం. తను ఎలాంటి రొంపిలో కూరుకుపోయింది అర్థమైంది.

"నేనేమన్నాను. నాకింతకంటె మంచి చీరలు లేవు. ఓ యాభయి రూపాయలుంటే ఇవ్వండి. లేదా రెండు చీరలు తెచ్చివ్వండి. రెండూ కాదంటే, రేపూ ఇలాగే వస్తాను. మీ భార్య నన్ను పనిలోంచి తీసేస్తుంది. ఆ తర్వాత మీ విషయం నేనెక్కడైనా నోరు జారి అన్నాననుకోండి.... మీ పరువేమౌతుంది?"

పాండురంగం ఉగ్రుడైపోయాడు.

"ఛీ! నీచురాలా! నీ బుద్ధి ఇప్పటికి తెల్సింది. నువ్వింతకు తెగించినదానివని అనుకోలేదు. వెళ్ళు. ఈసారి నా దగ్గరకు డబ్బులకు వచ్చావంటే చంపి పెరట్లో పాతేస్తాను. వెళ్ళిక్కణ్ణించి!"

సౌమ్యంగా కన్పించే పాండురంగంలో అంత కోపం, ఆవేశం ఎన్నడూ చూడలేదు. లక్ష్మికి కాస్త జంకు కల్గింది. కాని అది క్షణికమే. చిన్నగా నవ్వుకొని పెరట్లోకి నడిచింది.

సాయంత్రం పాండురంగమే వెళ్లాడు లక్ష్మి దగ్గరకు. లక్ష్మి పెరట్లో నీళ్లు తోడుతోంది. సత్యవతి ఇంట్లో లేదు.

"చూడు లక్ష్మీ! ప్రతిసారి డబ్బుకు నన్నిలా వేధించడం న్యాయంకాదు. ఇప్పటికే అందినంతవరకు అప్పులు చేసి, దిక్కులు తోచక చస్తున్నాను. ఇక ఆఫీసు డబ్బు ఒక్కటే శరణ్యం. అది తాకితే నా ఉద్యోగం ఊడుతుంది. మేమిద్దరం అడుక్కుతినాలి. మాటిమాటికి ఇలా అడ

క్కుండా ఎంత కావాలో ఒక్కసారి చెప్పెయ్యి. ఎక్కడో తల తాకట్టుపెట్టయినా తెచ్చిస్తాను. ఇకమీదట నన్ను బాధించకు. నీకు పుణ్యం ఉంటుంది" ప్రాధేయపడ్డాడు.

రెండు నిముషాలు ఆలోచించి, "ఓ అయిదువంద లిచ్చేయండి! ఇక మిమ్మల్ని అడగను!" అంది.

"అయిదువందలా?—సరే, అలాగే ఇస్తాను. తప్పు తుందా? కాని ఒక విషయం. ఈ రాత్రికి నువ్వు రావాలి. చాల రోజులయింది" అన్నాడు.

"ఎక్కడికి! ఇక్కడకా! మీ ఆవిడ వూరుకుంటుందా?" నవ్వింది.

"ఇక్కడకాదు. మరెక్కడైనా సరే!" అని రెండు నిముషాలు ఆలోచించి, "ఆ! వూరిబయట పాడుబడిన బంగ్లా ఉందిగా. అక్కడికి వచ్చెయ్యి. నీ డబ్బులు కూడ ఎలాగో తెచ్చిస్తాను."

లక్ష్మి తలవూపి, "అలాగే! పదిగంటలకు వస్తాను. ఇంకోమాట. వచ్చేటప్పుడు ఒక చీర జాకెట్టు కూడ తీసుకు రండి!" అంది నవ్వుతూ.

పాండురంగం కూడ నవ్వి, "అలాగే! అక్కడే సింగారించుకొందువు!" అన్నాడు చిలిపిగా.

6

రాత్రి తొమ్మిది గంటలయింది.

పాండురంగం మంచంమీదనుంచి లేచి గది బయటకు తొంగి చూశాడు.

ముందు గదిలో సత్యవతి ఏదో పత్రిక చదువుతుంది. చప్పుడు కాకుండా వెనక్కువచ్చి, పరుపు క్రింద దాచిన కత్తి తీసి బొడ్లో దాచుకున్నాడు. ఉదయం లక్ష్మికోసం ప్రత్యే

కంగా కొన్నాడు దాన్ని. సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె జేబులో వేసుకొని బయటకు వచ్చాడు.

"బజారుకు వెళుతున్నారా?" అడిగింది సత్యవతి.

"ఆ! కాస్త ఆలస్యం అవుతుంది. ఏమైనా కావాలా?" అడిగాడు.

"వచ్చేటప్పుడు అరటిపండ్లు దొరికితే తెండి!" అంది పుస్తకంలోంచి తలెత్తకుండానే.

పాండురంగం తల వూపి బయటకు నడిచాడు. బజారు సెంటర్‌కు వెళ్ళి, కాఫీ త్రాగి నేరుగా వూరి చివర బంగళా దగ్గరకు వెళ్లాడు.

చుట్టూ చీకటి. నిర్మానుష్యంగా ఉంది చుట్టుపక్కల. లక్ష్మి ఇంకా రాలేదు. సిగరెట్ వెల్గించి ఒక పక్కగా నిలబడ్డాడు.

'దొంగముండ! ముందుగా అదే రెచ్చగొట్టి తనను బ్లాక్ మెయిల్ చేస్తుందా? అప్పటికీ దానికి భయపడి ఎంత ధారబోసాడు? ఇలాంటివాళ్ల ఆశకు అంతెక్కడ? భయపడే కొద్దీ బెదిరిస్తూనే ఉంటారు. ఈ రోజుతో దాని చాప్టరు క్లోజ్ చెయ్యాలి. ఈ హత్య తను చేసినట్లు ఎవరు అనుమానిస్తారు? నాలాగా ఇంకెంతమందితో సంబంధం వుందో?ఏది ఏమైనా ఇక దీని బాధ తట్టుకోవడం కష్టం. ఏదో ఒకటి చెయ్యకపోతే జీవితాంతం నవ్వులపాలు కాక తప్పదు!" ఆలోచించుకుంటూ నిలబడ్డాడు.

దూరంగా చీకట్లో తెల్లచీర కట్టుకొని లక్ష్మి వస్తూ కన్పించింది. సిగరెట్ క్రిందపడేసి కాలితో నలిపి, కత్తి తీసి జేబులో పెట్టుకున్నాడు.

"నాకంటె ముందుగా వచ్చారే! పాపం చాలా

ఆత్రుతగా ఉన్నట్లుంది!" అంది దగ్గరకు రాగానే.

పాండురంగం సంకోచించలేదు. చటుక్కున ఒకచేత్తో ఆమె నోరు మూసి, రెండో చేత్తో కత్తితీసి గుండెల్లో పొడిచాడు. గిలగిలా కొట్టుకొని, ఒక్కసారి తల వాల్చేసింది.

శవం రెండు చేతులూ పట్టుకొని, లాక్కెళ్ళి ఒక మూల గోడవారగా పడేసి, కత్తి దూరంగా విసిరేసి, చుట్టూ ఒకసారి చూచి, చకచక ఇంటివైపు నడిచాడు. వూర్లోకి వచ్చాక, వీధిదీపాల వెలుగులో అప్పుడు చూచాడు చొక్కామీద రక్తం మరకలు. అదిరిపడి చీకట్లోకి వెళ్ళి చొక్కా విప్పి చేత్తో పట్టుకొని, చిన్న చిన్న వీధులగుండా ఇంటికి వెళ్ళాడు.

నెమ్మదిగా వరండాలోకి వెళ్ళి లోపలికి తొంగిచూశాడు. ఒకవేళ సత్యవతి మేలుకొని ఉంటే ఏం చెయ్యాలో ఆలోచించలేదు. కాని అదృష్టం బావుండి, సత్యవతి కుర్చీలో అలాగే నిద్రపోయింది.

చప్పుడు కాకుండా లోపలికివెళ్ళి, బట్టలు మార్చుకున్నాడు. ఒక్క నిముషం అలాగే నిలబడి, ఆ తర్వాత లోపలికి వెళ్ళి గునపం తెచ్చి పెరట్లో గొయ్యితీసి, బట్టలు అందులో వేసి పూడ్చిపెట్టి వచ్చి తలుపులు గడియపెట్టి పడుకున్నాడు.

మరుసటి రోజు సాయంత్రం పోలీసులు వచ్చి లక్ష్మిని హత్య చేసినందుకుగాను పాండురంగాన్ని అరెస్టుచేసారు.

వాళ్ళు చూపిన అధారాలు చూచి పాండురంగం మాట్లాడలేదు. హత్యచెయ్యడానికి కూడ అనుభవం ఉండాలనే విషయం అప్పుడు తెల్సుకున్నాడు. కత్తిపిడిమీద వేలి

ముద్రలు....రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో వూరి చివర బంగ్లావైపు వెళుతుండగా చూచిన సాక్షులు.... ఆపైన పోలీసుల పరిశోధనలో పెరట్లో దొరికిన బట్టలు... అనుభవంలేక ఆవేశంతో చేసిన తప్పులు అతడిని పట్టిచ్చాయి.

పాండురంగం భార్యతో మాట్లాడలేదు. అప్పటికే పోలీసులు ఆమెకు అన్ని విషయాలు చెప్పేసారు. వెళ్లిపోతూ చివరిసారిగా భార్యవైపు చూసాడు.

"ఛీ! పరిమనిషితో సంబంధం పెట్టుకుని ఇంత నీచానికి దిగజారుతావా? ఇక నీ మొహం నాకు చూపించొద్దు!" అన్నట్లున్నాయి ఆమె చూపులు.

పాండురంగం వెళ్లిపోయాడు.

సత్యవతి ఘొల్లుమంది. చుట్టుపక్కల వాళ్లు చుట్టుముట్టారు. □

దెబ్బలాట?

M. L. A. జ్ఞానసూన్యం గారిని ఫుట్‌బాల్ మాచ్ చూడడానికి ఆహ్వానించారు. ఆట సగందాకాచూసేక నిర్వాహకులు ఆటమీద ఆయన అభిప్రాయం అడిగారు.

"అన్నీ బాగున్నాయి కానీ, ఒకబంతిగురించి ఇరవైమంది దెబ్బలాడుకోవడం మాత్రం బాగులేదు. అందరికీ తలాఒకబంతి ఇస్తేపోలా!" ఉచిత సలహా పారేశారు M. L. A. గారు.

నిర్వాహకులకు నోట మాటరాలేదు! పాపం!!

—డాక్టర్ ప్రభాకర్, కలకత్తా-73

మానభంగం

బొమ్మిడి అచ్చారావు

రాత్రి ఎనిమిది గంటలయింది.

ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ తన ఆఫీసుగదిలో యేవో ఫైళ్లు చూసుకుంటున్నాడు. ఇంతలో సుడిగాలిలా లోనికి ఓ

యువతి దూసుకువచ్చింది.

శ్రీనివాస్ దిగ్గున తలెత్తి ఆమెను చూసి విస్తుపోయాడు.

ఆమె దుస్తులు చీలికలు పేలికలై వున్నాయి. ముఖం మీద, శరీరంమీద అక్కడక్కడ గోళ్ళతో రక్కిన గుర్తులు కనిపిస్తున్నాయి. బుగ్గమీద పళ్ళగాట్లు స్పష్టంగా పడ్డ ఛాయలున్నాయి.

"ఇన్స్పెక్టర్‌గారూ...." ఆమె ఏదో చెప్పడానికి నోరు తెరిచి, చెప్పలేక ఆయాసపడుతోంది.

"ఏమిటమ్మా? ఏమయింది?" ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఆతృతగా అడిగాడు.

ఆమె వెక్కిళ్ళమధ్య సగం సగంగా చెప్పింది. "ఓ దుర్మార్గుడు నన్ను....నన్ను....నా శీలం హరించాడు."

ఆమె చెప్పేలోపలే శ్రీనివాస్‌కి పరిస్థితి అర్థమయింది. గాట్లు, రక్కులు ప్రత్యక్షంగా కనిపిస్తోన్నాయి. ఓ ఆడది రాత్రివేళ పనికట్టుకుని పోలీస్‌స్టేషన్‌కి రావటం చాలా అరుదు. ప్రాణంకన్న మిన్నగా చూసుకునే శీలం పోగొట్టుకున్న ఆమెవంక జాలిగా చూశాడు శ్రీనివాస్.

"మీకు జరిగిన అన్యాయం మీరు చెప్పకనే తెలిసిపోతోంది. మీ శీలాన్నపహరించిన ఆ పాపాత్ముణ్ని పట్టి జైలులో పారేస్తాం. వాణ్ణి గురించిన వివరాలు చెప్పగలరా?" అడిగాడు శ్రీనివాస్.

ఆమె దుఃఖాన్ని దిగమింగింది, "వాడు నాకు ఇదివరకే తెలుసు. ఎన్నోసార్లు పిచ్చివేషాలు వేయబోతే చివాట్లు వేశాను. వాడు మళ్ళీ నా జోలికి రాకుండా సరైన గుణపాఠం చెప్పాలనుకొన్నాను. కాని యింతలోనే...." ఇక మాటలు రాలేదు ఆమె గొంతునుండి.

కొంతసేపు ఆమెని డిస్టర్బ్ చెయ్యలేదు శ్రీనివాస్.

ఆమె బాగా తేరుకొంది.

"చూడండమ్మా! వాణ్ణిపట్టి శిక్షిస్తాం. వివరాలు చెబు తారా?" అనడిగాడు శ్రీనివాస్.

ఆమె చెప్పింది. "మీ పేరు?" అడిగాడు.

"మనోరమ" చెప్పింది.

"కోర్టు సాక్ష్యం నిమిత్తం మీరు డాక్టర్ పరీక్ష చేసు కోవటం అవసరం. డాక్టరుని పిలిపిస్తాను. మీ సౌకర్యార్థం లేడీ డాక్టరుని పిలిపించి పరీక్ష చేయిస్తాను" అన్నాడు శ్రీనివాస్.

ఆమె అంగీకార సూచకంగా తలూపింది.

సార్జంటుని పిలిచి యేదో చెప్పి పంపించి, తను కానిస్టే బుల్సుతో పోలీసుజీపులో బయలుదేరాడు శ్రీనివాస్.

2

"నాకేం తెలియదు. నన్ను విడిచిపెట్టండి" అన్నాడు ప్రభాకర్ తన్ను అరెస్టు చేయవచ్చిన ఇన్స్పెక్టర్‌తో.

"అవన్నీ కోర్టులో చెప్పుకో. ఓ అమాయకురాల్ని మానభంగం చేసిన నేరానికి నిన్ను అరెస్టు చేస్తున్నాను," అన్నాడు ఇన్స్పెక్టర్ శ్రీనివాస్.

"మావారు అలాంటి పాడుపని చెయ్యరు. మీరు పొర బడుతున్నారు. దయచేసి ఆయన నేమీ చెయ్యకండి," ప్రాధేయపడుతూ అన్నది ప్రభాకర్ భార్య.

"అయామ్ సారీ! ఈ విషయంలో ఇక చెప్పేదేం లేదు. పద మిస్టర్" పోలీసుజీప్ ఎక్కించాడు ప్రభాకర్‌ని, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్.

మర్నాడు డ్యూటీలోకి రాగానే శ్రీనివాస్ డాక్టరు రిపో ర్టును శ్రద్ధగా పరిశీలించాడు.

అందులో మనోరమ మానభంగం గురించిన పూర్తి

వివరాలున్నాయి. ఆమె పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టు చెయ్యటానికి అరగంటముందే ఘోరంగా మానభంగం చెయ్యబడింది. అందుకు సాక్ష్యంగా ఆమె మర్మావయవంలో పురుష బీజకణాలు—యింకా ప్రాణంతోనే వున్నాయి. ఆమెని హింసించి, బలవంతంగా అనుభవింపబడిందని డాక్టరు తన రిపోర్టులో ధృవపరిచింది.

రిపోర్టు మడిచి కవరులో పెట్టాడు శ్రీనివాస్.

"మావారు నిర్దోషి. ఆయన నెలాగయినా రక్షించాలి. అందుకు మీరే సమర్థులు." ఆమె గబగబా తను చెప్పాల్సిన రెండుమాటలు చెప్పేసింది.

"కంగారేం లేదు. విషయమేమిటో తాపీగా చెప్పండి" అంది లాయర్ బిందు.

"అంతా చెబుతాను. మీరు మాత్రం నా భర్తని రక్షిస్తానని మాట ఇవ్వండి" అందామె.

"ముందు విషయమేమిటో చెప్పకుండా మీ ఆయన్ని రక్షిస్తానని ఎలా చెప్పను? ధర్మం మీవారిపట్ల వుందనిపిస్తే ఏ చిన్న అవకాశమున్నా అతన్ని తప్పక రక్షిస్తాను. అది నా డ్యూటీ" అంది బిందు చిన్నగా నవ్వుతూ.

"ఆ మాటన్నారు, చాలు! మా వారి పేరు ప్రభాకర్. నాపేరు పద్మ. మావారు మనోరమ అనే స్త్రీని మానభంగం చేశారన్న నేరమీద నిన్న అరెస్టుచేశారు. నిజానికి మావారికి ఏ పాపమూ తెలియదు. గొప్పకాదుగాని, ఆయన శ్రీరామచంద్రుడులాంటి ఏకపత్నీవ్రతుడు. నేను తప్ప మరో ఆడదాని ముఖం ఎరుగరు" అంది పద్మ.

బిందు చిన్నగా నవ్వి, "మీ వారంటే మీకు చాలా ప్రేమ అనుకుంటాను" అంది.

పద్మ ముఖం ఓక్షణం ఎర్రతామరలా వికసించింది. మరుక్షణమే కలువ పువ్వులా వాడిపోయింది.

"మా వారిమీద పిచ్చిప్రేమతో ఆయన గురించి అంతా మంచే చెపుతున్నాననుకోకండి. ఆయన తత్వం చిన్నతనం నించీ తెలిసినదాన్ని. నేను ఆయన మేనకోడల్ని. మా అమ్మ ఆయనకి స్వయానా అక్క" అంది పద్మ.

"ఓకే. ఒప్పుకుంటున్నాను. అయితే కోర్టుకి మీ నమ్మకాలతోను, ఆత్మవిశ్వాసాలతోను పనిలేదు. మీవారు నిర్దోషి అని నిరూపించగల గట్టి సాక్ష్యాధారా లేమయినా వున్నాయా? ఉంటే చెప్పండి" అంది బిందు.

"మావారు పేపరుమిల్లులో పనిచేస్తున్నారని చెప్పాను కదా! ఆయనది 'బి' షిఫ్టు. నిన్నరాత్రి ఆయన ఇంటికొచ్చే సరికి పదిగంటలు దాటి పదిహేను నిముషాలు అయింది. భోజనానికి కూచుంటున్నారు. ఇంతలో పోలీస్ జీపువచ్చింది. ఆయన్ని అరెస్టు చేశారు. మీరు రక్షించకపోతే నేను నా యిద్దరు పిల్లలు దిక్కు లేని వాళ్ళమయిపోతాం" అంది పద్మ.

బిందు సాలోచనగా తలూపింది.

"ఇంకా ఏమయినా చెప్పగలరా?"

లేదన్నట్టుగా తలూపింది పద్మ.

"మీ వారిని బెయిలుమీద విడిపించే యేర్పాటుచేస్తాను. మీ పెద్దవాళ్ళెవరయినా వున్నారా, సెక్యూరిటీ ఇవ్వడానికి" బిందు అడిగింది.

"మా నాన్నగారికి టెలిగ్రాం యిచ్చాను. ఈ పాటికి వస్తూవుంటారు" అంది పద్మ.

"ఒకే. ఆయన రాగానే నాకు కబురు పెట్టండి" అంది బిందు.

పద్మ హేండ్ బాగ్ లోంచి డబ్బుతీసి "మీ ఫీజుకింద

వుంచండి" అని ఇవ్వబోయింది.

బిందు వారించి "నో నో. కేసు పూర్తయాక ఇద్దరు గాని, వుంచండి" అంది.

పద్మ నమస్కారం చెప్పి వెళ్ళిపోయింది.

4

"రండి వదినగారూ! మా బ్రదర్ వున్నాడా?" పలకరింపుగా అడిగాడు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్.

"ఇప్పుడు మీ వదినగారిగా యిక్కడికి రాలేదు ఇన్‌స్పెక్టర్! డ్యూటీమీద వచ్చాను" అంది బిందు.

"అంటే....?" ఆశ్చర్యంగా చూశాడామెవంక.

"ప్రభాకర్ కేసులో వాళ్ళ తరపున నేను వాదించబోతున్నాను. ఈయన ప్రభాకర్ బావగారు. ప్రభాకర్‌ని బైలు మీద విడిపించటానికి వచ్చాడు."

సంతకాలు అయినాక, "మిసెస్ కిరణ్! మీరీ కేసులో ఒప్పుకోవటం నా కెందుకో ఇష్టంలేదు" అన్నాడు శ్రీనివాస్ బిందుతో.

"ఏం? ఎందుకని?" నవ్వుతూ అడిగింది బిందు.

"ముద్దాయి నేరం చేశాడనటానికి ఎలాంటి సందేహమూ లేదు. దేర్ ఈజ్ క్లియర్ ఎవిడెన్స్ ఆఫ్‌ది అఫెన్స్!" అన్నాడు శ్రీనివాస్.

"బట్, ఎవిడెన్స్ ఈజ్ నాట్ నెసెసరిలీ ఎ ప్రూఫ్! చూద్దాం, ధర్మం ఎవరి పక్షాన వుందో!" అంది బిందు.

"మీరీనాటి వరకూ చేసిన కేసులన్నీ మీకు యెనలేని కీర్తి తెచ్చాయి. అపజయం ఎరుగని మీరు ఇలాంటి కేసు టేకప్ చెయ్యటం ఏం బావుంది చెప్పండి."

"యూ డోంట్‌వర్రీ మిస్టర్ ఇన్‌స్పెక్టర్! ఈ కేసు

కూడా నాకు కీర్తి తెచ్చిపెడుతుందనే నా నమ్మకం!" అంది ఆత్మవిశ్వాసంతో బిందు.

5

"మనోరమ మీకు తెలుసా?" అడిగింది బిందు, ప్రభాకర్‌ని.

"తెలుసు."

"ఎన్నాళ్ళుగా?"

"ఆమె, నేను కలిపి చదువుకున్నాం."

"ఐసీ, ఎన్నాళ్ళు?"

"దాదాపు ఆరేళ్ళు. హైస్కూలు చదువంతా యిద్దరం కలిసే చదివాం. ఆమెది మా వూరే."

"చదువుకునే రోజుల్లో మీ యిద్దరూ బాగా చనువుగా తిరిగేవారా?"

"చనువుగా అంటే, ప్రేమించుకోవటం. అదీ అని మీ అభిప్రాయమా?"

"ఆ, అదే."

"మనోరమ నన్ను ప్రేమించానని చెప్పింది వోసారి. నేను ఇష్టపడలేదు. ఆమెని నేనేనాడూ ఆ అభిప్రాయంతో చూడలేదు. అదే చెప్పానామెకు."

"ఆ తర్వాత మనోరమ మిమ్మల్ని మర్చిపోయిందా?"

ప్రభాకర్ రెండుక్షణాలు మాట్లాడలేదు.

"పెళ్ళి చేసుకోకపోయినా ఫరవాలేదు, తనతో సెక్స్ జీవితం అనుభవించమంది. అందుకు నేను ఒప్పుకోలేదు. తర్వాత నేను కాలేజీ చదువుకి వేరే వెళ్ళాను. మనోరమ సంగతి పట్టించుకోలేదు."

"చివరిసారి మీరు మనోరమని ఎప్పుడు చూశారు?"

"నేను బియస్సీ సెకండియర్లో వుండగా ఓసారి మా వూరు వచ్చినపుడు చూశాను. ఎవడితోనో తిరిగి కడుపు తెచ్చుకొని ఏబార్షన్ చేయించుకుందని విన్నాను. వెళ్ళి చూశాను. తను చేసిన పనికి యేమీ బాధపడినట్టు కన్పించ లేదు. అసహ్యంవేసి తిరిగొచ్చేశాను."

"తర్వాత ఇక ఆమెను కలుసుకోలేదా?"

"రెండు నెలల క్రితం మనోరమని యీ వూళ్ళో ఓ సినిమా హాలుదగ్గర చూశాను. దాదాపు ఎనిమిదేళ్ళ తర్వాత మళ్ళీ చూశాను. నన్నుచూసి దగ్గరకొచ్చింది. చాలా మారి పోయింది. గుర్తుపట్టాను. అందరూ చూస్తున్నారనే జ్ఞానం లేకుండా వచ్చి చెయ్యి పట్టుకుంది. చిన్ననాటి విష యాలన్నీ బడబడావాగేస్తూ, నా గురించి అన్నీ అడిగి తెల్సుకుంది. తను పెళ్ళిచేసుకోలేదనీ, ఏదో ప్రయివేటు కంపెనీలో సేల్సుగరల్‌గా పనిచేస్తోన్నానని, తనని వుంచు కోమని అడిగింది. నాకు కంపరమెత్తింది. జవాబు చెప్ప కుండా వచ్చేశాను."

"తర్వాత?"

"సరిగ్గా వారంరోజుల క్రితం సరాసరి మా ఫ్యాక్టరీకి ఫోన్‌చేసింది. తనెంతో ఇబ్బందుల్లో వున్నానని, యేదో డబ్బు గొడవలో చిక్కుకున్నాననీ ఓ అయిదువేలు సర్దమని అడిగింది. నేను లేదనిచెప్పి ఫోన్ పెట్టేశాను. నేను షిఫ్టు దిగేసరికి ఫ్యాక్టరీ దగ్గర నాకోసం కనిపెట్టుకొని వుంది. పక్కన యెవరో మగాడు వున్నాడు. డబ్బు ఇస్తేసరి, లేకుంటే నా అంతు చూస్తానంది. పక్కన వున్నవాడు నా కేసి కోరగా చూశాడు. నేను లెక్క చెయ్యకుండా వచ్చేశాను" అన్నాడు ప్రభాకర్.

"ఈ విషయాలన్నీ మీ భార్యకు తెలుసా?"

"తెలియదు. నే నెన్నడూ చెప్పలేదు. సుఖంగా సాగిపోతున్న సంసారంలో కలతలు రేగటం నాకిష్టంలేదు."

"నిన్న సాయంత్రం ఏడు-ఎనిమిది గంటలమధ్య మీరు యెక్కడున్నారు?"

"నిన్న నాది 'బి' షిఫ్టు. అంటే మధ్యాహ్నం రెండు గంటలనుండి రాత్రి పదిగంటలవరకు."

"అంటే మీరు ఫ్యాక్టరీలో వున్నట్టేకదా!"

ప్రభాకర్ ఇబ్బందిగా చూశాడు.

"నిన్న సాయంత్రం ఏడుగంటలకు నాకు ఫ్యాక్టరీకి ఫోన్ వచ్చింది. మాయింటి పక్కపోర్షన్‌లోని అతను ఫోన్‌చేసి, నా భార్యకు అకస్మాత్తుగా పొత్తికడుపులో నొప్పి వచ్చిందనీ, బాధతో మెలికలు తిరిగిపోతోందని చెప్పాడు.

"నేను మా సూపర్‌వైజరు పర్మిషన్ తీసుకొని వెంటనే యింటికి వెళ్ళాను. అయితే అదంతా ఉత్తదే! మా పక్కింటతను ఫోన్ చేయలేదు. ఎవరో అలా అబద్ధపు సమాచారం

చేసారు. నా భార్యకి యేమీ కాలేదు. నేను మళ్ళీ వెంటనే పేపరు మిల్లుకి తిరిగి వచ్చేశాను."

"అంటే ఎన్నిగంటలకి తిరిగి ఫ్యాక్టరీకి వెళ్ళారు?"

"ఎనిమిది గావచ్చింది. ఓ గంట పట్టింది."

బిందు హతాశురాలయింది. ప్రభాకర్‌కి ఎలబీ వున్నదని ఇంతసేపు తను ధైర్యంగా వుంది. సరిగ్గా 7 - 8 గంటల మధ్యనే మనోరమకి మానభంగం జరిగినట్టు డాక్టరు రిపోర్టులో వుంది. ఎనిమిది గంటలకి ఆమె స్టేషనులో రిపోర్టు చేసింది. ప్రభాకర్ ఫ్యాక్టరీ వదిలేసింది కూడా ఏడు-ఎనిమిది మధ్యనే.

అంటే కావాలనే అతనికి యెవరో ఫోన్‌చేసి, అతన్ని బయటకి రప్పించి ఎలిబీలేకుండా చేసివుండాలి. లేదా, ప్రభాకర్ తనని నమ్మించటానికి కట్టుకథ చెపుతూ వుండి వుండాలి!

బిందు దీక్షగా ప్రభాకర్ ముఖంలోకి చూసింది. అతను తన దగ్గర ఏదీ దాచలేదనే విషయం అతన్ని చూస్తేనే తెలుస్తోంది. అతను నిజంగా నిర్దోషి అని నిరూపించగల ఆధారాలేవీ లేవు. మానభంగం జరిగిన సమయంలో సాక్షులెవరూ లేకపోయినా, ఆడది చెప్పినమాట కోర్టు విశ్వసించక తప్పదు!

ఇంతలో బిందు మస్తిష్కంలో మెరుపులాంటి ఆలోచన వచ్చింది. సందేహ నివృత్తికోసం ప్రభాకర్‌ని అడిగింది. అతను చెప్పిన సమాధానం విని సంతృప్తిగా నవ్వుకుంది.

"మిస్టర్ ప్రభాకర్? మీరు, మనోరమ చదువుకునేటపుడు మీ యిద్దరిగురించి బాగా తెలిసిన స్నేహితుడెవరయినా ప్రస్తుతం అందుబాటులో వున్నాడా?"

ప్రభాకర్ రెండుక్షణాలు ఆలోచించి "ఉన్నాడు మేడం. ఇప్పుడతను పెద్దాపురంలో బ్యాంకులో పనిచేస్తున్నాడు. అతనికి నా గురించి బాగా తెలుసు. మనోరమ నాకోసం వలవేసి పరాజయం పొందిన సంగతికూడా తెలుసు" అన్నాడు.

"అయితే ఓసారి అతన్ని కలుసుకొని విషయం చెప్పండి. అవసరమయినపుడు కోర్టుకు అతన్ని తెచ్చుకో గలరా?"

"తప్పకుండా. అతను నాకు మంచి స్నేహితుడు."

6

ప్రాసిక్యూషన్ కథనం విన్నాక కేసు పూర్వాపరాలు సమీక్షిస్తూ, "ముద్దాయి తరఫున ఎవరయినా వాదించ దలచుకున్నారా?" అనడిగారు న్యాయమూర్తి.

బిందులేచి తన వకాల్తానామా సమర్పించింది.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ వో క్షణం విస్తుపోయాడు. లాయర్ బిందు ఇలాంటి కేసు టేకప్ చేసిందేమిటి? వీగి పోతోంది—అనుకున్నాడు మనసులో.

"ముందుగా మనోరమని క్రాస్ ఎగ్జామిన్ చేయటానికి అనుమతించవలసినదిగా కోర్టువారిని కోరుతున్నాను" అన్నది బిందు. న్యాయమూర్తి సమ్మతించాక మనోరమ బోనులో నిలుచుంది.

బిందు ఆమెని సమీపించి "మీ పేరు?...." అని అడిగింది.

"మనోరమ"

"మీరేం చేస్తుంటారు?"

"ఓ ప్రయివేట్ కంపెనీలో సేల్స్‌గర్ల్."

"మీకు ముద్దాయి ఎంత కాలంగా తెలుసు?"

"చాలా కాలంగా తెలుసు. అతనిది మా ఊరే. మొదటి నుంచి అతను నా పట్ల వెకిలిగా ప్రవర్తించేవాడు. ఈమధ్య ఒకటి రెండు సార్లు సినిమాహాల్సు వద్ద అసభ్యంగా ప్రవర్తించాడు. మరోసారి చేయి పట్టుకుని సేల్స్‌గర్ల్ నన్న నూన్యతా భావంతో అసహ్యంగా మాట్లాడాడు. మంచిగా చెప్పి పొమ్మన్నాను. మరోసారి అలా చేస్తే పోలీసులకి రిపోర్టివ్వాల్సి వుంటుందని దేహశుద్ధి చేస్తానని చెప్పాను. పదిమందీ పోగయ్యేసరికి చల్లగా జారుకున్నాడు."

"మీరు మానభంగం జరిగిందని చెప్పబడ్తున్న రోజు రాత్రి మిమ్మల్ని యెక్కడ కలిశాడతను?"

"ఆల్కాట్ తోటలోని కొన్ని షాపులకు సరుకు సప్లయిచేసి వంటరిగా వస్తున్నాను. రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద చీకటిలో అతను నిలుచుని వున్నాడు. నేను బ్రిడ్జి కిందికి రాగానే నన్ను ఒడిసిపట్టుకుని, నోరు నొక్కి గూడ్సు పెట్టెల పక్కకి తీసుకుపోయాడు. సమయానికి అక్కడెవరూ లేరు. నా నోటిని నా చీర కొంగుతో కట్టేసి అఘాయిత్యం చేశాడు."

"అప్పుడు సమయం ఎంతవుతుంది?"

"రాత్రి ఏడు-ఏడున్నరవుతుంది."

"ఏడు గంటలకి జనసమ్మర్దం ఎక్కువగా ఉంటుంది కదా; అరిచి అందర్నీ పిలవలేదా?"

"నా కాళ్లు చేతులు చీరతో కట్టేశాడు. నోట్లో గుడ్డ లున్నాయి. అవన్నీ విప్పుకునేలోపల పారిపోయాడు."

తర్వాత బిందు న్యాయమూర్తివంక తిరిగి "యువరానర్! ముద్దాయి తరఫున సాక్షిని ప్రవేశపెట్టడానికి అనుమతి కోర్తున్నాను" అన్నది.

న్యాయమూర్తి "ఎస్, ప్రొసీడ్" అన్నారు.



ప్రభాకర్ స్నేహితుడు సాక్షిగా బోను యెక్కాడు.

"మీ పేరు?"

"శివశంకరం."

"ముద్దాయి ప్రభాకర్ మీకు తెలుసా?"

"తెలుసు. ఒకే క్లాసులో చదువుకున్నాం."

"మనోరమ అనబడే యీమె మీకు తెలుసా?"

"మేము ముగ్గురమూ క్లాస్‌మేట్సు. ఎస్సెస్సెల్సీవరకు కలిసి చదువుకున్నాం."

"మనోరమ, ప్రభాకర్‌ల మధ్య ప్రేమాయణం ఏదయినా నడిచిందా?"

"నాకు తెలిసి ప్రభాకర్ చాలా బుద్ధిమంతుడు. అల్లరి చిల్లరగా తిరగటం నేనెరగను. అయితే మనోరమ అతన్ని ప్రేమించి, పెళ్ళి చేసుకోమని కోరింది. అతను తిరస్కరించాడు. తర్వాత ఎవరికి వాళ్ళు విడిపోయాం."

"థాంక్యూ మిస్టర్ శివశంకరం" అని, ప్రాసిక్యూటర్ వంక తిరిగి "ఎనీ క్రాస్ యెగ్జామినేషన్?" అనడిగింది

బిందు.

ఆయన తల అడ్డంగా తిప్పాడు.

బిందు న్యాయమూర్తివంక చూపి, "యువరానర్! మనోరమ, ముద్దాయి ప్రభాకర్ చిన్నపట్నుంచీ కలిసి చదువుకున్నారు. మనోరమ ప్రేమను తిరస్కరించిన నేరానికి ఆమె ప్రభాకర్ మీద పగబట్టింది. ఈ పూరొచ్చాక కూడా అనేకసార్లు ప్రభాకర్‌ని వెంటాడి తనని వుంపుడుకత్తెగానైనా సరే చేరదీయమని కోరింది. ప్రభాకర్ ఒప్పుకోలేదు. పగబట్టిన ఆడది ఎంతటి సాహసమైనా చేస్తుంది. తనకి చేతనైన పద్ధతి. తనకు మానభంగపి చేశాడని పోలీసు రిపోర్టు యిచ్చి ప్రభాకర్‌ని జైలుపాలు చెయ్యాలని వలపన్నటం! జాగ్రత్తగా ప్రభాకర్‌ని యిరికించేసింది" అన్నది.

ప్రాసిక్యూటర్ "అబ్జెక్షన్ యువరానర్" అంటూ లేచాడు.

"ముద్దాయి ఆ రాత్రి ఏడు - ఎనిమిది గంటల మధ్య ఫ్యాక్టరీ వదిలి, బయటికి వచ్చాడు. ఓ గంటలో తన పని పూర్తిచేసుకుని మళ్ళీ ఫ్యాక్టరీకి పోయాడు. మనోరమ తన బ్రతుకు నాశనం చేసిన ముద్దాయిని ఒకప్పుడు ప్రేమించానంటే, కోర్టు అపార్థం చేసుకుంటుందని ఆ విషయం కప్పిపుచ్చిన మాట వాస్తవమే! అయినంత మాత్రాన జరిగిన నేరాన్ని యెవరూ కాదనలేరు. ముద్దాయి పనిచేస్తున్న మిల్లులోని అతని సూపర్‌వైజరుని ప్రాసిక్యూషన్ తరఫున ప్రవేశపెట్టడానికి అనుమతి కోరుతున్నాను" అన్నాడు.

కోర్టు అనుమతించాక సాక్షి బోను యెక్కాడు.

"మీ పేరు?" అడిగాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

"రాఘవరావు."

"మీరేం చేస్తుంటారు?"

"పేపరు మిల్లులో కెమికల్ సెక్షన్‌లో సూపర్‌వైజరుగా వుంటున్నాను."

"ముద్దాయి ప్రభాకర్ మీకు తెలుసా?"

"తెలుసు. నావద్ద అసిస్టెంటుగా పనిచేస్తున్నాడు."

"ఇరవై మూడో తేదీ రాత్రి ఏడు - ఎనిమిది గంటల మధ్య అతను ఫ్యాక్టరీలో డ్యూటీమీద వున్నాడా?"

"సరిగ్గా ఏడుగంటలకి అతనికి యెక్కడినించో ఫోన్ వచ్చింది. అర్జంటుగా యింటికి వెళ్ళాలని, తన భార్యకి అనారోగ్యంగా వుందని చెప్పాడు. పర్మిషన్ లెటరు రాసి యిచ్చాక అతన్ని వెళ్ళటానికి అనుమతించాను."

"మళ్ళీ యెన్ని గంటలకి తిరిగి డ్యూటీకి హాజరయాడు?"

"ఎనిమిది అయి వుంటుంది. తన భార్యకి బాగానే వుందని, ఎవరో తప్పుడు సమాచారం చెప్పారని చెప్పాడు."

"ఓ.కే." అని ప్రాసిక్యూటర్ న్యాయమూర్తి వంక తిరిగి, "యువరానర్! ముద్దాయి ముందుగా పథకం వేసుకుని చేసిన నేరం యిది. తన భార్యకి అనారోగ్యంగా వుందనే సాకుతో బయటపడి, మనోరమని వెంటాడి మానభంగం చేసి, తిరిగి ఏమీ యెరగనట్టు డ్యూటీకి హాజరయిపోయాడు. డ్యూటీలో వున్నట్టు ఎలిబీ వుంటుందని ఆశించాడు" అన్నాడు.

బిందు లేచి బోను దగ్గరికి వచ్చింది.

"ఫోన్ వచ్చిన తర్వాత ప్రభాకర్ ప్రవర్తన యెలా వుందో గుర్తుచేసుకు చెప్పగలరా?" అనడిగింది రాఘవ

రావుని.

"చాలా కంగారుగా, ఆందోళనగా కనిపించాడు. అతని కంగారు చూశాక పర్మిషన్ యివ్వకుండా కాదనలేక పోయాను. అతనికి రిలీవరు లేకపోయినా అతనొచ్చేవరకు నేనే అతని డ్యూటీ చేశాను."

"తిరిగొచ్చాక అతని ప్రవర్తన యెలా వుంది?"

"చాలా ప్రశాంతంగా కనిపించాడు. ఎవరో అబద్ధపు కాల్ చేశారని, భార్యకేం ప్రమాదంలేదని చాలా రిలీఫ్‌తో చెప్పాడు."

"అతనిలో నేరస్థుడి లక్షణాలు—అంటే, మనిషి కంగారు పడటం, తడబడటం, సూటిగా ముఖంలోకి చూడ లేకపోవటం, బట్టలు నలగటం—యిలాంటివేమైనా గమ నించారా?"

"నో. చెప్పానుగా, చాలా ప్రశాంతంగా వున్నాడని: డ్యూటీలో వున్నపుడు అతను చాలా నీట్‌గా వుంటాడు. సిన్సియర్‌గా పని చేస్తాడు."

"పేపరు మిల్లుకి, ఆల్కాట్ గార్డన్స్‌కి మధ్యదూరం ఎంత వుంటుంది?"

"దాదాపు 5, 6 కిలోమీటర్లు."

"అంటే ఓ గంటలో అతను ఆల్కాట్ గార్డెన్స్‌కి వెళ్లి, ఓ అమ్మాయిని వెంటాడి, మానభంగం చేసి, తిరిగి పేపరుమిల్లు చేరుకుని డ్యూటీకి హాజరు కాగలడా?"

"కారుమీద వెళ్లివస్తే తప్ప, అంత త్వరగా వెళ్ళి ఆ పనిచేసి రావటం చాలా కష్టం."

"అబ్‌జెక్షన్ యువరానర్!" ప్రాసిక్యూటర్ లేచాడు. "ఇది ముందుగా ప్లాన్ చేసుకుని చేసిన నేరం.



ముద్దాయి ఎవరినో, తనకు యిన్ఫర్మేషన్ యివ్వటానికి పెట్టుకుని వుంటాడు. అతను—మనోరమ ఆల్కాట్ గార్డెన్స్‌లోని షాపులకి వెళ్లి తిరిగిరావటం గమనించి వెంటనే ప్రభాకర్‌కి ఫోన్‌చేసి చెప్పాడు. వెంటనే ప్రభాకర్ ఆ యింటికొచ్చి ఏ టాక్సీలోనో ఆల్కాట్ తోట చేరుకుని మనోరమని మానభంగం చేసి తిరిగి ఫ్యాక్టరీ చేరుకుని తన ఢ్యూటీకి హాజరయ్యాడు. డ్యూటీలో వుండగా తను నేరం చేసినా, తగిన ఎలిబీ వుంటుందని, డ్యూటీవున్న రోజున ఆ పనికి పూనుకున్నాడు" అన్నాడు ప్రాసిక్యూటర్.

బిందులేచి, "యువరానర్! మనోరమని వైద్యపరీక్ష చేసిన డాక్టరుగార్ని ఎగ్జామిన్ చేయటానికి అనుమతి కోరుతున్నాను" అన్నది.

కోర్టు టైం కావటంతో కేసు మర్నాటికి వాయిదా వేసినట్టు ప్రకటించారు న్యాయమూర్తి.

7

"మీ పేరు?" బిందు అడిగింది.

"వసుంధర."

"మీరేం చేస్తుంటారు?"

"గవర్నమెంటు డాక్టరుగా పనిచేస్తున్నాను."

"మనోరమకు మానభంగం జరిగిందని ఎలా నిర్ధారణ చేశారు?"

"ఆమె శరీరం అణువణువునా మానభంగం జరిగిన చిహ్నాలున్నాయి. ముఖ్యంగా ఆమె యోనిలో అప్పుడే పతనం కాబడిన పురుష వీర్యం మిగిలివుంది. అందులో పురుష బీజకణాలు—స్పెర్మ్స్—యింకా సజీవంగానే వున్నాయి."

"వీర్య పతనం జరిగిన ఎంతసేపటివరకు బీజకణాలు జీవించి వుంటాయి?"

"షుమారు యిరవైనాలుగు గంటలు బతికి వుంటాయి. కొన్ని యోని కుహరాన్ని చొచ్చుకుని గర్భకోశంలోకి చేరతాయి. ఒకసారి పతనమయిన వీర్యంలో కొన్ని లక్షల బీజకణాలుంటాయి."

"వేసెక్టమీ ఆపరేషనంటే ఏమిటి?"

ప్రాసిక్యూటర్ లేచి "అబ్జెక్షన్ యువరానర్! డిఫెన్సు లాయరు కేసుకు సంబంధంలేని అడ్డదిడ్డమైన శాస్త్రీయ ప్రశ్నలు వేస్తున్నారు. కేసుని పక్కదారి పట్టిస్తున్నారు" అన్నాడు.

బిందు వెంటనే కల్పించుకుని, "యువరానర్! కేసుకి ఆయువుపట్టులాంటి ప్రశ్న యిదే! దీనిమీదే కేసు ఆధారపడివుంది" అంది.

"అబ్జెక్షన్ ఓవర్‌రూల్డు" అన్నారు న్యాయమూర్తి.

బిందు ఆదే ప్రశ్న డాక్టరుని అడిగింది.

"వేసెక్టమీ ఆపరేషను పురుషులకు చేసే స్టెరిలైజేషన్ పద్ధతి. వృషణాలలో తయారయ్యే పురుషబీజ కణాలు వీర్యగ్రంధుల్లో తయారయ్యే వీర్యంతో కలిపి, యోనిలో సంభోగ సమయంలో పతనమవుతాయి. 'వేసెక్టమీ' ఆపరేషనుద్వారా బీజకణాల్ని మోసుకుపోయే రెండు బీజవాహికలను కత్తిరించి ముడివేస్తారు. అయితే సంభోగ సమయంలో వీర్యపతనం మామూలుగా జరుగుతుంది గాని అందులో బీజకణాలు వుండవు. తద్వారా గర్భోత్పత్తి జరగదు."

"దీన్నిబట్టి వేసెక్టమీ జరిగిన పిదప వీర్యంలో బీజకణాలు వుండవని ఖచ్చితంగా చెప్పవచ్చునంటారా?"

"అవును. సాధారణంగా ఆపరేషను తదుపరి పన్నెండు సంభోగాలవరకు వీర్యంలో బీజకణాలు కనిపించే అవకాశముంది. తర్వాత పూర్తిగా మాయమవుతాయి. నూటికో కోటికో ఒకరికి — రెండు బీజవాహికలకు బదులు మూడు వుండవచ్చు. అప్పుడు మూడో నాళము ద్వారా బీజకణాలు యోనిలో పతనమయ్యే ప్రమాదముంది. అయితే అలాంటి వ్యక్తులు చాలా అరుదు."

"మీ రిపోర్టులో మనోరమ యోనిలో పతనమయిన వీర్యంలో పురుషబీజ కణాలు వున్నాయని రికార్డు చేశారు."

"ఎస్. ఇంకా సజీవంగానే వున్నాయి కూడా."

"వేసక్టమీ అయిన వ్యక్తి మనోరమను సంభోగించి వుంటే పురుషబీజకణాలు వీర్యంలో వుండే అవకాశంలేదు కదా?"

"ముమ్మాటికీ లేదు."

"థాంక్యూ డాక్టర్!" అని బిందు న్యాయమూర్తి వంక తిరిగి, "యువరానర్! ముద్దాయి ప్రభాకర్ రెండేళ్ళ క్రితం

వేసక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాడు. ఇదిగో అతనికి ఆపరేషన్ చేసిన గవర్నమెంటు ఆస్పత్రి వారిచ్చిన స్టెరిలైజేషన్ సర్టిఫికేట్. ఇది విన్ననే గవర్నమెంటు హాస్పిటల్ సూపరింటెండెంటు—ప్రభాకర్ వీర్యాన్ని పరీక్షచేసి, అందులో బీజకణాలు-స్పెర్మ్స్-లేవని నిర్ధారణ చేసిన సర్టిఫికేట్. ఈ రెండింటిని బట్టి మనోరమని మానభంగం చేసిన వ్యక్తి ప్రభాకర్ కాదన్న విషయం తేట తెల్లమవుతోంది" అంటూ రెండు సర్టిఫికెట్లు న్యాయమూర్తికి అందజేసింది.

8

"ఈసారి కూడా విజయం మిమ్మల్నే వరించింది. నిజంగా మీ మేధాశక్తి అభినందనీయం" అన్నాడు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ లాయర్ బిందుతో. "తప్పుడు ఆరోపణలు చేసినందుకు మనోరమను కస్టడీలోకి తీసుకుని కేసు ఫైల్ చేశాము" అన్నాడు.

లాయర్ బిందు యింట్లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ప్రభాకర్ దంపతులు, వారి యిద్దరిపిల్లలు ఆసీనులై వున్నారు.

"మీ మేలు మరచిపోలేను. ఇప్పటికయినా వుడతాభక్తితో సమర్పించుకుంటున్న యీ చిన్న మొత్తాన్ని స్వీకరించండి.'' ఫీజు టేబిల్‌మీద పెట్టింది పద్మ.

అందులోనించి ఓ అయిదువందలు మాత్రం తీసుకొని తక్కిన డబ్బు పద్మకి యిచ్చేస్తూ, "నేనుపడ్డ శ్రమకి ఈ ప్రతిఫలం చాలు." అన్నది బిందు.

ప్రభాకర్ దంపతులు సెలవు తీసుకుని వెళ్ళిపోయాక, "మీరు యీ కేసులో ప్రభాకర్ దోషికాదని ఎలా అనుకోగలిగారు?" అనడిగాడు శ్రీనివాస్.

"మొదట్లో నేనూ ప్రభాకర్‌ని అనుమానించాను. ఐతే మీరు చూపించిన ఎవిడెన్స్—అదే — డాక్టరు రిపోర్టు

చూశాక నాకో ఆలోచన తట్టింది. అదే విషయం ప్రభాకర్‌ని అడిగి, అతను వేసక్టమీ చేయించుకున్నాడని తెలిశాక అతను నిర్దోషి అని గ్రహించాను."

"అయితే మనోరమలోని మానభంగ లక్షణాలు ఆమె కల్పించుకున్నవే నంటారా?"

"ఆమె ఒకతే కాదు. మరో మగాడు—బహుశా ఆమె ప్రియుడు—ఆమె పథకంలో తనూ పాలుపంచుకున్నాడు. అయితే పాపం, అతనికి వేసక్టమీ కాలేదు. అదే ప్రభాకర్‌ని కాపాడింది.

ఏది ఏమయినా ప్రస్తుత పరిస్థితిలో, ఆడవాళ్ళమీద ఎన్నో అత్యాచారాలు, మానభంగాలు జరిగి దేశంలోని స్త్రీలు ఆక్రోశిస్తున్న యీ సమయంలో—ఆడవాళ్ళపట్ల, ముఖ్యంగా మానభంగానికి బలయిన ఆడవాళ్ళపట్ల, సానుభూతి లేకుండా పోతుంది—మనోరమలాంటి చీడపురుగుల వల్ల! అయితే అందరూ మనోరమలు కాదు, కాకూడదు" అన్నది బిందు. □

పనిమంతురాలు!!

"చూడండమ్మగారూ, మీరు వచ్చేసరికి ఇల్లు ఎంత శుభ్రంగా కడిగి ఉంచానో!" అని పనిమనిషి ఎంతో సంబరంగా చెప్పింది.

"సరేగాని, ఇక్కడ కడవతో పాలు ఉండాలి. ఏవీ?" అడిగింది రాధ.

"ఆ కడవ చితికి పాలన్నీ నేలపాలైనందుకే కదండీ, ఇల్లంతా ఇంత శుభ్రంగా కడగవలసి వచ్చింది" అంది పని మనిషి.

—ఎస్. రామారావు, జె. కె. పూర్.

బార్‌లోంచి బయటకు చూశాడు శంకరనారాయణ.

గాజు అద్దాల తలుపులలోంచి మెయిన్‌రోడ్డు స్పష్టంగా కనిపిస్తోంది.

రాత్రి తొమ్మిది కావస్తోంది. జనం రద్దీ తగ్గి రోడ్డుమీద

అప్పుడప్పుడూ ఒకో వాహనం వెళుతోంది.

శంకరనారాయణ తలతిప్పి బార్‌ను కలియచూశాడు. తాగేవాళ్ళు తాగుతున్నారు. తూలుతూ లేచివెళ్ళేవాళ్ళు వెళు తున్నారు!

"ఒరేయ్!" పిలిచాడు శంకరనారాయణ.

బేరర్ పరిగెత్తుకు వచ్చాడు. శంకరనారాయణ లక్షాధి కారి. ప్రస్తుతం ఆయన కంపెనీ నష్టంలో నడుస్తోన్నప్ప టికీ ఆయన పరిస్థితులు త్వరలో బాగుపడితే తనకుద్యోగం యిస్తానని మాట యిచ్చారు.

తన టేబుల్ దగ్గర వినయంగా వొంగిన బేరర్‌ని నవ్వుతూ చూశాడు శంకరనారాయణ.

"స్కాచ్.... ఫ్రైడ్ చికెన్...." అన్నాడు శంకర నారాయణ.

బేరర్ తెల్లబోయి ఆయన ముందున్న టేబులు వైపు చూశాడు. టేబుల్‌మీద ఒకస్కాచ్ పీసా ఖాళీ అయివుంది. అరసీసా ఏకబిగిన తాగ గలిగిన మొనగాడిని మాత్రమే తాను ఇంతవరకూ చూడగలిగాడు.

శంకరనారాయణ అతడిఆశ్చర్యాన్నిచూచి లోపల్లోపల నవ్వుకున్నాడు. టేబులుకి క్రింది భాగంలో డ్రయినేజ్ కాలువ వెళ్ళడం తనకు బాగా వుపకరించింది.

బేరర్ వెళ్ళిపోయాడు.

శంకరనారాయణ తూలుతోన్నట్టు నటించుతూ లేచాడు. తాను త్రాగిన ఒక పెగ్గుకే తాను యింత బాగా నటించ గలగడం తనకే ఆశ్చర్యంగా వుంది.

వాష్ బేషిన్‌వైపు నడిచాడు. కొళాయి విప్పాడు. నీరు డ్రైనేజిలో ప్రవహించసాగింది. అంతసేపూ స్కాచ్ విస్కీ వాసన వచ్చిన డ్రైనేజిలో ప్రస్తుతం ఆ వాసన

లేదు. శంకరనారాయణ తన కుర్చీలో మెల్లగా కూల బడ్డాడు.

ట్రే తెచ్చి సర్వ్‌చేసి బేరర్ వెళ్ళిపోయాడు.

శంకరనారాయణ తాగడం మొదలుపెట్టాడు. మధ్య మధ్య చికెన్ తినసాగాడు. వాచీ చూసుకున్నాడు.

పదిన్నరయింది. మరో అరగంటలోగానీ వాడు పేవ్ మెంట్ మీద పడుకోవడానికి రాడు. వాడి పేరు యేమిటో తనకి తెలియదు. తాను సంఘంలో లక్షాధికారి అయితే వాడు భిక్షాధికారి. తనకి సంఘంలో బాగా పలుకుబడి ఉంది. వాడు అసలు జనాభా లెక్కల్లో వుండి వుండడు.

అయితే యేం? వాడు తనకి కొత్త ఆశ!

శంకరనారాయణకి వెన్ను ఝల్లుమన్నది.

అంతా సవ్యంగా జరుగుతుందా? తాను యీ రాత్రికి చచ్చిపోతాడా?

రేపట్నించీ ప్రపంచానికి లక్షాధికారి శంకరనారాయణ బతికి వుండడా? జనాభా లెక్కల్లోంచి తను పేరు తీసే స్తారా?

శంకరనారాయణ చుట్టూ చూచి చటుక్కున మూడు వంతులకి పైగా నిండివున్న స్కాచ్ విస్కీ సీసాను డ్రైనేజిలోకి వొంపాడు. కొళాయి త్రిప్పాడు. తూలుతూ టేబుల్స్ మధ్యనుండి నడుస్తూ కౌంటర్ ముందు నిల బడ్డాడు. జేబులోంచి మూడు వందరూపాయల కాగితాలు కౌంటర్ ముందు పెట్టి టేబులుమీద తల వాల్చాడు.

బేరర్ పరుగెత్తుకు వచ్చాడు.

"బాబుగారూ" అన్నాడు బేరర్.

కౌంటర్‌లోని వ్యక్తి శంకరనారాయణవైపూ బేరర్ వైపూ మార్చి మార్చి చూశాడు.

బేరర్ తన చేతిలో సిద్ధంగా వుంచుకున్న బిల్లును టేబుల్‌మీద పెట్టాడు. కౌంటర్‌లో వ్యక్తి మూడు వంద రూపాయల కాగితాలు డ్రాయర్‌లోకి విసరి పదిరూపాయల కాగితం శంకరనారాయణ చేతిలో పెట్టాడు. శంకరనారాయణ చేయి చాపి ప్రక్కగా వున్న బిల్లును కూడా గుప్పిటతో పట్టాడు.

"సార్! మాకు బిల్లు వుంచాలి సార్!" బేరర్ అన్నాడు.

బేరర్ కోటు జేబులో పది కాగితం పెట్టి తూలిపోతూ బయటికి నడిచాడు శంకరనారాయణ.

పోర్టికోలో మెర్క్యురీ లైట్లు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. ఆ వెలుగులో ప్రెసిడెంటు కారు నల్లగా తళతళలాడుతోంది.

శంకరనారాయణ ఓరకంట బార్‌కేసి చూశాడు. బార్‌లోంచి తనని యెవరూ పరిశీలించడంలేదు. అయినప్పటికీ శంకరనారాయణ నటన మానలేదు. జేబులోంచి తాళం చెవులు తీసి కారులో డ్రైవింగ్ సీటు ముందు కూర్చున్నాడు.

చిన్న జర్క్‌తో కారు బయలుదేరింది. మెయిన్ గేటు వరకూ మెలికలు తిరుగుతూ రోడ్డెక్కింది కారు.

రోడ్డు నిర్మానుష్యంగా వుంది.

కారు మార్కెట్ స్క్వేర్ దగ్గర మలుపు తిరిగింది. రోడ్డుకి అటూ యిటూ వుండే షాపులు మూశారు. అక్కడక్కడా కుక్కలు మొరుగుతున్నాయి. రోడ్డుమీద ఒక ప్రక్కగా కారు ఆపాడు శంకరనారాయణ. కారుతోపాటు హెడ్‌లైట్లు ఆరిపోయాయి.

శంకరనారాయణ పేవ్‌మెంట్ మీదకు దృష్టి సారిం

చాడు.

వాడు అప్పుడే వచ్చినట్టున్నాడు. జోలిలోంచి యేదో తీశాడు. తన జోలి ఎవరికీ లేదన్నట్టు తీసుకున్నదాన్ని తిన సాగాడు.

శంకరనారాయణ చేతులు చలిజ్వరం వచ్చినట్టుగా వణుకుతున్నాయి. స్టీరింగ్‌వీల్ మీద నుండి చేతులు తీసి వొక్కసారిగా వేళ్లు విరుచుకున్నాడు. ఒంట్లో ఎముకలు పటపటలాడాయి. కొద్దిగా వొణుకు తగ్గింది.

డోర్ తెరచుకుని దిగి రోడ్డుమీద నిలబడ్డాడు. చప్పుడు కాకుండా డోర్ మూశాడు. దీపాల కీనీడలోంచి అతడివైపు మెల్లగా నడిచాడు.

బిచ్చగాడు తన మానాన తాను తినసాగాడు.

"ఒరేయ్!" పిలిచాడు శంకరనారాయణ.

అతడు ఉదాసీనంగా చూశాడు.

"రైల్వేస్టేషను వరకూ కారులో వస్తావా? డిక్కీలో సామాను వుంది. బండికి ఎత్తాలి."

"ఇప్పుడా! నావల్ల కాదు!" అన్నాడతడు.

శంకరనారాయణకి మండుకుపోయింది. తనలాంటి లక్షాధికారికి అంత నిర్లక్ష్యంగా సమాధానం చెబుతాడా?

"అ(: రహస్యమైన వస్తువు! అందుకే...." అన్నాడు శంకరనారాయణ.

"ఏమాత్రం?"

"పాతికరూపాయ లిస్తాను."

వాడి ముఖంలో ఆశ్చర్యం కొట్టొచ్చినట్లుగా కన బడింది.

తింటోన్న పదార్థాన్ని నేలకేసి కొట్టాడు బిచ్చగాడు. హుషారుగా లేచాడు.



శంకరనారాయణ కారువైపు నడిచి డోర్ తీసి కూర్చున్నాడు. చెయ్యి చాపి డోర్ తెరచి వుంచాడు. బిచ్చగాడు కారు ఎక్కి కూర్చున్నాడు.

కారు కదిలింది. హార్బర్ రోడ్డు వైపు పరుగులు తీసింది.

శంకరనారాయణ మనసు క్షణకాలం మూగగా రోదించింది.

పాపం! వీడికి తీరా చూస్తే ఇరవై సంవత్సరాలుంటాయేమో! తన వయసు నలభై. వీడు చేసుకున్న పాపమల్లా తన వాడ్డూ పొడుగుతో సరిపోయే శరీరం కలిగి వుండటమే!

"చలి వేస్తోందా?...." అడిగాడు శంకరనారాయణ.

బిచ్చగాడు తలూపాడు.

శంకరనారాయణ తన జేబులోంచి క్వార్టర్ బాటిల్ విస్కీ-సీసా తీసియిచ్చి "చప్పరించు. చలి యిక నీ దగ్గరకి

రాదు!" అన్నాడు.

బిచ్చగాడు సందేహిస్తూనే సీసా అందుకొని గటగటా సగం ఖాళీచేసాడు. అంతే క్షణాల్లో సీటుకు జారగిలబడి నిద్రపోసాగాడు.

శంకరనారాయణ కారు ఆపాడు. సీసా తీసి జేబులో వేసుకున్నాడు. అతడి చొక్కా జాగ్రత్తగా విప్పి సీటుమీద పెట్టేడు. అతడిని సీటుమీద పడుకోబెట్టి నిక్కరుతీశాడు. చకచక తన దుస్తులువిప్పి అతడికి తొడిగాడు. అతడి దుస్తులను పాక్‌చేసి, డోరుతెరచి డిక్కీవేపు నడిచాడు.

డిక్కీలోంచి వేరే బట్టలు తీశాడు. చకచక పంచకట్టుకొని బిళ్ళగోచీ పెట్టుకున్నాడు. మోచేతులు దాటినచొక్కా తొడుక్కున్నాడు. తలపాగా చుట్టుకున్నాడు.

తన సూట్‌లో సీటుమీద మత్తుగా నిద్రపోతోన్న యువకుడిని క్షణకాలం చూశాడు. కళ్లు దగ్గరగాపెట్టి ఫ్యూయల్ ఇండికేటర్‌ను చూశాడు. తృప్తిగా తల ఆడించాడు.

నిద్రపోతోన్న యువ బిచ్చగాడిని బలవంతంగా డ్రయివింగ్ సీటుమీద కూర్చోబెట్టి అతడి చేతులు స్టీరింగ్ వీల్ మీద పెట్టాడు.

యువకుడి ముక్కుదగ్గర వ్రేలుపెట్టి చూశాడు శంకరనారాయణ. చాల బలహీనంగా వూపిరి పీల్చుతున్నాడు. మరో రెండు నిమిషాల్లో ఆ పాటి వూపిరికూడా అతడికి వుండదు. పాక్‌చేసిన అతడి బట్టలను రోడ్డు ప్రక్కగా నిరంతరం పారే మురికి కాలవలోకి విసిరేశాడు.

యువకుడు స్టీరింగ్ వీల్‌మీదకు తల వాల్చాడు. శంకరనారాయణ రోడ్డుమీద నిలబడే చెయ్యిచాపి ఇగ్నిషన్ కీ తిప్పాడు. రెండోప్రక్కనుండి కారు యెక్కి కారు స్టార్ట్

చేశాడు. స్టీరింగ్ వీల్‌ను అతి కష్టంమీద త్రిప్పుతూ కారును పోనిచ్చాడు.

రోడ్డు రెండుగా చీలి వుంది. ఆ చీలికకి అడ్డంగా కారు పరుగెత్తుతోంది.

ఎదుట రైల్వే లూప్‌లైన్. ఆ లైన్‌మీద ఏనాటిదో గూడ్స్ వాగన్‌లు నిలబడివున్నాయి. కారు నిలకడగా వెళ్తోంది. స్టీరింగ్‌వీల్ మీద అతడి శరీరం బరువు కారు నిలకడగా వెళ్లడానికి సహకరిస్తోంది.

శంకరనారాయణ డోర్ తెరిచి పచ్చికమీద దూకాడు. మోచేతులూ మోకాళ్ళూ కొట్టుకుపోయాయి. అయినప్పటికీ నారాయణ దృష్టి గతుకులను అధిగమించుకుంటూ పరుగెత్తుతోన్న కారుమీద వుంది.

కారు వేగంగా పరుగెత్తుకువెళ్ళి బలంగా వేగన్లను ఢీ కొట్టింది. అంత బ్రహ్మాండమైన శబ్దం వినవలసి వస్తుందని తాను వూహించలేదు. ధ్వని తరంగాలు పూర్తిగా అంతరించాక శంకరనారాయణ తలతిప్పి చుట్టూ చూశాడు.

చుట్టూ ఎప్పట్లా నిర్మానుష్యం!

కారు చుట్టూ గాల్లో పెట్రోలు వాసన!

శంకరనారాయణ రెండు నిమిషాలపాటు ఎదురు చూశాడు. కారు ఎంతకీ అంటుకొని మండలేదు.

'ఛీ!' విసుక్కున్నాడు.

కారు డేష్ యివ్వగానే మండిపోయినట్టు తెలుగు సినిమాలో కాబోలు తాను చూశాడు. అతుకులు బొంతల సినిమాలు!

శంకరనారాయణ కుంటుతూ లేచాడు. కారును సమీపించాడు. డిక్కీ తెరిచి పెట్రోలు డబ్బాతీశాడు. డిక్కీ మూసి డబ్బాతో ముందుకి వెళ్ళి పెట్రోలును డ్రయివింగ్ సీట్లో

చల్లాడు. ఖాళీ డబ్బాను డిక్కీలో పెట్టి తాళం వేశాడు.

తన చేతులకి వున్న గ్లవ్స్‌ను తృప్తిగా చూసుకుని కారుకి దూరంగా జరిగి జేబులోంచి అగ్గిపెట్టె తీశాడు. అగ్గిపుల్ల తీసి వెలిగించి సూటిగా కారులోకి విసిరి వెనక్కి పారిపోయాడు.

రెండు క్షణాల్లో కారు జ్వాలలమధ్య తగలబడిపో సాగింది.

శంకర్‌నారాయణ అటుప్రక్కకి చూడకుండా చెలు గులో తల వొంచుకుని కాన్వెంట్ జంక్షన్‌వైపు నడవ సాగాడు.

2

"అరె! డిటెక్టివ్ శిరీష్! నువ్వా? శంకరనారాయణ అనే వర్తక ప్రముఖుడు యాక్సిడెంటులో మరణించినట్టు నీకు సార్జెంట్ ద్వారా కబురు పంపాలనుకుంటున్నాను. ఈ యాక్సిడెంట్ వార్త నాకూ నీకూ ఒకేసారి అందడం ఆశ్చర్యం!" అన్నాడు క్రైంబ్రాంచ్ ఇన్స్‌పెక్టర్.

డిటెక్టివ్ శిరీష్ సమాధానంగా నవ్వి, అతడితోబాటు పచ్చికలో నడుస్తూ రైల్వే లూప్‌లైన్‌కి ఇవతలగా ఆగాడు.

ఉదయిస్తోన్న సూర్యకాంతి రైల్వే వ్యాగన్‌మీదా, బొగ్గులాగా మాడిపోయిన ప్రెసిడెంటు కారుమీద పడి పేల వంగా మెరుస్తోంది.

కారు డోర్స్ మాడి వంకరలు తిరిగాయి. స్టీరింగ్ వీల్ మీద రాక్షసి బొగ్గులాగా మాడిపోయిన శవం భయంకరంగా వుంది.

శవం వొంటిమీద అక్కడక్కడ దుస్తులు మిగిలి పోయాయి. మొహం పూర్తిగా మాడిపోయి వుంది. గొంతు, ఛాతీభాగం చాటునవుండి కాలోలు బట్టల పేలికల

మాటున అంత నల్లగా మాడిపోలేదు.

డిటెక్టివ్ శిరీష్ కారును చుట్టి వ్యాగన్ అవతలకు వెళ్ళి తిరిగివచ్చాడు. అప్పటికి శవానికీ, కారుకీ ఫోటోలు తీయ సాగాడు ఫోటోగ్రాఫర్.

"ఈ యాక్సిడెంటును మొదట చూచిందెవరు?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

"దారిన పోయేవాళ్ళు ఎవరో చూచి వుండాలి. పోలీస్ స్టేషన్‌కి ఆకాశరామన్న ఫోన్‌వచ్చింది" అంటూ ఇన్స్పెక్టర్ కుమార్ ముక్కుకు జేబురుమాలు అడ్డంపెట్టుకుంటూ కారులోకి ఒంగాడు.

కారులో సీట్లు కాలిపోయి వున్నాయి. డాష్‌బోర్డు పగిలిపోయి గాజుపెంకులూ, కరగిన లోహపు ముక్కలూ అడ్డదిడ్డంగా లోపలపడి వున్నాయి. కారు వెనక సీట్లు కూడా తగలబడివున్నాయి.

కుమార్ తన సిబ్బందికి చకచక సూచనలివ్వసాగాడు.

శవాన్ని వెలుపలకు తీసి పడుకోబెట్టారు.

"పోస్టుమార్టంతో పనిలేదు!" అన్నాడు కుమార్ పూర్తిగా కాలిపోయిన శవం కాళ్ళనూ, గుర్తుపట్టలేని విధంగా పాడయిపోయిన మొహాన్ని చూస్తూ.

"అయినా తప్పదుకదా! ఇన్సూరెన్స్ కార్పొరేషన్ వాళ్ళు వూరుకోరు కదా!" అన్నాడు డిటెక్టివ్ శిరీష్.

ఇన్స్పెక్టర్ కుమార్ చురుకుగా చూశాడు.

"అంటే.... నువ్వు...."

"అవును. శంకరనారాయణ నెలరోజులక్రితం అయిదు లక్షల రూపాయిలకు భీమా పాలసీ తీసుకున్నాడు! కార్పొరేషన్ వాళ్ళకి అతడి చావు అనుమానాస్పదంగా వుండటం

సహజం! నాకు కేసు ఒప్పగించారు"

"వాళ్ళకీ విషయం ఎలా తెలుసు?"

"వివరంగా చెబుతాను. ముందు శవాన్ని పోస్ట్ మార్టంకి పంపి మీ ఆఫీసుకి వెళ్ళి కూర్చుందాం!"

అంబులెన్స్ వైపు చూపించి కుమార్ తన సిబ్బందికి ఆదేశాలు యివ్వసాగాడు.

3

"రాత్రి శంకరనారాయణ బార్‌లో పూటుగా తాగాడు. రెండు స్కాచ్ విస్కీ బాటిల్సు తాగాడట! ..." శిరీష్ మధ్యలో ఆగాడు.

"నాన్సెన్స్ ... రెండు బాటిల్సు తాగగలిగి వుంటే అక్కడే చచ్చిపోయి వుండేవాడు...." జోక్యం చేసుకున్నాడు కుమార్.

శిరీష్ తలూపి, "సాక్షి కథనాన్ని మొదట సహనంతో వినడం నేర్చుకో....తరువాత తర్కం లాగు! తాగినవాడు తూలిపోతూ కౌంటర్‌లో స్వయంగా బిల్లుచెల్లించి కారు డ్రైయివ్ చేసుకుంటూ వెళ్ళిపోయాడట! మెయిన్ రోడ్ వరకూ కారు మెలికలు తిరుగుతూ వెళ్ళిందట!" అన్నాడు.

"సాక్షి ఎవరు?"

"శంకరనారాయణకి పాలసీ యిచ్చిన సూర్యారావు. అతడూ రాత్రి బార్‌లో కూర్చున్నాడట! అప్పటికే శంకరనారాయణ రెండో స్కాచ్‌కి ఆర్డరివ్వడం విన్నాడట సూర్యారావు. తన వృత్తి రీత్యా సహజంగానే కీడు శంకించాడు. శంకరనారాయణతోబాటు తనూ అతడి కారులో బయలుదేరాలనుకున్నాడట. అయితే అతడు కంపెనీ ఇస్తోన్న మరో పాలసీదారుడు సూర్యారావును లేవనీయలేదట.



పన్నెండు గంటలకు ఉండబట్టలేక శంకరనారాయణ ఇంటికి వెళ్ళవలసిన దారిలో బయలుదేరాడట సూర్యారావు. హార్బర్ రోడ్డు రెండుగా చీలినచోట పెద్ద జ్వాల కనిపించి అటు నడిపించి టాక్సీ దిగాడు. ప్రెసిడెంటు కారు తగలబడి పోతూ కనిపించిందట। స్టీరింగ్ వీల్ దగ్గర శంకర నారాయణ। అంతే సూర్యారావుకి నిషా దిగిపోయిందట. డివిజనల్ మేనేజర్‌కి ఫోన్ చేశాడట।

"అతడు ఆత్మహత్య చేసుకున్నాడేమో నిరూపించ డానికి నిన్ను నియమించారు కదా।"

"అవును. కావాలని యాక్సిడెంట్‌గా సృష్టించి ఆత్మ హత్య చేసుకున్నాడేమోనని శంకరనారాయణ మీద డివిజనల్ మేనేజర్ సందేహపడ్డాడు. పైగా నెలక్రితమే అయిదు లక్షలకు పాలసీ తీసుకున్నాడు శంకరనారాయణ."

"నీ పరిశోధన ఎక్కడినుండి మొదలుపెడతావు?"

"ఏం?"

"శంకరనారాయణ యాక్సిడెంట్‌లో మరణించినట్టు రాసి కేసు మూసెయ్యాలనుకుంటున్నాను. నీ అనుమానాలకు తగిన ఆధారాలు చెప్పినట్టయితే కేసును పరిశోధనలో వుంచినట్టు రాసుకుంటాను."

డిటెక్టివ్ శిరీష్ పకపకనవ్వాడు.

"ఎందుకు నవ్వుతావు?"

"యాక్సిడెంటేనని ఎలా నిర్ధారణకి రాగలిగావు?"

"శంకరనారాయణ ఎత్తు 5|-8||. శవం యెత్తుకూడా సరిగ్గా అంతే! శంకరనారాయణ నిలువు సైజు ఫోటోతో శవం ఒడ్డూపొడుగూ సరిపోయాయి. శంకరనారాయణ శవాన్ని అతడి భార్య కాంతామణి చాల సులువుగా గుర్తుపట్ట కలిగింది!"

"రైట్....చెప్పు...."

"తాగితాగి దారితప్పి యాక్సిడెంట్‌లో ప్రాణాలు కోల్పోయాడు శంకరనారాయణ."

"బార్‌నుండి అతడి కారు ప్రయాణించిన మార్గాన్ని ఒకసారి గుర్తుకు తెచ్చుకో! మార్కెట్ స్క్వేర్‌లాంటి రద్దీ ప్రాంతంలోంచి డ్రయివ్ చేసుకురాగలిగాడు కారును. నిర్జనంగా వున్నచోట యాక్సిడెంటయింది."

"అంటే...."

"ఏం లేదు! శంకరనారాయణ చచ్చిపోయి వుండడనటానికి కారణాలు వెతుకుతూ ఆలోచిస్తూన్నాను. అతడి కారు ప్రయాణించే మార్గంలో యెన్నో పోలీస్ బీట్‌లూ, ఐలండ్‌లూ వున్నాయి. ఫూటుగా తాగిన శంకరనారాయణ వాటన్నింటినీ నైపుణ్యంగా తప్పించుకున్నాడు. హార్బర్ రోడ్డులో లూప్‌లైన్‌కి కారు మళ్ళించాడు. అంటే ఇంటి దిశగా తిన్నగాపోయే కారు కాస్త దారి మళ్ళింది. యాక్సి

డెంటయింది. అంత నిర్జనంగా వున్నచోట యాక్సిడెంటు కావడమే నాకు అంతగా కొరుకుడుపడటంలేదు."

"అసలు యెక్కడ యెలా జరుగుతుందో తెలియరానిదే యాక్సిడెంట్. అంటే....!"

"మార్చ్యురీకి వెళ్దాం పద. దగ్గరుండి పోస్ట్‌మార్టం రిపోర్ట్ తీసుకుందాం!"

"ఆల్‌రైట్! పద!"

ఇద్దరూ లేచారు.

ఇద్దరినీ యెక్కించుకుని డాట్సన్ కారు ముందుకు వురికింది.

4

బుసలుకొడుతూ పాసింజర్ రైలు మంచిలి స్టేషన్‌లో ఆగింది.

రెండో తరగతి కంపార్టుమెంటులోంచి శంకర నారాయణ ప్లాట్‌ఫాం మీదకు దిగాడు.

చేతనున్న సూట్‌కేసును మోసుకుంటూ స్టేషన్ ప్రాంగణంలోంచి బయటపడి తారురోడ్డుమీద నడవసాగాడు. రోడ్డుకి అటూ యిటూ వున్న పంటపొలాల్లోంచి చల్లటి పైరుగాలి ఒంటికి హాయిగా తగులుతోంది.

శంకరనారాయణ గర్వంగా పొలాల్లోంచి దిగంతరేఖ కేసి చూశాడు.

ప్రపంచం విశాలమైనది. తాను ఇక్కడ పునర్జన్మ యెత్తుతాడు. ఈ విశాల ప్రపంచంలో తన ఉనికి యెవరికి తెలుస్తుంది? రోడ్డు దిగి ప్రక్క వీధిలోకి మళ్లాడు. చిన్న సైజు డాబా ముందు ఆగాడు. ఆ ఇంటిముందు గోడకి నేమ్‌ప్లేట్ చూశాడు.

"ఎన్. రాజయ్య, రిటైర్డు పంచాయతీ ఆఫీసర్" అని

వుంది.

శంకరనారాయణ మెల్లగా నవ్వుకున్నాడు.

తాను ఈ నాటినుండీ ఈ కుగ్రామంలో రాజయ్యగా చలామణీ కావాలి. వలభై సంవత్సరాలకే తాను రిటైరు అయాడు. అయిదు లక్షల రూపాయలతో ఈ కుగ్రామంలో ఏమయినా సాధించవచ్చును. లక్షకి పది యెకరాలు—సార వంతమైన నేల కొనుక్కోవచ్చును. చితికిపోయిన తన వ్యాపారానికి తాను ప్లాన్ వేసి స్వస్తి చెప్పగలిగాడు. లేక పోతే తన కంపెనీ యెత్తివేసి ఇంకో ఏడు లక్షల రూపాయలు అప్పు తీర్చాల్సివచ్చేది.

తన భార్య కాంతామణి పాలసీ డబ్బుతో వచ్చేవరకూ తాను యిక్కడ గుట్టుగా బతకాలి. నెలక్రితమే ముందు చూపుతో ఈ యింటిని కొనగలిగాడు తాను.

గేటు తీసి లోపలికి నడిచాడు శంకరనారాయణ.

తాళం తెరచి ఇంట్లో అడుగుపెట్టాడు.

చకచక స్నానం ముగించి దుస్తులు మార్చుకుని, ఇంటికి తాళంపెట్టి రోడ్డు యెక్కాడు. పోస్టాఫీస్‌వైపు నడిచాడు.

బ్రాంచ్ పోస్టుమాస్టర్ శంకరనారాయణవైపు ఏం కావాలన్నట్టు చూశాడు.

"ట్రంక్ కాల్ .... వైజాగ్...." అన్నాడు శంకర నారాయణ.

అరగంటలో లైన్ దొరికింది. బూత్‌లోదూరి తలుపు వేసుకున్నాడు.

అవతల భార్య గొంతు వినగానే శంకరనారాయణలో ఉత్సాహం పెల్లుబికింది.

"కాంతా! ఏమిటి విశేషం?" అడిగాడు శంకర నారాయణ.

"హమ్మయ్య! క్షేమంగా చేరారుకదా! ఇక్కడ ఏడుపు నటించలేక చస్తున్నాను. పరామర్శించడానికి ఇన్నివందల మంది వస్తారా యెక్కడయినా? వాళ్ళకి నచ్చచెబుతోంటే మీరు నిజంగానే...." నాలిక్కరచుకుంది కాంతామణి.

"కాంతా! కంగ్రాట్స్! నీమీదే వ్యవహారం అంతా ఆధారపడి వుంది. ఏమాత్రం అనుమానం రాకూడదు సుమా!"

"అలాగే....కానీ! మన యింటి దగ్గర పోలీసు కాపలా వున్నాడండి. అతడి విషయం నాకు భయంగా వుంది."

"ఎందుకు? కాపలా దేనికి వున్నాడో తెలుసుకో!"

"అలాగే...."

"లైఫ్ ఇన్సూరెన్సు ఆఫీసుకి అయిదారు రోజులలో వెళ్ళి డబ్బు తెచ్చుకో...."

"అలాగేనండి!"

"ఏమీ భయపడకు."

"మీరు నాకు అస్తమానం ఫోన్ చేయకండి. అనుమానం తగిలితే ఫోన్ని టాప్ చేస్తారు! ఏమైనా విశేషాలుంటే నేనే కవర్ రాస్తాను. రాజయ్యపేర."

"వెరీగుడ్!"

"ఇక్కడ స్థానిక దినపత్రికలో లక్షాధికారి శంకర నారాయణ ఘోర ప్రమాదంలో మరణించినట్టు వార్త వచ్చింది."

"పాపం! అంతేకదా!"

"ఫోన్ పెట్టేస్తాను. మన యింటిముందు యెవరిదో కారు ఆగింది. క్రైమ్బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కుమార్ గాక సూటువేసుకున్న వ్యక్తి యెవరో వున్నాడు కారులో...."

"జాగ్రత్త!"

అవతల ఫోన్ పెట్టేసినట్టు క్లిక్‌మన్నది.

5

మార్చ్యురీ థియేటర్‌లో ఆఫీసు గదిలో కూర్చొంది వున్నాడు పాథాలజీ సర్జన్. అతడి కెదురుగా డిటెక్టివ్ శిరీష్, క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కుమార్ తమ కుర్చీల్లో కూర్చున్నారు. డిటెక్టివ్ శిరీష్ చేతిలో శంకరనారాయణ శవం తాలూకు ఫోటోలున్నాయి.

పాథాలజీ సర్జన్ పొడిదగ్గు దగ్గి, "శవం శంకర నారాయణదే నని నేను నిర్ధారించగలను. నాకు అతడితో మరీ సన్నిహితం గాకపోయినా ఒక మాదిరి పరిచయం వుంది" అన్నాడు.

"శవం మీద గుర్తుపట్టవలసిన పుట్టుమచ్చలు వగైరా" అడిగాడు శిరీష్.

"శరీరం బొగ్గు అయిపోయిందికదా!"

"గొంతుభాగం, జీర్ణకోశం మంటలనుండి కొద్దిగా తప్పించుకున్నాయి. ఆ విషయం మీ రిపోర్ట్‌లో వుంది."

"కాదనను. కాని అక్కడ గుర్తుపట్టవలసిన మచ్చ లుండాలికదా!"

"యూ ఆర్ కరెక్ట్! ఎల్.ఐ.సి. వారి మెడికల్ రిపోర్ట్‌లో ఆ రెండు భాగాల్లోనూ గుర్తుపట్టవలసిన మచ్చలున్నట్టు లేదు."

సర్జన్ గర్వంగా చూశాడు.

"జీర్ణకోశంలో పదార్థం గురించి చెబుతారా?" అడిగాడు శిరీష్.

"జీర్ణకోశంలో మరణానికి ముందుగా వున్న అన్నం మెతుకులు సిట్రిక్ యాసిడ్—ఐమీన్ చింతపండు, రసం,

కొద్దిగా విస్కీ కలిపి జీర్ణంకాని స్థితిలో వుంది కంటెంట్?"

శిరీష్, కుమార్ మొహాలు చూసుకున్నారు.

"అన్నం మెతుకులా?" అడిగాడు కుమార్ నిర్ఘాంత పోయి.

సర్జన్ తలూపాడు.

"హతుడు రాత్రి రెండు సీసాలు స్కాచ్ విస్కీ త్రాగాడు" అరిచాడు కుమార్.

"శరీరంలో ఆల్కహాలు యెక్కువగా లేదు."

"ఊపిరి తిత్తులలో పరిస్థితి యెలా వుంది?" అడిగాడు శిరీష్.

"ఏముంది? ఫ్రెష్‌గా వున్నాయి."

"ఫ్రెష్‌గానా?"

"ఏం?"

"డియర్ సర్! ఒక్కసారి ఆలోచించండి. శరీరం తగలబడిపోయినందున ప్రాణాలు కోల్పోయినట్టు రిపోర్టులో రాశారు. అటువంటప్పుడు శ్వాసనాళంలోనూ, ఊపిరితిత్తుల లోనూ కార్బన్ అణువులు పెద్ద మొత్తంలో వుండి

వుండాలి."

సర్జన్ అయోమయంగా చూశాడు.

"యూ మేబీ కరెక్ట్!" అన్నాడు సర్జన్.

"శ్వాసనాళం, ఊపిరి తిత్తులను మరొక్కసారి తణిఖీ చేద్దాం పదండి" లేచాడు కుమార్.

6

"ఎస్. సార్! నేనే సార్! రాత్రి శంకరనారాయణ గారికి సర్వ్‌చేసింది నేనేసార్!" బేరర్ గడగడలాడు తున్నాడు, ఇన్‌స్పెక్టర్ కుమార్ యెర్రబడిన కళ్ళనుచూచి.

"చెప్పు....నీకు తెలిపిందంతా చెప్పు!" అన్నాడు కుమార్.

కుమార్ శరీరం కోపంతో వణుకుతోండటం గమనించాడు శిరీష్.

"ఇదిగో సార్! ఈ టేబులు దగ్గరే కూర్చున్నారు శంకరనారాయణగారు. సాయంకాలం 7 గంటల నుండి 10 గంటలవరకూ కూర్చుండి ఒక స్కాచ్ విస్కీ బాటిలు త్రాగేశారు. 10 గంటలకు నన్ను మరో బాటిలూ, ఫ్రైడ్ చికెనూ తెచ్చిపెట్టమన్నారు. గంట లోపులో త్రాగి తిని కౌంటర్‌లో బిల్లు చెల్లించారు సార్!"

శిరీష్ టేబులు కిందకు వొంగాడు. డ్రయినేజీ కాలువ లోంచి రకరకాల వాసనలు వస్తువ్నాయి. గచ్చు అంతటినీ ఫినాయిలుతో కడిగిన వాసన!

శిరీష్ తల పంకించి లేచాడు.

కుమార్, శిరీష్‌వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"శంకరనారాయణ కేవలం తప్ప తాగినట్టు సాక్ష్యం కోసం రెండు బాటిల్సు ఆర్డరిచ్చాడు. విస్కీని డ్రైనేజ్ లోకి పారబోసి వుంటాడు. అనుకూలంగా వుండటానికే

యీ సీటులో కూర్చున్నాడు. యిది కేవలం నా ఊహ!"

కుమార్ తాలూపాడు. బేరర్‌ని చూశాడు.

"అతడు చికెన్ తినడం చూశావా?"

"చూశాను సార్! ఆకలిమీద వున్నట్టు ఆవురావురు మని తిన్నారు."

7

"భర్త పోయిన విచారంలో వున్న మిమ్మల్ని మరీ బాధ పెట్టవలసి వస్తోంది. మాతో సహకరిస్తారని కోరుతున్నాను" అన్నాడు డిటెక్టివ్ శిరీష్.

కాంతామణి మొహంమీద పడిన జుత్తును ప్రక్కకి తొలగించి చూచింది. ఏడవడంవలన కాబోలు ఆమె కళ్ళు యెర్రబడి వున్నాయి. బుగ్గలమీద కన్నీటి చారికలు!

"మీ భర్తకు వయసు ఎంత వుంటుంది?" అడిగాడు శిరీష్.

"నలభై."

"బాగా త్రాగే అలవాటుందా?"

"ఉంది కాబోలు....ఇంట్లో ఎన్నడూ తాగలేదు."

"ప్రెసిడెంటు కారు మీవారిదేనా?"

"అవును."

"మీవారికి కంపెనీ వుందట. అదేమిటో దయచేసి చెబుతారా?"

కాంతామణి చెప్పింది. శిరీష్ నోట్ చేసుకున్నాడు.

"కంపెనీ ప్రస్తుతం నష్టంలో నడుస్తోన్నట్టు విన్నాను. నిజమా?"

"అబద్ధం! లాభాలు బాగానే వస్తోన్నట్టు ఆయన చెప్పారు."

శిరీష్‌కి ఆమె మొహంలో వ్యక్తమయిన కోపరేఖ కని

పించింది. శంకరనారాయణ కంపెనీ నిజంగానే నష్టంమీద నడుస్తోంది. లక్షల రూపాయలు నష్టం పూడ్చలేక శంకర నారాయణ తాగుడును అలవాటు చేసుకున్నట్టు అతడి కంపెనీలో పనిచేసే ఉద్యోగులు చెప్పారు.

"మీ వారు జీవితభీమా చేయించి వుంటారా?"

"ఆ విషయం ఎత్తితే కసురుకునేవారు. ఏజంటు వెంటపడి విసుగెత్తి మానేశాడు."

"మీరు వుంటోన్న యీ భవనం యెవరి పేర వుంది?...."

"నా పేరనే రాశారు. అప్పుడే రెండేళ్ళవుతోంది."

"మీ భార్త పోయారుకదా! మీరు ఈ పట్నంలోనే వుంటారా? లేకపోతే మీ తలిదండ్రులూ, అత్తమామలూ ఎవరైనా వున్నారా?"

కాంతామణి కోపం నిగ్రహించుకుంటోన్నట్టు కనిపించింది.

"మా మామగారు వున్నారు గ్రామంలో. ఈ భవనం అమ్మేసి అక్కడకు వెళ్ళిపోతాను."

శిరీష్ లేచాడు. ఆమెవద్ద సెలవు పుచ్చుకున్నాడు.

8

"సందేహంలేదు. శంకరనారాయణ బతికే వున్నాడు. పాథాలజీ సర్జన్ పంపించిన తాజా రిపోర్టు చదువు.... నీకే తెలుస్తుంది!" అరిచాడు ఇన్‌స్పెక్టర్ కుమార్.

డిటెక్టివ్ శిరీష్ చదవసాగాడు.

'హతుడి వయసు 20 సంవత్సరాలుంటాయి. ఎముకలలో ఇంకా మెత్తదనం వుంది. స్త్రీల శరీరంలోని ఎముకల్లాగా బలహీనంగా వున్నాయి. ఎముకలలో మరో విశేషం వుంది. హ్యూమరస్ ఎముక తలభాగంలో మృదులాస్థి కని

పించింది. సాధారణంగా 22-23 సంవత్సరాల వయసులో మగవారిలో యీ ఎముక అంచులో వుండే మృదులాస్థి హరించుకు పోతుంది. శంకరనారాయణవంటి నలభై సంవ త్సరాల వయసు వుండే పురుషుడిలో మృద్ధులాస్థి హ్యూమ రస్ ఎముకమీద వుండడం అసంభవం.'

"గుడ్.... శంకరనారాయణ యింటిచుట్టూ ఈ పాటికే నిఘాను పటిష్టం చేసి వుంటావు" అన్నాడు శిరీష్.

"ఎదురింట్లోనూ, చుట్టుప్రక్కల యిళ్ళలోనూ మఫ్టీలో కానిస్టేబుల్సును నియమించాను."

"అంతేనా?"

"ప్రక్కయింట్లో వారి టెలిఫోన్ సహాయంతో శంకర నారాయణ టెలిఫోన్‌ని టాప్ చేయించే ఏర్పాటు చేశాను. శంకరనారాయణ యింట్లోనూ యిక్కడ కూడా ఒకసారి ఫోన్ మ్రోగుతుంది. ఐ మీన్ — శంకరనారాయణ యింటికి వచ్చే టెలిఫోన్ కాల్—మనకి అందుతుందన్న మాట!"

"బహుశా శంకరనారాయణ టెలిఫోన్ చేయడు. మనం టాప్ చేస్తామన్న సంగతి తెలిసే వుంటుంది! శంకరనారా యణ యింటికి వచ్చే మనుషులలో యెవరో వార్తను తీసుకురావచ్చును. పోస్టులో వుత్తరం రావచ్చును...."

"లేదా కొంత కాలంపాటు యెక్కడో మౌనంగా వుండిపోయి శంకరనారాయణ కాలక్షేపం చేయ వచ్చును!...."

"అలా కూడ కావచ్చును."

బల్లమీద టెలిఫోన్ మ్రోగింది. ఇన్‌స్పెక్టర్ కుమార్ రిసీవర్ ఎత్తాడు.

"సార్! నేను పి. పి. 309 ని మాట్లాడుతున్నాను.

కాంతామణి బయటకు ఒంటరిగా బయలుదేరింది సార్!"

"ఆమెను వెంటాడు. మిగతావాళ్ళని ఆ యింటిమీద నిఘా వేసి వుండమని చెప్పు!"

"ఎస్ సార్!"

డిటెక్టివ్ శిరీష్ కణతలు రుద్దుకున్నాడు.

"కుమార్! గెటప్! మనం కాంతామణిని వెంటాడాలి!"

"ఎందుకు?"

"నా వూహ నిజమైతే కాంతామణి ఎల్.ఐ.సి. కయినా, పోస్టాఫీసు కయినా వెళ్తూండి వుండాలి. ఏమయినప్పటికీ శంకరనారాయణకి సందేశం పంపడానికి కూడా ఆమెకి ఇదే అవకాశం!"

ఇద్దరూ లేచారు.

డాట్సన్ యిద్దరినీ యెక్కించుకొని బయలుదేరింది.

కాంతామణి పేవ్‌మెంట్ మీద నడుస్తూ కనిపించింది.

ఆమె ఎటూ చూడడంలేదు. మలుపుతిరిగి తల వొంచుకుని పోస్టాఫీసులో అడుగుపెట్టింది. చుట్టూ చూచింది. తనని యెవరూ గమనించడం లేదనే నిర్ధారణకి వచ్చింది.

చటుక్కున చెయ్యిపెట్టి బ్లవుజ్‌లోంచి నీలం కవర్ తీసింది. చకచక పోస్టుబాక్సును సమీపించింది. కవరును పెట్టెలో జారవిడిచింది. పోస్టాఫీస్ భవనంలో ప్రవేశించి, కవర్లు కొని చకచక నడవసాగింది.

ఇన్‌స్పెక్టర్ కుమార్ డాట్సన్ కారునుండి దిగి మలుపు తిరిగి పోస్టాఫీసులో అడుగుపెట్టాడు. తపాలా పెట్టెలో నిశ్చింతగా కవరును జారవిడిచి వెళ్ళిపోతోన్న కాంతామణి కనిపించింది. పోస్టుమాష్టరు గదిలో అడుగుపెట్టి తనని తాను పరిచయం చేసుకున్నాడు.

పోస్టుమాస్టర్ కుర్చీ చూపించి, "మీకు ఎలా సహాయ పడగలను సార్?" అన్నాడు.

"పోస్టుబాక్సులో యిప్పుడే అయిదు నిమిషాల క్రితం ఒక కవరు పోస్టు అయింది. లక్షాధికారి శంకరనారాయణ మరణానికి సంబంధించిన కేసులో ఆ కవర్ మాకు బాగా పనికి వస్తుంది. ప్లీజ్....ఆ కవర్ చూడనిస్తారా?" అడిగాడు కుమార్.

పోస్టుమాస్టర్ తటపటాయించాడు.

"నా బాధ్యత రీత్యా ఆ పని నేరం...." నసిగాడు పోస్టు మాస్టర్.

"ఆమె సాధారణ పౌరురా లయితే మీ రనేది వర్తిస్తుంది. హత్యా నేరం దాచిన పౌరురాలు! నేరస్తులపట్ల చట్టం చర్య తీసుకునేటప్పుడు మీ నియమ నిబంధనలను ఉల్లంఘించి అయినా చట్టానికి సహాయపడాలి. అదీ మీ ధర్మమే!"

"ఆల్ రైట్....ఏర్పాటు చేస్తాను."

ఇ. డీ. బాయ్ తాళంచెవులతో పోస్టుబాక్సు తెరిచాడు. కుమార్ వొంగి జాగ్రత్తగా పై వరసలలో వుండే వుత్తరాలు తీసి చూడసాగాడు. మువ్వయిపై సల కవర్‌మీద ఆడ వాళ్ళ చేతిరాత కనిపించింది.

చిరునామా చదివాడు.

"ఎన్. రాజయ్య
రిటైర్డ్ పంచాయితీ ఆఫీసర్
మంచిలి ఆర్. ఎస్.
పశ్చిమగోదావరి జిల్లా"

అని వుంది. కవర్ అంచులు కొద్దిగా తడిసి వున్నాయి. కాంతామణి పోస్టు చేసిన కవర్ అదే! బ్లవుజ్‌లో ఉంచడం

వల్లనే అంచులు చెమటకి తడిశాయి. కవర్ వెనక కె.ఎం. అని పొడి అక్షరాలున్నాయి.

పోస్టుమాస్టర్‌కి కృతజ్ఞతలుచెప్పి బయటపడ్డాడు కుమార్. అతడి ముందు డాట్సన్ కారు ఆగింది. శిరీష్ నవ్వుతూ చూశాడు.

9

గూడకట్టు పంచె, మోచేతులు దాటిన చొక్కా, నెరిసిన జుత్తూ, గుబురు మీసాలూ, బుగ్గన వులిపిరికాయతో శంకర నారాయణ రోడ్డుమీద నడవసాగాడు. తనచుట్టూ పరకా యించి చూడసాగాడు.

తన భార్య పాసింజర్ ట్రయిన్‌కి వస్తోన్నట్టు తంతి పంపింది. అక్కడ యేం ప్రమాదం ముంచుకు వచ్చిందో! తను కంగారుపడ్డాడు. తంతిలో క్షేమం అన్నమాట చూశాక తన మనసు శాంతించింది. అక్కడ అంతా సవ్యంగా జరిగి భీమా సొమ్ము మొత్తం తన చేతికి అంది వుంటుంది.

అతడు ప్లాట్‌ఫాంమీద నిలబడ్డాడు. బండి రావడానికి ఇంకా టయిముంది.

"శంకరనారాయణగారూ!" యెవరో కంగారుగా పిలిచారు.

శంకరనారాయణ వులిక్కిపడి వెనక్కి చూశాడు.

కాకీబట్టలతో పూర్తి యూనిఫాంలో నిలబడిన ఇన్‌స్పెక్టర్ కుమార్ అతడిని నవ్వుతూ చూసాడు.

"మిస్టర్ శంకరనారాయణా! మీట్ మైబిలవ్‌డ్ ఫ్రెండ్ డిటెక్టివ్ శిరీష్!" అన్నాడు కుమార్.

"మీ కోసం నన్ను ఎల్.ఐ.సి. వారు పంపించారు!" అన్నాడు శిరీష్.

అంతే! శంకరనారాయణకు నిలువుగుడ్లు పడ్డాయి. □

శ్రీకృష్ణవిగ్రహం

ఫిరంగిపురం రైలుస్టేషన్‌లో గుంటూరు నుంచి బయలు దేరిన ప్యాసింజరు బండి ఆగింది. దిగేవాళ్ళు దిగుతున్నారు, ఎక్కేవాళ్ళు ఎక్కుతున్నారు.

అర్జునరావు ఫ్లాట్‌ఫారం మీద నిల్చుని బండి దిగే వాళ్ళని గమనిస్తున్నాడు. అతని ఫ్రెండ్ వెంకట్రావు ఆ బండిలో వస్తానని లెటర్ రాశాడు.

స్టేషన్‌లో గంట మ్రోగింది. గార్డు విజిల్ వూది పచ్చ జెండా చూపించాడు. బండి బుసలుకొడుతూ బయలు దేరింది.

అర్జునరావు నిరాశపడ్డాడు వెంకట్రావు రానందుకు. కాలుస్తున్న సిగరెట్ చివరికొచ్చింది. ఆఖరిసారి రెండు దమ్ములు లాగి క్రింద పడేసి చెప్పుక్రింద నలిపాడు.

అర్జునరావు దృష్టి ఫ్లాట్‌ఫారం మీద నిల్చున్న ఇద్దరి మీద పడింది. ఏదో మాట్లాడుకుంటూ సిగరెట్లు ముట్టించారు.

ఇద్దరిలో ఒకడు ఫారినర్. తెల్లగా ఆరడుగుల పొడుగున్నాడు. ఫ్రెంచికట్ మీసంతో నీట్‌గా డ్రెస్ చేసుకుని వున్నాడు. రెండో అతను చామనఛాయగా, గిరజాల జుట్టుతో పొడగ్గానే వున్నా అతని ముందు పొట్టిగా కనిపిస్తున్నాడు. అతను ఇండియావాడే అని తెలిసిపోతూనే వుంది.

అర్జునరావు మనసులో ఒక మెరుపు మెరిసింది.

నెమ్మదిగా వాళ్ళని సమీపించాడు.

"ఎక్స్‌క్యూజ్‌మీ ...." అన్నాడు.

వాళ్ళిద్దరూ మాటలు ఆపి అర్జునరావు వైపు ప్రశ్నార్థకంగా చూశారు.

"మీ పేరు బాబూరావు కదూ?" ప్రశ్నించాడు అర్జునరావు.

అతను నవ్వి "కాదు" అన్నాడు.

"మీరు అచ్చం బాబూరావులా వున్నారు."

"బాబూరావు ఎవరు?"

"బి. కామ్. లో నా క్లాస్‌మేట్. హిందూ కాలేజీలో చదువుకున్నాం" అన్నాడు అర్జునరావు.

"కొంచెం పోలికలు వున్నాయేమో! నా పేరు శ్రీధర్" అన్నాడు.

"గ్లాట్ టు మీట్ యూ!" అర్జునరావు, శ్రీధర్‌తో చెయ్యి కలిపాడు.

"మీట్ మై ఫ్రెండ్ మిస్టర్ రాబర్ట్" అంటూ తన ఫారిన్ మిత్రుని పరిచయం చేశాడు శ్రీధర్.

అర్జునకావు అతనితో కరచాలనం చేశాడు.

"మీరు యిక్కడ ఏం చేస్తున్నారు?" ప్రశ్నించాడు శ్రీధర్.

"బ్యాంక్‌లో జాబ్ చేస్తున్నాను" అన్నాడు అర్జునరావు.

"ఐ. సీ...."

"ఇక్కడ ఎవరయినా బంధువుల ఇంటికి వచ్చారా?" ప్రశ్నించాడు అర్జునరావు.

"నో....నో.... కొండవీడు చూడాలని వచ్చాం. రాబర్టుకి హిస్టారికల్ ప్లేసెస్ చూడడం అంటే ఎంతో సరదా!" అన్నాడు శ్రీధర్.

"రాబర్టు ఏ దేశంవారు?"

"అమెరికా. నేనూ అక్కడే వుంటున్నాను."

"మీరూ అమెరికాలోనే వుంటున్నారా?" ఆశ్చర్యంగా అడిగాడు అర్జునరావు.

"అవును, రాబర్టు మా బాస్ కొడుకు. లాస్ ఎంజెల్స్‌లో చాలా ఫర్మ్స్ వున్నాయి వాళ్ళకి. నేను ఒక బ్రాంచికి మేనేజర్ని" అంటూ చెప్పసాగాడు శ్రీధర్.

అర్జునరావు సరిగ్గా ఇటువంటి వ్యక్తుల కోసమే చూస్తున్నాడు. అదృష్టవశాత్తు వాళ్ళే కన్పించారు.

ఆ రోజు ఆదివారం. అర్జునరావు వాళ్ళని వదలకుండా తిరిగాడు. కొండవీడువరకూ వెళ్ళి ముఖ్యమయిన ప్రదేశాలు, కోట బురుజు, కత్తుల బావి వగయిరా చూపించాడు.

ఒక అపరిచిత వ్యక్తి అయాచితంగా తమకి తోడ్పడడం రాబర్టుకి ఎంతో ఆశ్చర్యం కలిగించింది.

ఫిరంగిపురం వచ్చేసరికి చీకటి పడింది. వాళ్ళు గుంటూరు వెళ్ళిపోవాలనీ, ఆ తర్వాత నాగార్జునసాగర్ వెళ్ళి అటునుంచి హైదరాబాద్ వెళ్ళిపోతామనీ అన్నారు.

కాని అర్జునరావు వాళ్ళని వెళ్ళనివ్వలేదు. ఆ రాత్రికి భోజనం చేసిగాని వెళ్ళడానికి వీల్లేదని పట్టుబట్టాడు.

శ్రీధర్, రాబర్టు భోజనాలయిన తర్వాత అర్జునరావుతో చాలాసేపు మాట్లాడుతూ కూర్చున్నారు.

"ఇండియన్ దేవతా విగ్రహాలకి అమెరికాలో మంచి డిమాండ్ వుందటగదా?" అన్నాడు అర్జునరావు.

"అవును. అదొక వేలంవెర్రి వాళ్ళకి...." నవ్వాడు శ్రీధర్.

రాబర్టు ఆవులిస్తున్నాడు. టైమ్ రాత్రి పది దాటుతోంది.

"మిస్టర్ రాబర్ట్, ప్లీజ్ టేక్ రెస్ట్...." అన్నాడు అర్జునరావు.

రాబర్ట్ నవ్వి, గుడ్‌నైట్ చెప్పి, పడుకోవడానికి వెళ్ళిపోయాడు.

"మీతో ఏకాంతంగా మాట్లాడాలని మీరు పరిచయమైన దగ్గర్నుంచి ట్రై చేస్తున్నాను" అన్నాడు అర్జునరావు నవ్వుతూ.



"ఏమిటి చెప్పండి?" అన్నాడు శ్రీధర్.

"రాబర్టుకి విగ్రహాలు కొనడం అంటే ఇంట్రస్ట్ వుందా?"

"ఉందా అని నెమ్మదిగా అంటున్నారేమిటి? వాళ్ళ ఇంట్లో కొన్ని వున్నాయి. కనిపిస్తే వదలరు. అదేమిటో గాని, ఎంత పాతవైతే అంత గొప్ప వాళ్ళకి" అన్నాడు శ్రీధర్.

"నా దగ్గరొక కృష్ణుడి విగ్రహం వుంది."

"రాతిదా?"

"నో....పంచలోహములతో చేసింది."

"ఏ పీరియడ్ది?"

"కృష్ణదేవరాయల కాలం నాటిది."

"ఏమాత్రం బరువు వుంటుంది?"

"అడుగున్నర ఎత్తు వుంటుంది, నాలుగయిదు కిలోలు బరువుంటుంది."

శ్రీధర్ ఆలోచనలో పడ్డాడు. సిగరెట్ వెలిగించి "అది రాబర్ట్‌తో కొనిపించండి. అతనిచ్చే డబ్బులో టెన్ పర్సెంట్ బహుమతిగా ఇస్తాను" అన్నాడు అర్జునరావు.

"ట్రై చేస్తాను. విగ్రహం చూపించండి."

"అది ఇంట్లో లేదు. ఒక రహస్య ప్రదేశంలో దాచి వుంచాను" అన్నాడు అర్జునరావు.

"సరే! నేను రేపు రాబర్ట్‌తో మాట్లాడి చెప్తాను" అన్నాడు శ్రీధర్.

2

మర్నాడు ఉదయం రాబర్ట్, శ్రీధర్ అలా వూళ్ళోకి వెళ్ళివస్తామని బయలుదేరి వెళ్ళారు.

తను బ్యాంకికి వెళుతున్నాననీ అక్కడ కలుసుకోమని అర్జునరావు వెళ్ళాడు.

గంట తర్వాత అర్జునరావు పని చేస్తున్న బ్యాంకుకు వచ్చారు. వాళ్ళ అమెరికాలో వుంటున్న తన మిత్రులుగా పరిచయం చేశాడు అర్జునరావు వాళ్ళ స్టాఫ్‌కి. రాబర్ట్‌తో వాళ్ళ స్టాఫ్ మాట్లాడుతూ వుండగా శ్రీధర్ నెమ్మదిగా బైటకు వచ్చాడు అర్జునరావుకి సైగచేసి.

"ఏమన్నాడు రాబర్ట్?" ప్రశ్నించాడు అర్జునరావు.

"అంత ప్రాచీన విగ్రహం ఎక్కడిదని రాబర్ట్‌కి అనుమానంగా వుంది."

"అది సహజమే."

"మీరు ఎక్కడ సంపాదించారు?"

"నేను కొన్నాళ్ళు ఆర్కియాలాజికల్ డిపార్టుమెంట్‌లో పని చేశాను. త్రవ్వకాలలో బైటపడిన వాటిలో దీన్ని తీసి దాచాను. శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా ప్రతిష్ఠ చేసిన విగ్రహం ఇది."

"ఐ....సీ...."

"ఫారిన్ వాళ్ళయితే మంచి రేటు ఇస్తారని ఇన్నాళ్ళు దాచి వుంచాను."

"సరే నేనెలాగో రాబర్ట్‌కి సర్ది చెప్పుకుంటాననుకోండి. ఆ విగ్రహం నాకు చూపించండి. రేటు ఎంత ఇవ్వవచ్చునో చెప్తాను" అన్నాడు శ్రీధర్.

"రేటు ఎలాగో సెటిల్ చేద్దాం. అతని దగ్గర అంత డబ్బు వుందా? ఫారిన్ ఎక్స్ఛేంజ్ తక్కువ వుంటుందని విన్నాను" అని తన సందేహం వెలిబుచ్చాడు అర్జునరావు.

"నో....నో....మీరు అటువంటి సందేహాలు పెట్టుకోకండి. రాబర్టు అంకుల్ అమెరికన్ ఎంబెసీలో ఆఫీసర్. రాబర్టు వచ్చినరోజే అతని పేర లక్ష రూపాయలు బ్యాంక్‌లో వేశాడు. ప్రస్తుతం హైదరాబాద్ బ్యాంకిలో వుంది అతని డబ్బు."

"నాకు డబ్బు ఎలా అందజేస్తారు?"

"ముందు విగ్రహం చూపించండి. అవన్నీ తర్వాత మాట్లాడదాం" అన్నాడు శ్రీధర్.

"ఓ. కే....అయితే మీరు ఈ రోజు గూడా ఇక్కడ వుండాల్సొస్తుంది."

"ఏం?"

"ఆ విగ్రహం దాచిన చోటుకు రాత్రిళ్ల మాత్రమే వెళ్ళాలి."

"అలాగే. నేను రాబర్టుకి చెప్తాను" అన్నాడు శ్రీధర్.

3

రాబర్టు నిద్రపోతున్నాడు.

అర్ధరాత్రి దాటిన తరువాత అర్జునరావు, శ్రీధర్ కలపి వూరి చివర కొచ్చారు.

అర్జునరావు బ్యాట్రీ లైటు ఫోకస్‌లో దారి చూపిస్తూ వుంటే శ్రీధర్ కొండపైకి ఎక్కుతున్నాడు.

అన్నీ పిచ్చిమొక్కలు, రాళ్లు, దారి సరిగ్గా లేదు. అర్జునరావు ప్రాక్టీస్ వున్న వాడిలా కొండ ఎక్కుతున్నాడు.

సగం ఎక్కాక పెద్దరాయి గుండ్రంగా వుంది. అక్కడ ఆగాడు అర్జునరావు. బలంగా రాయిని కదిపి ప్రక్కకు నెట్టాడు. మెత్తటి మట్టి కర్రతో పెళ్లగించాడు. శ్రీధర్ అతనికి సహాయం చేశాడు. రెండు అడుగుల లోతు త్రవ్వాక ట్రంక్ పెట్టె బైటపడింది.

అర్జునరావు దాన్ని పైకి తీశాడు. తాళం తీశాడు. లోపల పాత గుడ్డల్లో చుట్టివున్న శ్రీకృష్ణ విగ్రహం శ్రీధర్ చేతికి ఇచ్చాడు.

శ్రీధర్ దాన్ని పదినిముషాలసేపు అటూ, ఇటూ త్రిప్పి చూశాడు.

"బాగుంది" అన్నాడు చివరకు.

"ఇప్పుడు చెప్పండి. ఎంత ఖరీదు వస్తుంది దీనికి?" ప్రశ్నించాడు అర్జునరావు.

"ఎంత వస్తుందని ఆశిస్తున్నారు మీరు?" ఎదురుప్రశ్న వేశాడు శ్రీధర్.

"నాకు ఐడియా లేదు."

"అమెరికాలో అయితే దీనికి మంచి వెల వస్తుంది. కాని అక్కడివరకూ దీన్ని చేర్చాలికదా?" అన్నాడు శ్రీధర్.

"అవును."

"ఇరవై వేలు ఇప్పిస్తాను రాబర్ట్‌తో."

అర్జునరావు లోలోపల ఎంతో సంతోషించాడు. పైకి

మాత్రం "ఇంతేనా? ప్రాచీన విగ్రహాలు లక్షలకొద్దీ విలువ చేస్తాయని అంటారే." అన్నాడు.

"అదంతా అమెరికాలో. ఇండియాలో కాదు. దీన్ని మీరు అమెరికా చేర్చండి లక్ష ఇప్పిస్తాను" అన్నాడు.

"అలా చేర్చే కెపాసిటీ నాకు లేదు గనుకనే ఇన్నాళ్లూ వూరుకున్నాను" అన్నాడు అర్జునరావు.

"సరే. ఇంతకీ మీకు ఆ రేటు ఇష్టమేనా?"

"కొంచెం పెంచండి. ఆ విధంగా మీకూ టెన్ పర్సెంట్ కమీషన్ వస్తుంది గదా?"

"నో....నో....కమీషన్ గురించి నేను ఆలోచించడం లేదు. రాబర్టు దగ్గిర ఇప్పటికే సగం డబ్బు ఖర్చయింది. ఇంకా ఇండియాలో నెల రోజులు వుండాలి. అతను మా బాస్ కొడుకు. నేను అన్నీ ఆలోచించాలిగదా! పెత్తనం నా కిచ్చాడని నేను అన్యాయం చెయ్యను"

"నేను మాట వరుసకు అలా అన్నాను. బాధపడకండి. మిమ్మల్ని చూశాక నా కెందుకో సదభిప్రాయం కలిగింది. మీరు అచ్చం మా బాబూరావులా వుండడం ఒక కారణం ఏమో!" అని నవ్వాడు అర్జునరావు.

"శ్రీధర్ నవ్వి వూరుకున్నాడు.

"మీకు అవకాశం వుంటే రేటు పెంచండి. నేను బల వంతం చెయ్యను" అన్నాడు.

"అలాగేలెండి. అవునూ! మీరు విగ్రహాన్ని ఈ కొండ మీద దాచారు ఎందుకు?"

"మరి ఎక్కడ దాచాలి చెప్పండి? రోజులన్నీ మనవి కాదు గదా? ఈ విగ్రహం పొరపాటున ఎవరైనా చూశా రనుకోండి. ఎవరో ఎందుకు నా భార్య చూపిందనుకోండి,

ఆరాలు అడుగుతుంది. ఆడవాళ్ళ నోట్లో నువ్వుగింజ నానదు. అది ఎవరికో చెపుతుంది. అలా అలా అది పోలీసుల దృష్టికిపోతే జైల్లోకి పోవాల్సి వస్తుంది. అందుకే రహస్యంగా ఇక్కడ దాచాను" అన్నాడు అర్జునరావు.

"మొత్తానికి అసాధ్యులే" మెచ్చుకోలుగా అన్నాడు శ్రీధర్.

తర్వాత అర్జునరావు విగ్రహాన్ని గుడ్డల్లో చుట్టి ట్రంక్ పెట్టెలో భద్రపరిచి తాళంవేసి గుంటలోపెట్టి మట్టి కప్పేశాడు. దానిమీద రాయిని దొర్లించాడు. శ్రీధర్ ఏదైనా మోసం చేయాలని చూచినా ఆ చీకట్లో కొండరాళ్ళలో ఆ స్థలాన్ని మళ్ళీ కనుక్కోవడం కష్టం!

"ఇదంతా ఎవరైనా కనిపెడితే?" అన్నాడు శ్రీధర్.

"ఎవరు కనిపెడతారు? ఇదెప్పుడో పదేళ్ళ క్రితం పాతిపెట్టాను. మళ్ళీ ఇప్పుడే తియ్యడం."

"పదేళ్ళనుంచీ మీరు ఇక్కడే వున్నారా?"

"ఆఁ..... ఈ ఊరు మా స్వగ్రామం. బ్యాంకులో వుద్యోగం వచ్చాక కొన్నాళ్ళు హైదరాబాద్ లో వున్నాను. ఆ తర్వాత రెండేళ్ళ క్రితం పైరవీచేసి ఇక్కడికి ట్రాన్స్ఫర్ చేయించుకున్నాను" అన్నాడు అర్జునరావు.

"ఈ విగ్రహం ఎక్కడ దొరికింది మీకు?"

అర్జునరావు అది ఎక్కడ దొరికిందో, దాన్ని ఎంత జాగ్రత్తగా ఇక్కడికి జేర్పించాడో అంతా వివరంగా చెప్పుకొచ్చాడు కొండదిగుతూ.

ఆ రాత్రి అర్జునరావుకి సరిగా నిద్రపట్టలేదు. ఇరవై వేలు కళ్ళముందు నాట్యం చేస్తున్నాయి. ఆ డబ్బును ఏం చేయాలో ఆలోచించుకుంటున్నాడు.



మర్నాడు టిఫిన్ చేసి, కాఫీలు త్రాగుతూ వుంటే శ్రీధర్ అన్నాడు "మిష్టర్ అర్జున్‌రావ్ మా రాబర్ట్ పాతిక వేలు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు."

"థాంక్స్...." అన్నాడు అర్జునరావు నవ్వుతూ.

"యస్. ఎగ్రీడ్" అన్నాడు రాబర్ట్.

"గివ్ హిమ్ సమ్ అడ్వాన్స్...." అన్నాడు శ్రీధర్, రాబర్ట్‌ని ఉద్దేశించి.

రాబర్ట్ సూట్‌కేసులోనుంచి చెక్‌బుక్ తీసి అర్జున రావు పేరున వెయ్యి రూపాయలకు చెక్ రాశాడు. అది ఫారిన్ బ్యాంక్ చెక్. ఆ బ్యాంక్ అమెరికాకు చెందినదే.

"చెక్కా...." అన్నాడు అర్జునరావు.

"సందేహించకండి. రాబర్ట్‌తో అన్నీ మాట్లాడాను. మీరు ఎల్లుండి విగ్రహం తీసుకుని హైదరాబాద్ రండి. వచ్చేటప్పుడు బ్యాంక్‌లో చెక్ మార్చుకుని రండి. ఆ తర్వాత మొత్తానికి సెటిల్ చేస్తాం" అన్నాడు శ్రీధర్.

అర్జునరావు సరే అన్నాడు.

ఆ రోజు గుంటూరు వెళ్ళడానికి నిర్ణయించుకున్నారు రాబర్ట్, శ్రీధర్.

మధ్యాహ్నం భోజనంచేసి వెళ్ళమన్నాడు అర్జునరావు. వాళ్లు అయిష్టంగానే ఒప్పుకున్నారు.

అర్జునరావు ఆ రోజు సెలవుపెట్టి వస్తానని బ్యాంక్‌కు బయల్దేరాడు.

తను సిగరెట్స్ తీసుకువస్తానని శ్రీధర్, అర్జునరావు వెంట బజారుకు వచ్చాడు.

"నా కమీషన్ మాత్రం క్యాష్ ఇవ్వండి. చెక్కు వద్దు" అన్నాడు శ్రీధర్ నవ్వుతూ.

అర్జునరావు కూడా నవ్వి "నాకు తెలుసు ఆ విషయం. నేను హైదరాబాద్ వచ్చినప్పుడు అందులోనుంచి తీసి ఇస్తాను!" అన్నాడు.

"అలాగే కాని, ఇదంతా రాబర్ట్‌కి తెలియడం ఇష్టం లేదు నాకు. హి మే థింగ్ అదర్‌వైజ్...." అన్నాడు శ్రీధర్.

"అలాగే!...." అన్నాడు అర్జునరావు.

4

రాబర్ట్ ఇచ్చిన చెక్ తీసుకెళ్లి బ్యాంకుకు వెళ్లాడు అర్జునరావు.

బ్యాంక్‌వాళ్లు దానికి డబ్బు ఇవ్వమని అన్నారు. మీరు ఎకౌంట్ ఓపెన్ చెయ్యండి. డబ్బు అందులో జమ చేస్తాం. తర్వాత విత్‌డ్రా చేసుకోండి అన్నారు.

ఎకౌంట్ ఓపెన్ చెయ్యడానికి తెలిసినవాళ్లు కావాలన్నారు. అదీ ఆ బ్యాంక్‌లో ఎకౌంట్ వున్న వాళ్ళు

కావాలట. అర్జునరావుకి తెలిసినవాళ్ళు ఎవరున్నారు?
రాబర్ట్!

ఆటోలో రాబర్ట్ బసచేసిన హోటల్‌కి వెళ్లాడు. శ్రీధర్ గూడా అక్కడే వున్నాడు.

బ్యాంక్‌వాళ్లు ఇచ్చిన ఫారంమీద సంతకం పెట్టాడు రాబర్ట్.

ఆ తర్వాత కుశల ప్రశ్నలు అయ్యాయి. శ్రీధర్ అర్జున రావు దగ్గర్నుంచి శ్రీకృష్ణ విగ్రహం తీసుకుని రాబర్టు చేతికి ఇచ్చాడు.

రాబర్టు "వెరీ ఫైన్....మార్వలెస్...." అంటూ ఆ విగ్రహాన్ని పొగిడాడు.

ఆ తర్వాత చెక్‌బుక్ తీసి ఇరవై నాలుగు వేలకు చెక్ రాసి ఇచ్చాడు.

అర్జునరావు చెక్ తీసుకుని కళ్లకు అద్దుకుని జేబులో పెట్టుకున్నాడు. బ్యాంక్‌లో అతని ఎకౌంట్లో ఎంత డబ్బుందో తెలుసుకుని వచ్చాడు. దాదాపు నలభై తొమ్మిది వేలుంది. కాబట్టి సందేహించవలసిన పనిలేదు.

లంచ్ వేళయింది.

శ్రీధర్ బాయ్‌ని పిలిచి ఆర్డర్ ఇచ్చాడు.

కొన్ని నిముషాల్లో చల్లటి బీరుసీసాలు, రకరకాల నాన్‌వెజిటేరియన్ డిషెష్ వచ్చేశాయి.

అర్జునరావుకి చాలా సంతోషంగా వుంది. అతని చిర కాల వాంఛ ఈడేరింది. ఆ విగ్రహాన్ని మంచి వెలకు అమ్మాడు.

రాబర్ట్ బీరులో విస్కీ కలిపి కాక్టెయిల్ చేశాడు.

విస్కీ ఫారిన్‌ది. అటువంటిది అర్జునరావు యెప్పుడూ తీసుకోలేదు. మళ్ళీ దొరకదేమోనని కొంచం యెక్కువే

తీసుకున్నాడు.

లంచ్ పూర్తయ్యాక హాయిగా నిద్రపట్టింది.

లేచేసరికి ఆరయ్యింది.

అప్పటికి రాబర్ట్, శ్రీధర్ స్నానాలుచేసి రెడీగా వున్నారు.

"మీరు హాయిగా నిద్రపోతున్నారు. డిస్టర్బ్ చెయ్య లేదు" అన్నాడు శ్రీధర్.

అర్జునరావు నవ్వాడు.

"మీరు యెన్నిరోజులు వుంటారు హైదరాబాద్‌లో?" ప్రశ్నించాడు శ్రీధర్.

"రేపు వెళ్ళిపోతాను" అన్నాడు అర్జునరావు.

"ఈ పూట బెంగుళూరు వెళ్తున్నాం. మీరు ఈ రూమ్ వాడుకోండి వున్నన్ని రోజులు" అన్నాడు శ్రీధర్.

కౌంటర్లో రేపటికిగూడా రూమ్ రెంట్ పే చేశాడు శ్రీధర్.

తన దగ్గర రెండు వేలే వుందని శ్రీధర్‌కి ఇవ్వవలసిన కమీషన్ ఇచ్చేశాడు అర్జునరావు రాబర్ట్ చూడకుండా.

"నెవర్‌మైండ్!" అన్నాడు శ్రీధర్ నవ్వుతూ.

"మళ్ళీ యెప్పుడొస్తారు ఇక్కడికి?"

"పదిరోజుల్లో వస్తాం" అన్నాడు శ్రీధర్.

రూమ్ బాయ్ టాక్సీ తీసుకొచ్చాడు.

బాయ్ చేతిలో పది కాగితం పెట్టాడు రాబర్ట్.

టా....టా.... చెప్పాడు టాక్సీ యెక్కి.

శ్రీధర్ నవ్వుతూ చెయ్యి వూపాడు.

టాక్సీ వెళ్ళిపోయింది.

రూమ్‌లోకి వెళ్ళి ఫోంబెడ్ మీద పడుకున్నాడు అర్జున రావు.

ఏం తోచడంలేదు.

దగ్గర్లోనే ఏదో హిందీ సినిమా కనిపిస్తోంది ఫస్టుషో సినిమా చూసి వచ్చాడు. మధ్యాహ్నం బాగా తిని వుండడం వల్ల ఆకలిగా లేదు. ఇరానీ హోటల్లో పొరాటా తిని పాలు త్రాగాడు.

మర్నాడు ఆటో వేసుకుని బ్యాంకుకు వెళ్లాడు. మొట్ట మొదట ఖాతా ఓపెన్ చేశాడు కొంచెం సేపట్లో పాస్‌బుక్ ఇస్తామన్నారు.

వరండాలో వున్న సోఫాలో కూర్చున్నాడు.

హైదరాబాద్‌లో తను భార్యకు, పిల్లలకు ఏమేమి కొని తీసుకెళ్ళాలో ఆలోచించుకొంటున్నాడు.

అతనికి యెంతో సంతోషంగా వుంది ఆ అమెరికా వాడిని మోసం చేసినందుకు. ఆ విగ్రహం శ్రీకృష్ణదేవ రాయల కాలంనాటిది కాదు. అతను ఆర్కి-లాజికల్ డిపార్టు మెంటులో పనీ చెయ్యలేదు.

ఆ విగ్రహం వాళ్ళ ఇంట్లోదే. తరతరాలనుంచీ పూజా మందిరంలో వుంటోంది. మొన్నటి వరకూ అతని తల్లి పూజలు చేసేది. ఆమె చనిపోయింది. అతని భార్య పూజలు చెయ్యదు. హేతువాద దృక్పథంతో వుంది ఆమె.

ఆ విగ్రహం పాత సామానుల్లో పడిపోయింది. ఒక రోజు అతనికి ఎందుకో అది పాత విగ్రహమని చెప్పి యెవర్నయినా మోసంచేసి డబ్బు సంపాదించవచ్చు ననిపించింది. వెంటనే ఆ విగ్రహాన్ని ఆ కొండ రాళ్ళలో పాతి పెట్టాడు.

"ఇన్నాళ్టికి రాబర్ట్ తన వలలో పడ్డాడు. అంతా తన అదృష్టం" నవ్వుకున్నాడు.

"అర్జునరావ్!...." బ్యాంక్ ఎకౌంటెంట్ కేక పెట్టాడు.

అర్జునరావు వులిక్కిపడి కౌంటర్ దగ్గరికి వెళ్ళాడు. అతని చేతికి బ్లూకలర్ ప్యాస్‌బుక్ కొత్త పెళ్ళికూతుర్లా తగిలింది.

ఆ వెంటనే డిపాజిట్స్ ఫారం తీసుకుని, వెయ్యి చెక్, ఇరవై నాలుగువేల చెక్ దానికి తగిలించి కౌంటర్లో ఇచ్చాడు.

కాసేపటికి మేనేజర్ దగ్గర్నుంచి పిలుపు వచ్చింది.

అర్జునరావుని చూస్తూ "సారీ జెంటిల్మన్! దేర్ ఈజ్ నో బ్యాలన్స్ ఇన్ రాబర్ట్స్ ఎక్కౌంట్!" అన్నాడు మేనేజర్.

రాబర్ట్ ఎక్కౌంట్లో డబ్బులేదనే మాట వింటూనే కుప్పలా కూలిపోయాడు కుర్చీలో.

"ఎస్టర్‌డే దేర్ వాజ్ ఫార్టీనైన్ థౌజెండ్...." నెమ్మదిగా అన్నాడు అర్జునరావు.

"యస్. హీ విత్‌డ్రూ ఆల్ ది ఎమౌంట్ ఎస్టర్‌డే ఈవెనింగ్" అన్నాడు మేనేజర్.

రాబర్ట్ నిన్నసాయంకాలం వచ్చి డబ్బు అంతా విత్‌డ్రా చేసుకున్నాడని విని బ్లడ్‌ప్రెజర్ వచ్చినవాడిలా వణికిపోయాడు అర్జునరావు.

'ఎంత మోసం?' ఆక్రోశించింది మనసు.

"ఇప్పుడేం చెయ్యాలి?....పైగా తన డబ్బు రెండు వేలు కూడా పోయాయే....!" అర్జునరావుకి ఏడ్పు ముంచుకొచ్చింది. □

సీక్రెట్ గ్యాంగ్

'సికిందర్'

(గత సంచిక తరువాయి)

ఆమె అదోలా, ముభావంగా వుంది.

ఆమె కళ్ళు చాలా విచారంగా వున్నాయి.

జాన్‌ని పలకరించకుండా, నేలచూపులు చూస్తూ నడుస్తూ, ఏదో తీవ్రంగా ఆలోచిస్తోంది.

జాన్ కాస్సేపు సందేహించాడు. ఆ తర్వాత తనే పలకరించాలని నిశ్చయించుకున్నాడు.

ఆమె పక్కన నడుస్తూ, "ఎక్స్‌క్యూజ్‌మీ, మీ మూడ్ బాగా లేదా?" అనడిగాడు.

ఆమె తల తిప్పి జాన్‌ని చూపింది. తీక్షణపు చూపులు!

"అవును. ఈ ఉద్యోగంతో నాకు విసుగు పుడుతోంది! మానెయ్యాలనుకుంటున్నాను...." అందామె, తిరిగి పర ధ్యానంలో జారుకుంటూ.

జాన్ గుండె వేగంగా కొట్టుకుంది.

"ఎవరయినా వింటే నాకు పిచ్చిపట్టిందనుకుంటారు" మళ్ళీ అందామె అకస్మాత్తుగా, "నా స్థానంలో వుంటేగానీ నా బాధ ఎవరికీ తెలీదు! మిస్టర్ పవన్, తిట్లను సహిస్తూ ఉద్యోగం చేసే ఖర్మ నాకేం పట్టింది? ఉద్యోగుల్ని తిట్టడం సభ్యత గల వాళ్ళ లక్షణం కాదు. నా బాస్‌కి సభ్యత తెలీదు."

జాన్ చాలా ఆశ్చర్యపోయాడు.

"మిస్ ప్రీతి, మీ మాటలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. నాకు తెలిసినంతవరకు బాస్ చాలా మంచివాడు."

"మీకేం తెలుసు? నేను మూడేళ్ళనుంచి పని చేస్తున్నాను. మీరొచ్చి మూడు రోజులైంది. ఇంకా మీకు పని తగలలేదు. బాస్ స్వరూపం మీకు పూర్తిగా తెలియాలంటే వారం రోజులు చాలు—అ తర్వాత మీరిక్కడ వుండరు. ఉద్యోగానికో నమస్కారం పెట్టేస్తారు."

"బాస్ కోపిష్టా?"

"పరమ కోపిష్టి! ఓహ్, ఆ తిట్లు ఆ అరుపులు!.... భరించలేను! కారణం లేకుండానే తిడతాడు. నన్ను చంపేసేలా చూస్తాడు! నేనిక యిక్కడ వుండను మిస్టర్ పవన్! అతను వచ్చాక చెప్పి వెళ్ళిపోతాను. హోటల్‌లో రిసెప్షనిస్టు ఉద్యోగం నయం! కస్టమర్స్ గౌరవంగా చూస్తారు."

"కానీ....బాస్ మిమ్మల్ని కోప్పడగా నే నెప్పుడూ చూడలేదు...." నసిగాడు జాన్.

ఆమె విసుగ్గా చూపింది.

"నే నబద్ధం చెప్తున్నానా? మీరిక్కడికి వచ్చి మూడే రోజులయ్యాయని గుర్తుంచుకోండి. క్రమంగా మీ కర్థం కాని దేమిటో బోధపడుతుంది."

"ఇక్కడికొచ్చాక ఎప్పుడేనా తిట్టాడా?"

"నిన్న తిట్టాడు. మీరు లేరు—పిటీకెళ్ళారు."

"ఎందుకు తిట్టాడు?"

ఆమె నిట్టూర్చింది.

కాస్సేపు సందేహించి అంది:

"చిన్న పొరపాటు చేశాను."

"ఏం చేశారు?"

"ఆయన కొచ్చిన ఉత్తరాల్ని నేనే తెరుస్తుంటాను. వాటిలో ముఖ్యమైనవి మాత్రమే అతని కిస్తాను. అయితే మొన్న ఒక వార్నింగ్ ఇచ్చాడు. తనకి కొన్ని ప్రత్యేక మైన ఉత్తరాలు వస్తాయట. వాటిని విప్పకుండా అలాగే అంద జేయాలట. ఆ ఉత్తరాలు నీలిరంగు కవర్‌లో వుంటా యట. కవరు ఒక మూల మీద చిన్నగా 4 అనే అంకె వేసి వుంటుందట—ఇలాటి ఉత్తరాలు బొంబాయిలో వుండగా ఎప్పుడూ రాలేదు."

జాన్ రక్తం పరుగులు తీసింది....

"అయితే ఏం చేశారు?"

మిస్ ప్రీతి నిట్టూర్చి అంది:

"నిన్నవచ్చిన పోస్టులో అలాటి వుత్తరం ఒకటి వుంది. నేను పొరపాటున తెరిచిచూశాను. భయం వేసింది. ఆ ఉత్తరం అతనికిచ్చి వెంటనే నా పొరపాటు ఒప్పు

కున్నాను. అతను రెచ్చిపోయి తిట్టాడు. చేతులు జాఫి నాకేసి వచ్చాడు; నేనక్కడినుంచి పారిపోయి వచ్చేశాను.... ఓహ్; ఆ అనుభవం యెలా చెప్పను;...."

జాన్ ఆతృత యెక్కువైంది.

"ఆ ఉత్తరం....ఆ ఉత్తరంలో ఏముంది; అతనెందుకు రెచ్చిపోయాడు?"

"నిజం చెప్పాలంటే ఆ ఉత్తరంలో రహస్యమేమీ లేదు. చాలా మామూలు విషయం. ఆ విషయానికే ఎందుకలా రెచ్చిపోయాడో అర్థంగావడం లేదు. అతనికి మానర్స్ తెలియదు."

"ఆ ఉత్తరంలో ఏం వ్రాసి వుందో చెప్పగలరా?"

మిస్ ప్రీతి కళ్ళు చిట్లించి చూసింది.

"చెప్పగలను. ప్రతి వాక్యం నాకు బాగా జ్ఞాపకం వుంది."

"చెప్పండి."

మిస్ ప్రీతి స్పష్టంగా, తగిన విరామం ఇస్తూ, విడి విడిగా వాక్యాల్ని పలికింది:—

డియర్ సర్,

అత్యవసరంగా మిమ్మల్ని కోరేదేమిటంటే, దయచేసి కూకట్ పల్లీ వచ్చి మీకు నచ్చిన ప్లాట్ చూసుకోండి. ధర మాత్రం పదిహేడు వేలకి నిర్ణయించండి. కానీ కమీషన్ పదకొండు శాతం చాలా ఎక్కువ. నాలుగు శాతం అంగీకరించండి.

—పంజాబ్ సింగ్"

మిస్ ప్రీతి ఇంకా అంది:

"ఏదో ప్లాట్ కొనుగోలు వ్యవహార మనుకుంటాను. అంతమాత్రానికే రెచ్చిపోవాలా? లేదు, మిస్టర్ పవన్,

నేను సహించను. ఈ ఉద్యోగం మానేస్తాను."

పవన్‌కుమార్ ఉరఫ్ డిటెక్టివ్ జాన్ మెదడులో తుఫాను చెలరేగింది. ఏమిటా ఉత్తరానికి అర్థం? గౌతమ్ సక్సేనా ఫోర్ ఏసెస్ ఆర్గనైజర్ అని స్పష్టమవుతోనే వుంది. నీలిరంగు ఉత్తరాలమీద '4' అనే అంకెలు! లాల్ సరిగానే అనుమానించాడు. గౌతమ్ సక్సేనా ఫోర్ ఏసెస్‌లో నెంబర్ టూ! బాణం గుర్తును కోడ్‌గా వాడుతాడు! తనని యెంత చక్కగా ఫూల్‌చేశాడు! అతను చెప్పిన పథక మంతా హంబక్!

ఆ రాత్రి చాలాసేపటివరకు జాన్‌కి నిద్రపట్టలేదు. ఆ ఆ ఉత్తరం గురించే ఆలోచిస్తున్నాడు. మిస్ ప్రీతి చెప్పిన వాక్యాలు యధావిధిగా కాయితంమీద వ్రాసుకుని, పదేపదే చదివాడు. ఎంతకీ రహస్యమేమిటో తేలడంలేదు. ఇందులో తప్పకుండా ఏదో రహస్యం వుంది. ఈ ఉత్తరం పైకి మామూలు లావాదేవీలకి సంబంధించినట్టు వుంది. కానీ ఇందులో ఏదో అతి రహస్యం వుంది. అది బయటపడ్డం లేదు....

చివరికి—అర్ధరాత్రి దాటాక ఆ ఉత్తరంలో జాన్‌కి ఒక క్లూ దొరికింది....

4 అనేది ఆ ఉత్తరంలోని గుప్తంగా వున్న విషయాన్ని బయటపెట్టే క్లూ.

ఆ ఉత్తరంలోని ప్రతి నాలుగవ పదాన్ని వేరు చేస్తే ఈ క్రింది వాక్యం ఏర్పడుతుంది:—

అత్యవసరంగా—కూకట్ పల్లి—ప్లాట్—పదిహేడు వేలు—పదకొండు—నాలుగు.

ఈ అర్థంలేని వాక్యంలో పదిహేడు వేలు అంటే ఆ నెల పదిహేడవ తారీఖు అని అర్థం. పదకొండు అనేది

సమయం. నాలుగు అనేది ఫోర్ ఏసెస్ కోడ్.

ఇప్పుడా ఉత్తరం సారాంశం: పదిహేడవ తారీఖున పదకొండు గంటలకి కూకట్ పల్లి ప్లాట్ దగ్గర అత్యవసరంగా కలుసుకోమని.

ఇక జాన్‌కి పరుగులుతీసే మనసును అదుపు చెయ్యడం కష్టమైపోయింది.

తక్షణం లాల్‌ని కలుసుకోవాలన్న ఆతృతను బలవంతంగా అణుచుకున్నాడు. తనిప్పుడు శత్రు స్థావరంలో వున్నాడు. ఏ మాత్రం పొరపాటుగా ప్రవర్తించినా వాళ్ళకి అనుమానం రావచ్చు—పిట్టలు యెగిరిపోతాయి! ఈ వ్యవహారాన్ని చాలా ఓపిగ్గా, జాగ్రత్తగా హాండిల్ చెయ్యాలి.

పదిహేడవ తారీఖు! రేపే!

రేపు కూకట్ పల్లిలో ఫోర్ ఏసెస్ రహస్య సమావేశం జరుగుతుంది. ఎంత తెలివిగా వ్రాయబడిందా ఉత్తరం.

కానీ—

పదకొండు గంటలంటే ఎప్పుడు? రాత్రా? పగలా?

సక్సేనా ఇప్పుడు బెంగుళూరులో వున్నాడు. రేపు మధ్యాహ్నం వస్తాడు. అంటే రాత్రి అన్నమాట-సక్సేనా రహస్య సమావేశానికి రేపు రాత్రి వెళతాడు.

వాట్ ఎ ఛాన్స్!

ఈ అవకాశాన్ని జారవిడుచుకోకూడదు.

'మిస్టర్ సక్సేనా! నీ కూకట్ పల్లి సమావేశంతో నీ ఆర్గనైజేషన్ కూకటి వేళ్ళతోసహా పెళ్ళగించబడిందని రేపు రాత్రి తెలుసుకుంటావు!'

69

మర్నాడు ఉదయం తొమ్మిది గంటలకి టిఫిన్ చేస్తున్న లాల్, తలుపు తోసుకుని లోనికి జొరబడ్డ జాన్‌ని చూసి

అదిరిపోయాడు.

"వాట్! ఇక్కడి కెందుకొచ్చావ్!"

"రిలాక్స్. నీతో ముఖ్య విషయం మాట్లాడాలి" అన్నాడు జాన్ యెదురుగా వచ్చి కూచుంటూ.

"ఏం జరిగింది? సక్సేనా నిన్ను—"

"రిలాక్స్. ప్రశాంతంగా తిను. ఇంకేమీ జరగలేదు. జరగబోతోంది. నీ అనుమానం రూఢీ చేశాను. ఆ బాస్టర్డ్ ఫోర్ ఏసెస్‌లో నెంబర్ టూ! దేశాభివృద్ధి గురించి అర గంట ఉపన్యాసం ఇచ్చిన బాస్టర్డ్! ఈ రాత్రి ఇంకేదో పథకం తయారు చెయ్యడానికి సమావేశమవుతున్నాడు."

లాల్ సిగరెట్ వెలిగించి టిఫిన్‌ప్లేట్ ప్రక్కకు తోశాడు.

"ఎలా తెలుసుకున్నావు?"

జాన్ వివరంగా చెప్పాడు.

"ఆల్‌రైట్, నువ్వింక వెళ్ళు."

"నువ్వేం చేస్తావు?"

"రాత్రి అక్కడికి వస్తాను. పదకొండు గంటలకా? వెల్, నువ్వతన్ని వెంటాడిరా! కూకట్‌పల్లి సమీపంలో నేను వుంటాను. అక్కడ నుంచి మిమ్మల్ని వెంటాడతాను."

"సక్సేనాని ఏం చేస్తావు. ఎలా పట్టుకుంటావు?"

"అంతా అక్కడే చూస్తావు. కమాన్, సమయంలేదు. నేను కొన్ని పనులు చెయ్యాలి. సక్సేనా మధ్యాహ్నం వస్తాడన్నది నమ్మకమేనా?"

"అవును. నాకు చెప్పాడు."

"కాబట్టి సమావేశం రాత్రి జరుగుతుందనుకున్నావు. అలాగాక ఉదయమే జరిగితే? ఈ పాటికి సక్సేనా రాలేదని నమ్మకమేమిటి? జాన్—నువ్వతని ఉద్దేశ్యాన్ని సరిగా అర్థం జేసుకోలేదు. ఈరోజు బెంగుళూరు నుంచి వచ్చి,

పదకొండు గంటలకి సమావేశంలో పాల్గొని, మధ్యాహ్నం, బంగళా కొస్తానన్నాడు. అర్థమైందా?"

"అయితే—ఇప్పుడేం చెయ్యాలి?"

"నువ్వు బంగళాకి పరుగుపెట్టాలి. నీమీద అక్కడ యెవరికీ అనుమానం రాకూడదు. సక్సేనా వ్యవహారం నేను చూసుకుంటాను. బెంగుళూరు నుంచి సక్సేనా బయలు దేరినట్టు పి.ఐ.డి. ల నుంచి కాల్ రాలేదు. కాబట్టి సమావేశం ఉదయం జరగదు. రాత్రి జరుగుతుంది."

"నేనేం చెయ్యాలి?"

"ఏమీ చెయ్యకు! ఏదీ ఆలోచించకు! అర్థమైందా? నువ్వతని సెక్రటరీవి! డ్యూటీ చేయ్! అతనికి అనుమానం రాకూడదు! రాత్రి జాగ్రత్తగా వెంటాడిరా! ఇక వెళ్ళు."

జాన్ బయటికి వచ్చి తిరిగి టాక్సీ యెక్కాడు.

ఆ మధ్యాహ్నం రెండు గంటలకి సక్సేనా బెంగుళూరు నుంచి తిరిగి వచ్చాడు. చాలా ఉత్సాహంగా వున్నాడు.

"మిస్టర్ పవన్, నువ్వెప్పుడేనా బెంగుళూరు వెళ్లావా? మన దేశంలోని పీఠభూములలో అదొకటి! వెళ్ళితీరాలి" అన్నాడు.

"నేను డార్జిలింగ్ వెళ్ళాను, సర్. అక్కడే నాకు డార్లింగ్ దొరికింది...." అన్నాడు జాన్ బిడియపడుతూ.

సక్సేనా చటుక్కున తలెత్తాడు.

"ఈజిట్? నీ డార్లింగ్ యెక్కడ? నీకు పెళ్ళయినట్టు చెప్పలేదే?"

"పెళ్ళి కాలేదు, సర్. పెళ్ళి కాకుండానే అన్నీ అయి పోతున్నాయి."

"నో, మిస్టర్ పవన్! నువ్వు పెళ్ళి చేసుకోవాలి."

"చేసేవారు లేరు, సర్."

"నేను చేస్తాను. నాకు పెళ్ళి చెయ్యడమంటే సరదా."

"కానీ—సర్—మీరెందుకు చేసుకోలేదు?"

"నేనేం చెప్పాను? పెళ్ళి చేయడం నా సరదా. చేసుకోడం కాదు!"

"నో, సర్! ముందు మీరు చేసుకోవాలి."

"ఈ వయసులోనా?"

"అవును. ఈ వయసులో కాదనుకుంటున్నారా?"

సక్సేనా సూటిగా చూశాడు: "బాయ్! నువ్వు నా దగ్గర హద్దుమీరి మాట్లాడుతున్నావు. తక్షణం నోర్మూసుకుని వెళ్ళకపోతే నువ్వూ వుండవు, నీ డార్లింగ్ వుండదు! వెళ్ళిక్కడ్నించి!"

జాన్ తలూపి బయటికి వచ్చాడు.

ఆ పగలూ, సాయంత్రం కూడా గడిచిపోయి చీకటి పడింది.

జాన్ కిప్పుడు చాలా ఆందోళనగా వుంది.

సక్సేనాను యెలా వెంటాడాలి?

ఇక్కడ ఆటోలు దొరకవు. టాక్సీలు దొరకవు. ఏదేనా వాహనం ఏర్పాటు చెయ్యమని లాల్‌కి ఫోన్ చేస్తే? ఈ ఆలోచన విరమించుకున్నాడు జాన్. రాత్రిపూట నిర్మానుష్యంగా వుండే హైవే మీద వెనక టాక్సీలోనో, ఆటోలోనో సక్సేనాను వెంబడించడం ప్రమాదకరం.

మరొక ఆలోచన వచ్చింది.

కానీ అందులో రిస్క్ వుంది. ప్రాణాలకు తెగించాలి.

జాన్ కాస్సేపు ప్రాణాల గురించి ఆలోచించాడు. తర్వాత తెగించాలనే నిశ్చయించుకున్నాడు. ఛస్తే ఏడ్చే వాడు లేనప్పుడు చావుకి భయపడటమెందుకు?

రాత్రి సరిగ్గా పది గంటలకి గదిలోని లైటార్పేసి

తలుపు లోపలినుంచి గడియపెట్టి, కిటికీలోంచి బయటికి జారుకున్నాడు.

కిందికి వచ్చాక సక్సేనా గదిలోకి తొంగి చూశాడు. అతను కాలుకాలిన పిల్లిలా పచార్లుచేస్తూ, మధ్యమధ్య వాచీ చూసుకుంటున్నాడు.

ఆ తర్వాత దినేష్ గది దగ్గర ఆగాడు. గది చీకటిగా వుంది. లోపలినుంచి గురక విన్పిస్తోంది.

ఆ తర్వాత మిస్ ప్రీతి గది ముందాగాడు. ఆమె గదిలో బెడ్‌మీద కూచొని పుస్తకం చదువుతూ మరో లోకంలో వుంది. జారిపోయిన పైటను చూసి జాన్ గదిలో జొరబడాలనుకున్నాడు. కానీ, కర్తవ్యం గుర్తుకు వచ్చి కళ్ళు మూసుకుని వెనక్కి తిరిగి కారు దగ్గరికి పరిగెత్తాడు.

చీకటిగా వున్న పోర్టికోలో ఆగివున్న సక్సేనా రెడ్ కలర్ బెంజి కారులోకి చూశాడు జాన్. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూశాడు. తనని యెవరూ గమనించటంలేదు.

ఛటుక్కున వెనుక డోర్ తెరికి లోపికి దూరాడు. తిరిగి డోర్ వేసుకుని సీటుకింద పడుకున్నాడు.

కొంత రిస్కు వున్నా, ఇంతకంటే క్షేమమయిన చోటు లేదు. డిక్కీలో దాక్కుంటే, ఆ తర్వాత బయటికి రావాలనుకుంటే, తననెవరేనా గమనిస్తున్నారేమో యెలా తెలుస్తుంది? తను తల బయటపెట్టిన మరుక్షణం పక్కనుంచి యెవరైనా వచ్చి గొంతు పుచ్చుకోవచ్చు—ఎవరికి తెలుసు?

అకస్మాత్తుగా జాన్ గుండె వేగం హెచ్చింది.

సక్సేనా ఒంటరిగా బయలుదేరతాడా, లేక దినేష్‌కూడా వెంట వెళతాడా?

దినేష్ కూడా వెంట వెళితే తను చిక్కులో పడతాడు.

అప్పుడు దినేష్ డ్రైవింగ్ సీట్లో కూచుంటే, సక్సేనా

వెనకసీట్లో కూచోబోయి, శవంలా పడుకున్న తనని చూసి గావుకేక వేస్తాడు—గుట్టు రట్టవుతుంది—నూకలు చెల్లిపోతాయి—

జాన్ ఆందోళన చెందాడు.

ఇప్పుడు తన ప్లాన్ అంతా దినేష్‌పైన ఆధారపడి వుంది.

దినేష్ కూడా వస్తే తను కారు దిగి టాటా చెప్పడం కంటే గత్యంతరం లేదు.

కానీ, దినేష్ రాలేదు.

సక్సేనా తూలుతూ బయటికి వచ్చాడు.

తాగి వున్నాడా?

జాన్ గాభరాగా తలెత్తి చూశాడు.

సక్సేనా గబగబ నడిచి వస్తున్నాడు. అతని బూట్ల చప్పుడు క్వారీలో కూలీలు రాళ్లు కొడుతున్నట్లు విన్పిస్తూ వుంది.

జాన్ కుదుటపడి యధావిధిగా పడుకున్నాడు.

డోర్ తెరుచుకున్న శబ్దమైంది.

సక్సేనా డ్రైవింగ్‌సీట్లో కూచొని కారు స్టార్టుచేశాడు.

జాన్ గట్టిగా ఊపిరిపీల్చి వదిలాడు.

కారు నెమ్మదిగా కదిలి వంకరటింకరగా వెళుతోంది. నిజంగా సక్సేనా తాగివున్నాడు. క్షేమంగా గమ్యస్థానం చేరుతాడా, లేక దారిలో .... పై లోకాలకి....

కారు గేటుదాటి రోడ్డెక్కింది. ఎత్తుపల్లాలుగా వున్న బంజారా హిల్స్ రోడ్లమీద సక్సేనా డ్రైవింగ్ జాన్‌కి భయం పుట్టిస్తోంది. అలాగే పడుకుని గట్టిగా కళ్లుమూసుకుని మనసు నిబ్బరం చేసుకున్నాడు.

అలా ఎంతసేపు పడుకున్నాడో తెలియదు. ఇప్పుడు

కారు పూర్తిగా నిర్మానుష్యంగా వున్న రోడ్డుమీద వురుకు తోంది. సిటీ దాటి బొంబాయి హైవేమీద ప్రయాణిస్తోంది.

వెనుక లాల్ వెంటాడుతున్నాడో లేదో తెలియదు.

హఠాత్తుగా కారు హైవే దిగి మట్టిరోడ్డుమీద వురక సాగింది. అయితే కూకట్‌పల్లి వచ్చేసిందన్నమాట.

జాన్ గుండెవేగం హెచ్చింది.

లాల్ వచ్చాడా? ఎలాటి ఏర్పాట్లు చేశాడు?

జాన్ కొద్దిగా తలెత్తి చూశాడు. బయట చీకట్లో ఏమీ కన్పించలేదు. వెన్నెలలేదు. వెనక విండ్ స్క్రీన్ లోంచి అస్పష్టంగా ధూళిమేఘం కన్పిస్తోంది.

కారు కొంతదూరం ప్రయాణించి అకస్మాత్తుగా ఆగింది.

జాన్ జాగ్రత్తపడ్డాడు.

స్థావరం వచ్చేసిందా?

రెండు క్షణాలు గడిచాయి.

కారు దగ్గరికి ఎవరూ రాలేదు.

సక్సేనా కారు దిగి నడిచాడు. అతని బూట్ల శబ్దం దూరమయ్యాక నెమ్మదిగా డోర్ తెరిచి దిగాడు జాన్.

గుండె వేగంగా కొట్టుకుంటోంటే, గబగబా వెళ్ళి గుబురుగా వున్న పొదల వెనక నిలబడ్డాడు.

విశాలంగా వున్న మైదానంలో, రివ్వున వీచే గాలికి పొదలు వూగుతున్నాయి. ఆకాశంలో గాలి చేసే హోరు భయంకరంగా విన్పిస్తోంది.

జాన్ చాలా జాగ్రత్తగా పొదల వెనక నిలబడి గమ నిస్తున్నాడు. చీకట్లో ఏమీ కన్పించడంలేదు. ఎవరి మాటలూ విన్పించడంలేదు... చివరికి చీకట్లో సక్సేనా కూడా అదృశ్యమయ్యాడు!

జాన్ గాభరాపడ్డాడు.

కళ్ళు చీల్చి చుట్టూ చూశాడు.

సక్సేనా ఎక్కడా కన్పించలేదు!

ఏమయ్యాడు?

అతని అనుచరులు ఎక్కడున్నారు?

జాన్ వొంట్లో చల్లటి రక్తం ప్రవహించింది.

ఈ సువిశాల మైదానంలో కటిక చీకట్లో ఏం జరుగబోతోంది?

సక్సేనా ఎటు మాయమయ్యాడు. తను పొదలోంచి బయటికి వచ్చి గాలించడం ప్రమాదకరం.

అసహనంగా కొన్ని క్షణాలు కాచుకున్నాడు.

హఠాత్తుగా అతని వెన్నులోంచి చలిపుట్టుకొచ్చింది. తన మెడకి ఏదో చల్లగా తగిలింది!

తటాలున వెనక్కి తిరగబోయాడు.

"చేతులెత్తు! నీ కోసమే వెతుకుతున్నాను...." విన్పించాయి మాటలు.

సక్సేనా స్వరం! ఇంత కర్కశంగా అతనెప్పుడూ పలకలేదు!

జాన్ ప్రాణాలెగిరిపోయాయి.

తను సక్సేనా చేతికి చిక్కాడు!

నిస్సహాయంగా చేతులెత్తి వెనక్కి తిరిగాడు. చీకట్లో సక్సేనా ముఖం స్పష్టంగా కన్పించలేదు. అతని ముఖ భావాలెలా వున్నాయో తెలీదు.

"గుడ్. మిస్టర్ జాన్! డిటెక్టివ్ ది గ్రేట్!" పక-పక నవ్వాడు సక్సేనా.

అతని నవ్వు జాన్ చెవుల్ని చిల్లులు చేసింది. అయినా చలించకుండా తటస్థంగా నిలుచున్నాడు.

"గుడ్—వెరీగుడ్! మీ కోతి చేష్టలతో మా ఆర్గనైజేషన్ని కొల్లగొట్టాలనుకున్నారు కదూ? చాలా తెలివిగా నా దగ్గర ఉద్యోగం సంపాదించావు! చాలా బాగా నటించావు! ఇప్పుడు - ఇప్పుడు - హహ్హా! నన్ను వెంటాడి నీ వెంట చావుని తెచ్చుకున్నావు! నీ పార్టనర్ ఇంకా రాలేదేమిటి? అతను పంక్చువాలిటీ పాటించడా? బాడ్ లక్! ఒకర్నొకరు వెంటాడి ప్రాణాలమీదికి తెచ్చుకున్నారు. చెప్పు, నిన్ను ఒంటరిగా పంపమంటావా, లేక నీ పార్టనర్తో జంటగా పంపమంటావా?—"

"ఎక్కడికి?"

వెనుకనుంచి విన్పించాయి మాటలు.

జాన్ గుండె జలదరించింది.

సక్సేనా చటుక్కున వెనక్కి తిరిగి, "ఎవరక్కడ!" అనర్చాడు.

"నువ్వు ఎదురుచూస్తున్న అతిథిని" లాల్ ముందుకు వచ్చి అన్నాడు.

"హాండ్సప్!" అర్చాడు సక్సేనా కఠినంగా, "కమాన్ బాయ్! కమాన్! మాటల్లోనే వచ్చావు—"

"నూరేళ్ళు బ్రతుకుతాను!" అన్నాడు లాల్ చేతులెత్తకుండానే.

"అలాగా? ముందు చేతులెత్తు!"

"ఎందుకు?"

జాన్ గాభరాగా చూశాడు.

"ఎందుకా? మీరిద్దరూ నేరుగా వచ్చి నా ట్రాప్లో ఇరుక్కున్నారు—ఫోర్ ఏసెస్ ట్రాప్! అండర్స్టాండ్?" అరిచాడు సక్సేనా.

"నో, మిస్టర్ సక్సేనా. మీరు పొరబడుతున్నారు.

మీరే ట్రాప్‌లో ఇరుక్కున్నారు!"

"వాట్!"

సక్సేనా రివాల్వర్‌తో లాల్ ముందుకు కదిలాడు.

"మిస్టర్ సక్సేనా, మమ్మల్నిద్దర్నీ మీరు చంపాలను కుంటున్నారు. కానీ—రివాల్వర్ ప్రయోగిస్తే మీరు పది మంది పోలీసులముందు హంతకులవుతారు—జీవితాంతం జైలు గోడలమధ్య వుండిపోతారు. ఆ స్థితిని మీరు కోరు కుంటున్నారా?"

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ స్పీకింగ్!"

"నాన్సెన్స్ కాదు. మన చుట్టూ ఇప్పుడు పోలీసులు వున్నారు. మీరేమీ పిచ్చిపనులు చేయకుండా రివాల్వర్ నాకిచ్చి లొంగిపొండి!" లాల్ ముందుకు కదిలాడు.

"నో!" అర్చాడు సక్సేనా బలహీనంగా.

హఠాత్తుగా పొదల వెనుకనుంచి ఇన్‌స్పెక్టర్ కృష్ణన్ వచ్చి సక్సేనా చేతిలో రివాల్వర్ తీసుకున్నాడు.

పదిమంది పోలీసులు వెంటనే చుట్టుముట్టి సక్సేనాను పట్టుకున్నారు.

లాల్, జాన్ చెయ్యి పట్టుకుని దూరంగా లాక్కెళ్లాడు.

సక్సేనా పోలీసులతో పెనుగులాడుతూ అరుస్తున్నాడు.

చీకటి మైదానంలో అతని అరుపులు చిన్నపిల్లవాడు మారాం చేస్తున్నట్టు విన్పిస్తున్నాయి.

పోలీసులు తమ పద్ధతిలో బుజ్జగిస్తున్నారు.

70

"గుడ్‌లక్, పార్టనర్. నువ్వు క్షేమంగా వున్నావు!" అన్నాడు లాల్ కారు స్టార్టుచేస్తూ.

"నేనింకా నమ్మలేకపోతున్నాను లాల్. సక్సేనాను పట్టుకోవడం అంత సులభమా?" జాన్ అన్నాడు.

"చాలా కష్టమనుకున్న కొన్ని పనులు చాలా సులభంగా జరిగిపోతుంటాయి" అన్నాడు లాల్, "సక్సేనా విషయంలో ఇలాగే జరిగింది. సువ్రతని ఉద్యోగంలో చేరినప్పుడే మోసపోయావని నాకు తెలుసు. ఆ ఉద్యోగం ప్రత్యేకంగా మనకోసం సృష్టించబడిందని గమనించు జాన్."

"ఎలా?"

"సక్సేనా ఇక్కడికొచ్చాడు—విశ్రాంతి నిమిత్తం. విశ్రాంతి అన్నది సాకు. దాని వెనక ఆర్గనైజేషన్ కార్యకలాపాలు సాగించడానికి వచ్చాడు. అయితే తన నెవరేనా అనిమానిస్తున్నారేమో పరీక్షించాలనుకున్నాడు. ఎవరను మానిస్తారు? పోలీసులు లేదా—పోలీసుల తరపున పనిచేసే డిటెక్టివ్‌లు—మనం. తన అనుమానం రూఢిచేసుకోడానికి ఆ సెక్రటరీ ఉద్యోగం సృష్టించాడు. అతనిమీద మన కనుమానం వుంటే ఈ ఉద్యోగంలోచేరి తీర్చుకుంటామని అతని నమ్మకం. ఎప్పుడైతే అతనిమీద మనం అనుమానం తీర్చుకుంటామో, అది పసిగట్టి మనల్ని అంతం చెయ్యాలని అతని ఆలోచన. ఇదంతా జరగడానికి చక్కటి నాటకరంగం సిద్ధం చేశాడు."

"ఏమిటది?"

"మొదటిది ఉద్యోగం. రెండవది నీకిచ్చిన ఉపన్యాసం. మూడవది మిస్ ప్రీతి చదివి విన్పించిన ఉత్తరం. ఆ ఉత్తరం అతని ప్లానులో ఒక భాగం. మిస్ ప్రీతి చాలా బాగా నటించి నిన్ను ఫూల్‌ని చేసింది. ఆ ఉత్తరం నీకు విన్పిస్తే — సువ్రతను అనుమానిస్తున్నట్టు డిటెక్టివ్ అయితే, ఆ ఉత్తరంలోని రహస్యం తెలుసుకుని అతన్ని వెంబడిస్తావని అతని వ్యూహ. అనుకున్నట్టు నువ్వా

ఉత్తరంలోని రహస్యం తెలుసుకున్నావు. అంతేగాక అతన్ని వెంబడించావు. దాంతో నువ్వు పోలీసు మనిషని అతనికి తెలిసిపోయింది.... ఆ తర్వాత ఏం జరిగిందో నీకు తెలుసు."

జాన్ ఆశ్చర్యంలోంచి తేరుకుని అన్నాడు, "ఆ క్షణాన నువ్వొస్తావనుకోలేదు. లేకపోతే నేను చచ్చేవాణ్ని. సక్సేనాను అంత క్రూరంగా నే నెప్పుడూ చూడలేదు."

"ఫోర్ ఏసెస్‌లో నెంబర్ టూ చిక్కాడు. మిగతా ముగ్గుర్ని వేటాడాలి.... కమాన్, జాన్, వెనక సీట్లో బ్రీఫ్‌కేసులో భూటాన్ విస్కీ, గ్లాసులున్నాయి.... లెటజ్ హావ్ డ్రింక్స్, అండ్ గెట్ హెల్ అవుటాఫ్‌హియర్!" అన్నాడు లాల్.

71

మర్నాడు ఉదయం సక్సేనా అరెస్టు వార్త రేడియో లోనూ, పత్రికల్లోనూ వెలువడుతుం దనుకున్నారు డిటెక్టివ్‌లు. కానీ అలా జరకపోవడంతో పోలీసులు దాన్ని రహస్యంగా వుంచదలిచినట్టు భావించి కుదుటపడ్డారు.

కానీ, ఇంతలోనే కృష్ణన్ డిటెక్టివ్‌లను చావుదెబ్బ కొట్టే వార్త మోసుకొచ్చాడు.

బలహీనంగా నవ్వి, కుర్చీలో కూలబడి, కళ్ళలో కళ్ళు కలపలేక నేలచూపులు చూస్తూ అన్నాడు:

"అయాం సారీ, ఫ్రెండ్స్. బాడ్‌లక్! ఫోర్ ఏసెస్ మళ్ళీ మిమ్మల్ని ఫూల్స్ చేసింది.... ఈ విషయం చెప్పడానికి నాకు నోరు రావడంలేదు. కానీ నా డ్యూటీ నిర్వహించాలంటే చెప్పితీరాలి. రాత్రి మనం పట్టుకున్నది గౌతమ్ సక్సేనా కాదు...."

"వాట్! ఎవరు?" అర్చాడు లాల్.

జాన్ నోట మాట రాలేదు.

"ఎవరితోనూ సంబంధంలేని అనామకుడు. మారువేషం వేశాడు. అసలు సక్సేనా బంగళాలో, బెడ్ మీద వున్నాడు. ఆ అగంతకు డెవరో తనకు తెలియదన్నాడు ఆగంతకుడు తనెవరో చెప్పడంలేదు.... చిక్కు సమస్య!"

"ఆగంతకుడు సక్సేనా కాడా?" జాన్ అడిగాడు పూడుకుపోయిన స్వరంతో.

"కాదు. అతని పరివారమంతా బంగళాలోనే వుంది. ఆ ఆగంతకుడితో తన కెలాటి సంబంధం లేదని గౌతమ్ అంటున్నాడు."

లాల్ ముఖం ఎర్రబడింది.

"మోసం జరిగింది! ఆగంతకుడు సక్సేనా మనిషే! జాన్‌ని చంపడానికి నియమింపబడ్డాడు కాబట్టి సక్సేనా వేషం వేసుకొని బయలుదేరాడు. కానీ పట్టుబడ్డాడు. జాన్ నన్ను కలుసుకున్నట్టు, నే నక్కడ పోలీసులతో వచ్చినట్టూ అతనికి తెలీదు. అతని ప్రయత్నం ఫలించలేదు! పట్టు బడ్డాడు. అతను నోరు విప్పడు. అది ఆర్గనైజేషన్ ప్రత్యే కత! సక్సేనాని రక్షించడం అతని ధ్యేయం. మనం ఏమీ చెయ్యలేం—ఎలాటి ఆధారాలూ లేవు, సక్సేనా దోషిగా నిరూపించడానికి. ఫోర్ ఏసెస్ మళ్ళీ గెలిచింది!"

"లాల్—ఆ ఆగంతకుడు నెంబర్ ఫోర్, మాస్టర్ కిల్లర్ ఎందుక్కాకూడదు? వేషాలెయ్యడంలో అతను మొన గాడు కదా?" జాన్ అడిగాడు.

"కావచ్చు, కాకపోవచ్చు. మాస్టర్ కిల్లర్‌ని మనం ఎప్పుడూ చూడలేదు" అన్నాడు లాల్.

"ఇక ఆ విషయం మర్చిపోదాం" కృష్ణన్ అన్నాడు

కల్పించుకుని, "ఫోర్ ఏసెస్‌ని గెలిచే అవకాశాలు కొన్ని యివ్వాలి. ఎక్కడో పొరబాటు చేస్తారు. అప్పుడు పట్టుబడతారు. అప్పటి వరకు మనం వోపిక పట్టాలి....

"ఫ్రెండ్స్, మరొక వార్త—ఈ వార్తకి మీ కేసుతో ఎలాటి సంబంధం లేదు కానీ—చాలా ఆసక్తికరమైన విషయం కాబట్టి కాలక్షేపం కోసం చెప్తున్నాను. పదేళ్ళ క్రితం ఇండియా వదిలి అమెరికాలో స్థిరపడ్డ రచయితగా గవాస్కర్ మీకు తెలుసా?"

లాల్ ముఖం చిట్లించాడు; "పూర్తి పేరు?"

కృష్ణన్ తల గోక్కున్నాడు.

"మనమోహన్ గవాస్కర్. అటు యూరప్‌లోనూ యిటు ఆసియాలోనూ అతనికి మంచి పేరు వుంది. ముందు చూపుతో రచనలు చెయ్యడం అతని ప్రత్యేకత. ఇటీవల అతను పెట్రోలు సంక్షోభం గురించి వ్రాపిన థ్రిల్లర్ నవల బెస్టు సెల్లర్ లిస్టులో మూడో స్థానం ఆక్రమించింది. దాన్ని యిటీవల ఇండియాలో కూడా పబ్లిష్ చేశారు. మూడు నెలల్లో ఆరు ప్రచురణలు పొందింది!"

"వెల్, మిస్టర్ కృష్ణన్, పుస్తకాలమీద మీకు ఆసక్తి ఎప్పుడు పుట్టింది?"

"పుస్తకాల మీదా? నా కెప్పుడూ లేదు! హోటల్ మయూర్‌లో జరిగిన సంఘటనవలన యీ వివరాలన్నీ తెలుసుకోవలసి వచ్చింది...."

"హోటల్ మయూర్! మొదటి ప్రొఫెసర్ హత్య అక్కడే జరిగింది కదూ?"

"అవును."

"అయితే ఈ రచయిత గురించి ఏమిటి?"

"పదేళ్ళ క్రితం అతను ఉద్యోగరీత్యా అమెరికా వెళ్ళి

పోయాడు. కానీ, కొన్నాళ్ళకి వుద్యోగం మానేసి రచనలు ప్రారంభించాడు. అదే వృత్తిగా ఎన్నుకున్నాడు. ఇంగ్లీషులో రచనలెంత లాభసాటియో మీకు తెలుసు. విశేషంగా డబ్బు గడించవచ్చు. అయితే, గవాస్కర్ యీ పదేళ్ళలో ఇండియాకి ఒక్కసారి కూడా రాలేదు.... మొన్న....వారం రోజులు క్రితం ఇక్కడికి కొచ్చాడు."

లాల్ ముఖం చిట్లించాడు: "ఎందుకు?"

"మరో నవల వ్రాయటానికి ప్లాట్ కోసం వచ్చినట్టు చెప్పాడు."

"ఎలాటి నవల?"

"చెప్పలేదు."

"సరే—అసలేం జరిగింది?"

"అసలు విషయానికి వస్తాను. నిన్న సాయంత్రం ఆరు గంటలకి అతను బస చేసిన హోటల్ గదిలో పార్టీ ఏర్పాటు చేసి స్థానిక రచయితల్నీ, జర్నలిస్టులనీ ఆహ్వానించాడు. అందరూ వచ్చారు. గవాస్కర్ రచనల్ని మెచ్చుకున్నారు. నేటి వుదయం పత్రికల్లో యీ వార్త వచ్చింది—కానీ మీలో యెలాటి రియాక్షన్ లేదు కాబట్టి చదవలేదనుకుంటాను.

"మిస్టర్ లాల్, పార్టీకి వచ్చిన రచయితల్లో సోమసుందర్ ఒకడు. అతను అకస్మాత్తుగా చనిపోయాడు."

లాల్ జాన్ ముఖం చూశాడు. జాన్ శ్రద్ధగా వింటున్నాడు.

"ఎలా?"

"గుండెపోటు అని డాక్టర్సు అంటున్నారు. కానీ రుజువు లేదు."

"సోమసుందర్ వయసెంత వుంటుంది?"

"ముప్పై."

లాల్ నవ్వాడు, "ముప్పై యేళ్ళకి గుండె పోటు యేమిటి?"

"నాకూ యీ అనుమానం వచ్చింది. డాక్టర్స్ కూడా ఇదే ఆలోచిస్తున్నారు. సోమసుందర్‌కి భార్యా పిల్లలుగానీ, బంధువులుగానీ, ఎవరూ లేరు. అతన్ని చూస్తే అనారోగ్యంగా వున్న మనిషిలా కన్పించడు. మిస్టర్ లాల్, అతనికి గుండెపోటు రాలేదని నా అనుమానం. విషం యివ్వబడిందని నా నమ్మకం."

"విషమా? యెందుకు? అతనికి శత్రువులున్నారా?"

"ఈ యుగంలో శత్రువులేని వ్యక్తి ఎవరు?"

"పోస్టుమార్టం జరిగిందా?"

"జరిగింది. కానీ—విషం యివ్వబడినట్టు ఋజువు కాలేదు."

"విషం ఇవ్వబడిందని మీ కనుమానం ఎందుకొచ్చింది? అతన్ని చంపే అవసరం ఎవరికి వుంది?"

"పార్టీలో స్కాచ్, విస్కీ ధారాళంగా ప్రవహించాయి. సోమసుందర్ తన కివ్వబడిన గ్లాసులోని ద్రవం రెండు గుటకలు తాగి కుర్చీలో కూచున్నాడు—అంతే—బాధగా మూల్గి కిందపడ్డాడు. చనిపోయాడు."

"అతనికా గ్లాసు ఎవరిచ్చారు?"

"తెలియదు. అతనే నింపుకుని వుండవచ్చు."

"ఇంకెవరికీ ఎలాటి హాని జరగలేదా?"

"లేదు. వెంటనే మిగిలిన పదార్థాల్ని లాబ్‌లోకి పంపాం. వాటిలో ఎలాటి కల్తీ లేదని రిపోర్టు అందింది."

"అయితే యేమిటీ మిస్టర్? సుందర్ యెలా చనిపోయాడు?"

"మిస్టర్ లాల్, అతని కుడి తొడమీద వెనుకభాగంలో కాలిన మచ్చ వుంది. ఆ మేరకు ప్యాంట్ కూడ కాలింది...."

జాన్ తికమకపడ్డాడు.

"ఎలా కాలింది?" అడిగాడు లాల్.

"బహుశ సిగార్‌వల్ల కావచ్చు. ఆ కుర్చీలో కాలుతున్న సిగార్ యెవరేనా పెట్టి మర్చిపోయి వుండవచ్చు. సుందర్ అది చూడకుండా కూచొని వుండవచ్చు...."

"అతను కిందపడినప్పుడు సిగార్ కుర్చీలో వుందా?"

"కాదు—నేలమీద."

"కాలుతోందా?"

"నేను వెళ్ళినప్పుడు కాలుతోనే వుంది?"

"సరిగ్గా ఎన్నిగంటలకి చావు సంభవించింది? మీరెప్పుడు వెళ్ళారు?"

"ఆరు ముప్పై అయిదుకి ఆ సంఘటన జరిగింది. పావు గంటలో నేనక్కడ చేరుకున్నాను."

"ఇప్పుడు చెప్పండి—అతనా సిగార్‌వల్ల చనిపోయే అవకాశం వుందా?"

"సిగార్‌వల్లనా? ఎలా?"

"సిగార్ విషపూరితమైనది కావచ్చు."

కృష్ణన్ ముఖం ఎర్రబడింది.

లాల్ భారంగా వూపిరి వదిలాడు.

"అంతమందిలో అతన్నెవరు చంపారు? ఆల్‌రైట్, గవాస్కర్ గురించి యింకా వివరాలు చెప్పండి. అతనిక్కడ ఒంటరిగా వుంటున్నాడా? వయసెంత?"

"సుమారు నలభై అయిదు వుండవచ్చు. అతని మేనకోడలు, మరొక నౌకరుతో వుంటున్నాడు. గవాస్కర్

స్వంత వూరు రాజస్థాన్‌లోని చిన్న పల్లెటూరు. పదేళ్ళ తర్వాత యిదే రావటం. ఇక్కడతని స్నేహితులు గానీ, బంధువులుగానీ ఎవరూ గుర్తుపట్టలేనంతగా మారిపోయాడు. మేనకోడలు షీనా ఎలాగో పోల్చుకోగల్గిందట. ఆమె ఎయిర్‌హోస్టెస్‌గా పని చేస్తోంది. ప్రస్తుతం సెలవుమీద మేనమామతో కలిసి వుంది."

జాన్ అన్నాడు: "వెల్! సోమసుందర్ చావు సహజమైనదనుకుంటే ఎలాటి సమస్యలు లేవు. కానీ అసహజమనుకుంటే అది హత్య అనుకోవాలి. అతన్నెవరు హత్య చేస్తారు? ప్రత్యేకంగా యీ పార్టీలోనే చంపవలసిన అవసరమేమిటి? కృష్ణన్—ఇది పొరపాటున జరిగిన హత్య అని నా అనుమానం. మీ అభిప్రాయం?"

"అంటే....? సోమసుందర్ మరొకరి స్థానంలో మరణించాడా?"

"అది నా అనుమానం. అసలా స్థానం గవాస్కర్‌ది కావచ్చు. ఏమంటారు?"

"మీకు మతిపోయింది! ఇండియాలో అతనికి శత్రువు లెవరు? అతను పదేళ్ళ తర్వాత వచ్చాడని గుర్తుంచుకోండి!"

"అవును. పదేళ్ళ తర్వాత వచ్చాడు. వారం క్రితం వచ్చాడు. అయితే స్వగ్రామంలో స్వంత మనుషుల దగ్గర గడపక యీ హైద్రాబాద్‌కి ఎందుకొచ్చాడు? అతను వ్రాసే మరో నవల యేమిటి? మిత్రులారా! ఇకనైనా మీ మెదడుకేదేనా తడుతోందా?" నవ్వాడు జాన్.

"అంటే, అతను ఫోర్ ఏసెస్ గురించి—" ఆగిపోయాడు లాల్.

"వివరాలు తెలుసుకుని కథ వ్రాసుకు పోదామని

వచ్చాడు" పూర్తిచేశాడు జాన్. "ఫోర్ ఏసెస్ కిది ఇష్టం లేదు. అందువల్ల నిన్నరాత్రి అతనిమీద హత్యాప్రయత్నం జరిగింది—కానీ పొరపాటున మామూలు రచయిత చనిపోయాడు. సోమసుందర్ పేరున్న రచయిత కాదు. అవునా? పైగా అతను సోషల్ వ్రాస్తాడు."

"అవును" అన్నాడు కృష్ణన్.

"అందువల్ల అతనివల్ల పీక్రెట్ గ్యాంగ్‌కి ప్రమాదం లేదు."

లాల్ అన్నాడు:

"వెరీ వెల్, కృష్ణన్. ఈ కేసులో నాకేదో వింతవాసన సోకుతోంది....ఫోర్ ఏసెస్‌తో సంబంధమున్న కేసు.... మళ్ళీ గవాస్కర్‌మీద హత్యాప్రయత్నం జరగవచ్చు. మేం వెంటనే వెళ్ళి కలుసుకుంటాం. సుందర్ హత్యకు మాస్టర్ కిల్లర్ కారకుడని నా అనుమానం—డేంజరస్ ఫెలో! కన్నింగ్ బాస్టర్డ్! గవాస్కర్ ప్రాణాలు మనం రక్షించాలి!"

"మంచిది" కృష్ణన్ అన్నాడు, "అయితే సక్సేనా గురించేమిటి?"

"ఏం చేయగలం? అతనిమీద నిఘా వుంచండి. కృష్ణన్, ఈ ఆర్గనైజేషన్ ప్రత్యేకత తమ కార్యకలాపాలకి ఎక్కడా ఆధారాలు లేకుండా చెయ్యడం. ఇంతవరకు ఈ ప్రత్యేకత వల్లనే గెలుస్తూ వచ్చారు. నేను త్వరపడదలచుకోలేదు. యికనుంచి వాళ్ళ పథకాల్లోని వీక్ పాయింట్స్ జాగ్రత్తగా గమనించి, వాటి సహాయంతోనే వాళ్ళ మీద దెబ్బ తీస్తాను....

"మళ్ళీ వాళ్ళ చేతిలోవున్న ఫార్ములా ప్రయోగం జరగలేదు. అందుకు రెండు కారణాలుండవచ్చు: ఆత్మవిశ్వాసం

సన్నగిల్లి తమ ఉనికికి ప్రమాదం యేర్పడుతుందన్న భయం కలిగి వుండవచ్చు. లేదా—ఆ ఫార్ములాను విదేశాలకి అమ్మే ప్రయత్నంలో వుండవచ్చు.

"వెల్, మీరిక వెళ్ళండి. మేం గవాస్కర్‌ని కలుసుకుని మీకు వివరాలందజేస్తాం. సక్సేనా మీద గట్టి నిఘా వుంచండి."

చెప్పడం ముగించి సిగరెట్ అంటించాడు లాల్.

72

ఇరవై ఏళ్ళ అందమైన యువతి తలుపు తెరిచి ప్రశ్నార్థకంగా చూపింది. ఆమె తేనె రంగు కళ్ళు చూసి జాన్ నరాల్లో సంచలనం బయలుదేరింది. ఆమె ఆకర్షణీయమైన ముక్కు చూసి లాల్ ముగ్ధుడయ్యాడు.

"వెల్, మిస్—మీరు షీనా కదూ?"

తలూపిందామె.

"మిస్ షీనా, మీ మామయ్య ఏడీ?"

ఆమె అడ్డుతొలిగి, "ప్లీజ్ లోనికి రండి....అంకుల్‌తో ఏం పని?" అంది. ఆమె తియ్యటి కంఠం విని జాన్ కళ్ళు తిరిగాయి.

లాల్ జేబులోంచి కార్డుతీసి, ఆమెకిచ్చి, "మేం డిటెక్టివ్‌లం. మీ అంకుల్‌తో అత్యవసరంగా మాట్లాడాలి" అన్నాడు.

"సారీ — వీలుకాదు. ఆయన తలనెప్పితో బాధ పడ్తున్నారు" అందామె చాలా ప్రశాంతంగా, సౌమ్యంగా "మీరు—మిస్టర్ లాల్....?"

"అవును, నేనే లాల్ని."

"మిస్టర్ లాల్. అంకుల్‌ని డిస్టర్బ్ చెయ్యడం మంచిది కాదు. ఏమిటి మీరు మాట్లాడే విషయం?"

"నిన్న రాత్రి సంఘటన. పార్టీలో ఒక వ్యక్తి మరణించాడు. పేరు సోమసుందర్."

ఆమె ఛటుక్కున అంది, "అవును—అతను గుండె పోటుతో చనిపోయాడు."

"అది గుండెపోటు కాదని డాక్టర్స్ అనుమానిస్తున్నారు."

మళ్ళీ ఛటుక్కున అందామె, "అయితే బల్వంత్ చెప్పిందే జరిగుండవచ్చు."

"బల్వంత్ ఎవరు?"

"మా నౌకరు. బయటికెళ్ళాడు."

"ఏం చెప్పాడు?"

"సోమసుందర్‌ని ఎవరో పొరపాటున చంపేశారని"

డిటెక్టివ్‌లు అమాంతం లోనికి వచ్చి సోఫాల్లో కూచున్నారు.

"కమాన్ షీనా. ఇలా వచ్చి కూచోండి. మీతో చాలా విషయాలు మాట్లాడాలి" అన్నాడు లాల్.

మిస్ షీనా హంస నడకతో వచ్చి జాన్ ఎదురుగా కూచుంది. ఆమె ఒక్కో అడుగు వేస్తోంటే జాన్ గుండెలో గజ్జలు మోగాయి.

"ఇప్పుడు చెప్పండి షీనా, అసలేమిటిది?" లాల్ అడిగాడు.

ఆమె ఒక్క క్షణం ఆగి తడబడుతూ అంది.

"అసలు—అసలు—అంకుల్‌ని చంపాలనుకున్నారు-కానీ—"

"ఎవరు?" అడిగాడు లాల్, "మీ అంకుల్ ఈ సిటీకి కొత్త. ఇక్కడ శత్రువు లెవరున్నారు?"

ఆమె అడ్డంగా తలూపింది, "నాకు తెలీదు. నాతో

అంకుల్ చాలా ముభావంగా వుంటాడు. కారణం మరేమీ లేదు—నన్ను పదేళ్ళ క్రితం, చిన్నతనంలో చూశాడు. ఇంత త్వరగా—వారంరోజుల్లో సన్నిహితం కావడం కష్టం. ఈ పిటీకి వచ్చి రెండు రోజులైంది. మొన్న ఉదయం వచ్చాం. నిన్న ఉదయం చాలా భయపడు తున్నట్టు కన్పించాడు. ఎందుకో చెప్పలేదు. కానీ నాకో అనుమానం వుంది—మిస్టర్ లాల్, మీరెప్పుడేనా 'ఫోర్ ఏసెస్ ఆర్గనైజేషన్' పేరు విన్నారా?"

లాల్ తటాలున ముందుకి వంగాడు.

"ఫోర్ ఏసెస్! మిస్ షీనా, ఈ ఆర్గనైజేషన్ గురించి మీకేం తెలుసు?"

"నాకేమీ తెలీదు" అంది షీనా ప్రశాంతంగా, "అంకుల్ యేదో పుస్తకం వ్రాస్తున్నాడు. దాని పేరు: 'అదృశ్య హస్తాలు'. నిన్న పుదయమంతా వ్రాస్తూ కూర్చున్నాడు. ఇంతలో ఫోన్ వచ్చింది. నే నందుకున్నాను. అవతల ఎవరో వ్యక్తి మాట్లాడుతూ, తాను 'ఫోర్ ఏసెస్ ఆర్గనైజేషన్ మనిషనీ రిసీవర్ అంకుల్ చేతి కివ్వమనీ' అన్నాడు. అంకుల్ అవతలి వ్యక్తి మాటలు విని చాలా అప్‌సెట్ అయ్యాడు. ఏమిటని అడిగాను. ఏమీ చెప్పలేదు. అంతే, మూడ్ చెడిపోయింది. ఆ పగలంతా అలాగే దిగులుగా, భయంగా గడిపాడు....సాయంత్రం పార్టీలోకూడా సరిగా పాల్గొనలేదు."

"అయితే ఆ అదృశ్యవ్యక్తి హత్యకి ప్రయత్నించాడంటారా?"

"అవును."

"ఈ విషయం పోలీసులకి చెప్పారా?"

"లేదు. అప్పుడు నాకీ అనుమానం రాలేదు."

"మంచిది. ఆయన వ్రాసే పుస్తకం స్క్రిప్టు ఎక్కడ వుంది?"

ఆమె అనుమానంగా చూపింది: "ఎందుకు? ఆయన స్క్రిప్టు ఎవరికీ చూపించడు. ప్రింటింగ్‌లోనే చదువుకోవాలి."

"నా వుద్దేశ్యం అదికాదు. ఆ స్క్రిప్టు ఉన్నచోట వుందో లేదో చూసుకోమంటున్నాను."

"అంటే—దానికోసం హత్య జరిగిందంటారా?"

"స్పష్టమవుతోనే వుంది. ఆయన పుస్తకం వ్రాయడం హంతకుడికి ఇష్టంలేదు. వెంటనే చూడండి—"

లాల్ ఇంకా చెప్పేలోపున ఆమె లేచి ఎదురుగా గదిలోకి వురికింది.

డిటెక్టివ్‌లు కాచుకున్నారు.

కొన్ని క్షణాలయ్యాక, "మిస్టర్ లాల్!" అనర్చింది షీనా.

"ఏమిటి మిస్ షీనా?" లాల్ అడిగాడు గాభరాగా లేస్తూ.

"త్వరగా రండి! ఇక్కడ—ఇక్కడ—"

లాల్, అతని వెనక జాన్ గబగబ గదిలోకెళ్ళారు.

73

తెరిచివున్న షెల్ఫ్ ముందు మిస్ షీనా కొయ్యబొమ్మలా నిలుచుని వుంది. పాలిపోయిన ముఖం, కాంతిలేని ఆమె కళ్ళుచూసి జాన్ కంగారుపడ్డాడు.

బెడ్‌మీద సుమారు నలభై ఏళ్ళ మనిషి కూచొని వున్నాడు. అతని ముఖం ఆందోళనగా వుంది. అతను గవాస్కర్ అని డిటెక్టివ్‌లు పోల్చుకున్నారు.

"ఏం జరిగింది మిస్ షీనా?" లాల్ అడిగాడు ఆమె దగ్గ

అందరూ అనుమానితులే?

(పాఠకుల పరిశోధన పోటీ-100 ఫలితాలు)

హంతకులు: రాజేష్ రూమ్మేట్స్ మురళి, ప్రసాద్ లు.

అనుమానితులు మొత్తం నలుగురు. వారిలో సునీతకు ప్రేమించిన వాడిని హత్య చెయ్యాల్సిన అవసరం లేదు.

సునీత బావ గోపాల్‌కు కక్ష వున్నా అవకాశం లేదు. కారణం రాజేష్ స్లోపాయిజన్ ప్రయోగించబడి మరణించాడు. గోపాల్‌కు స్లోపాయిజన్ ప్రయోగించే అవకాశం ఎక్కడా లేదు.

ఇక మిగిలినది రాజేష్ రూమ్మేట్స్ ప్రసాద్, మరళీలు. ముగ్గురూ క్యారియర్ తెప్పించుకు తింటారు. కావున రోజూ కొద్ది కొద్దిగా స్లోపాయిజన్ ప్రయోగించే అవకాశం వారిద్దరికే వుంది. వా రిద్దరు సునీత చేత తిరస్కరింపబడ్డారు. తమకు దక్కని అందాన్ని రాజేష్ సొంతం చేసుకుంటున్నాడనే జెలసీతో అతన్ని హత్య చేశారు.

—పై ఆధారాలతో ఈ కేసును అత్యుత్తమంగా పరిశోధించిన యీ క్రింది ఇరువురు పాఠకులకు చెరొక పాతిక రూపాయలు చొప్పున బహుమతి పంపుతున్నాము.

(1) శ్రీ బి. రాజేశ్వరమూర్తి, బి.ఏ., బి.కాం.,
కో ఆపరేటివ్ రిజిష్ట్రారు,
20/270, నెహ్రూ నగర్,
మచిలీపట్టణం - 2.

(2) శ్రీమతి కె. వేదవతి, బి.ఏ.,
c/o వి. వి. నాగేశ్వరరావు,
20/250, ఆంధ్రరత్న రోడ్,
చీరాల - 523 155,
(ప్రకాశం జిల్లా).

రికి నడుస్తూ.

ఆమె తేరకుని షెల్ఫ్ తలుపులు విశాలంగా తెరిచింది.

"స్క్రిప్టు లేదు!" అర్చిందామె.

ఆమె మాటలు విని లాల్ బిత్తరబోయి లోనికి తొంగి చూశాడు. ఖాళీగా వుంది.

వెనక్కి తిరిగి గవాస్కర్‌ని చూశాడు.

"వెల్, మిస్టర్ గవాస్కర్, గ్లాడ్ టు మీట్యూ! మీ గదిలో జరిగిన ట్రాజెడీకీ చాలా విచారిస్తున్నాం. స్క్రిప్టు మీరు షెల్ఫ్‌లోనే వుంచారా? చివరిసారిగా యెప్పుడు చూశారు?"

గవాస్కర్ తల పట్టుకుని చిన్నగా మూల్గాడు.

"నిన్న మధ్యాహ్నం ఆ షెల్ఫ్‌లోనే పెట్టాను. అప్పటి నుంచి తీయలేదు."

"మరి ఏమైనట్టు?"

"నాకు తెలియదు___"

"నిన్న రచయితలకి పార్టీ ఇచ్చారు. వాళ్ళు తస్కరించే అవకాశం వుందా?"

"అలాటి రచయితలుంటారా?"

"మీరు వ్రాసే పుస్తకం ఇతివృత్తం ఏమిటి?"

"నేనేం వ్రాస్తున్నానో యెవరికీ చెప్పను."

లాల్ అడ్డంగా తలూపాడు.

"'అదృశ్య హస్తాలు' అనే పుస్తకం వ్రాస్తున్నట్టు షీనా చెప్పింది. అవునా? దాని ఇతివృత్తం కూడా చెప్పండి."

"చెప్పను. నేనేం వ్రాస్తున్నానో యెవరికీ చెప్పను. ప్లాట్ విషయంలో ఎవరి సలహా తీసుకోను. వివాదాస్పదమైన విషయాలేవేనా వుంటే, ఎంతో సన్నిహితులైతేతప్ప యెవరితోనూ చర్చించను. నాకు సన్నిహితులు చాలామంది